ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
శుక్రవారం 18 ఆగస్టు 2017 | 16

టెండర్ల లాలూచీ వెనుక..

ఓ ఇంజనీరు మంత్రాంగం

- ఆర్అండ్‌బీలో కమీషన్ల కక్కుర్తి
- ఇంజనీర్ల పర్సంటేజీలు 7 శాతం
- కాంట్రాక్టర్లకు ఐదు శాతం లబ్ధి
- తెలుగుదేశం నేతకు ఐదు శాతం కమీషన్
- ఆ నలుగురికే పనులివ్వాలన్న 'దేశం' నేత
- టెండర్లపై వివరణ కోరిన ఈఎన్‌సీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కలకలం

- వివరాలు 8



న్యాయస్థానం..

ఉరిమింది!

- హత్య కేసులో సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- ముద్దాయి కుక్కల వెంకటేశ్వర్లుకు ఉరిశిక్ష
- గతేడాది పట్టపగలు ఆడిటర్ భార్య హత్య
- మరో జంట హత్యల కేసులో ఇదే కోర్టు.. ఇదే ముద్దాయికి జీవిత ఖైదు విధించింది
- 2 దశాబ్దాల అనంతరం జిల్లాలో 'ఉరిశిక్ష' తీర్పు

న్యాయస్థానం 'ఉరి'మింది. సాటి మనిషిని అతి కిరాతంగా చంపడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి నేరాలకు మరొకరు పాల్పడాలంటే భయపడే విధంగా తీర్పు వెలువరించింది. వరుస హత్యల నేరస్థుడు కుక్కల వెంకటేశ్వర్లుకు 'ఉరే సరి' అని ప్రకటించింది. బంగారు నగల కోసం ఓ ఆడిటర్ భార్యను సుత్తితో తలపై మోది హత్య చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కుక్కపల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌కు ఉరి శిక్ష విధిస్తూ నెల్లూరు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. ఈ హత్య అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు గ్రామంలో వృద్ధులైన పూజారి దంపతులను హత్య చేశాడన్న కేసులో కూడా నేరం రుజువు కావడంతో ఇదే కోర్టు ఇదే ముద్దాయి వెంకటేశ్వర్లు బతికి ఉన్నంత వరకు జీవితఖైదు అనుభవించాలని గతంలో తీర్పునివ్వడం గమనార్హం.



- వివరాలు 8

1. 9-7-2016న నెల్లూరులో హత్యకు గురైన ప్రభావతి
2. 2-4-2016 నెల్లూరులో హత్యకు గురైన పూజారి భార్య పుష్పవేణి

కోట..

డెంగ్యూ బాట

- మంచం పడుతున్న కాలనీలు
- 3 వారాలుగా జ్వరాల విజృంభణ
- నిర్ధారణ, చికిత్స కోసం చెన్నైకు పరుగు
- పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తం
- పత్తాలేని వైద్య సిబ్బంది

9

రేపటి నుంచి స్కూళ్లకు కొత్త టీచర్లు

- నేటి మధ్యాహ్నానికి రిలీవ్

3



పింఛన్లు ఇవ్వండి సారూ!

23 వేల మంది నిరీక్షణ

మంజూరు అనుమతి ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం

14

ఇదేదో చిన్నపాటి గుడి అనుకున్నారంటే మీరు పొరబడ్డట్టే. కొండాపురం శివార్లలో ఉన్న రామలింగేశ్వర ఆలయానికి 93 ఎకరాల మాగాణి ఉంది. ఏటా దేవాదాయ శాఖ నిర్వహించే వేలం ద్వారా రూ.3లక్షల దాకా ఆదాయం సమకూరుతుంది. కానీ ఆలయాభివృద్ధి మాత్రం ఇదిగో ఇలా ఉండిపోయింది. ఇదొక్కటే కాదు.. కొండాపురం మండలంలో 180 ఎకరాలున్న కాశీవిశ్వేశ్వరుడి ఆలయ పరిస్థితీ అంతే. ఆ వివరాలు..

6లో..



శివ.. శివా!

- రామలింగేశ్వరుడి మాన్యం 93 ఎకరాలు
- కాశీవిశ్వేశ్వరుడికి 180 ఎకరాలు
- కౌలు ఏమవుతున్నట్టు!?
- అధికారులు, ధర్మకర్తల మిలాఖత్
- ధూప, దీప నైవేద్యాలకు నోచుకోని ఉత్సవర్లు
- గుప్తనిధుల కోసమూ తవ్వకాలు
- జీర్ణావస్థలో కొండాపురం ఆలయాలు

అంగన్‌వాడీలకు

ఆర్థిక కష్టాలు !

- రూ.లక్షల్లో బకాయిలు
- కూరగాయలు, గ్యాస్, అద్దె బిల్లుల పెండింగ్
- వేతనాలూ అందక అవస్థలు
- అప్పుల పాలవుతున్న సిబ్బంది
- ఆందోళన తప్పదంటున్న యూనియన్లు

- వివరాలు 7లో

పెళ్లిబృందానికి

ప్రమాదం

- లారీని ఢీకొన్న కారు
- ఆరుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో నవ దంపతులు

- వివరాలు 6లో

నారి

నూరుశాతం అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ, మెరుగైన విద్య, వైద్యంతోనే సమసమాజ స్థాపన సాధ్యమనేది ఈ కళాజాత బృందం ప్రగాఢ నమ్మకం. ఈ దృఢ సంకల్పంతో కావలికి చెందిన కొంతమంది యువతులు చేయిచేయి కలిపి జట్టుగా ఏర్పడి గళం విప్పారు. సమాజంలో జరిగే రుగ్మతలు, మూఢనమ్మకాలు, అజ్ఞానాన్ని పారద్రోలేందుకు ఆటపాటలు, వీధి నాటకాలను అస్త్రాలుగా మలుచుకున్నారు. తమదైన శైలిలో ప్రజల్లో చైతన్యం నింపుతూ.. పలువురి అభినందనలు, మన్ననలు పొందుతున్నారు.. ఈ నారీమణులు.

- కావలిటౌన్

ఓ ప్రజా మేలుకో!

- అజ్ఞానం, అన్యాయం, అవినీతిపై గళం
- ఆటపాటలు, వీధినాటకాలే అస్త్రాలుగా...
- ప్రశంసలు అందుకుంటున్న కావలి యువతులు



పాటతో అవగాహన కల్పిస్తున్న సంయుక్త

రూరల్ విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు (ఆర్వీడీఎస్) మద్దెల వెంకటేశ్వర్లు పర్యవేక్షణ లో మల్లిక, ఏ.అనూష, నాగమణి, ఇందిరా, బిందు, నికోరాణి, ఫ్రూటీ, శశికళ, రాణి, 10 మంది యువతులు కళాజాతాగా ఏర్పడ్డారు. ఇందులో చదువుకొనే విద్యార్థినులు, చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవించే యువతులు ఉన్నారు. వీరందరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒక్కటే కావడంతో జట్టుగా ఏర్పడి సమాజంలో జరిగే రుగ్మతలు, మూఢనమ్మకాలు, అన్యాయం, అవినీతి, అజ్ఞానం పారద్రోలేందుకు ఆటపాటలు, వీధినాటకాలతో ప్రజల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు.

● ప్రజా చైతన్యం వారి అభిమతం

నూరుశాతం అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ, మెరుగైన విద్య, వైద్యంతోనే సమసమాజ స్థాపన సాధ్యమనేది ఈ కళాజా తా బృందం ప్రగాఢ నమ్మకం. దృఢ సంకల్పంతో ముందుకు సాగుతూ పర్యావరణ పరిరక్షణపై, అక్షర దీపంపై, వైద్య, ఆరోగ్య రంగాల ప్రాధాన్యత, ఆవశ్యకత, అజ్ఞానంతో జరిగే మోసాలు, నష్టాలపై, నగదు రహిత లావాదేవీలపై, స్వచ్ఛభారత్, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై బాలల అక్రమ రవాణా, బాల్యవివాహాలు అరికట్టడంపై జిల్లా వ్యాప్తంగా అనేక వీధి నాటకాలు ప్రదర్శిస్తూ ఆటపాటలతో నారీభేరీ మోగిస్తున్నారు. సమాజ శ్రేయస్సు కోసం కొంత సమయాన్ని కేటాయిస్తూ ప్రజల్లో అజ్ఞానం పారద్రోలేందుకు ఈ బృందం చేస్తున్న కృషి అభినందనీయం.

● అవార్డులు, ప్రముఖుల ప్రశంసలు

మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా నవోదయ అవార్డు, జిల్లా కలెక్టరు నుంచి ప్రకృతి మిత్ర అవార్డు అందుకున్నారు. అలాగే ఉత్తమ చైతన్య కళాబృందం అవార్డులతో పాటు జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని, కావలి డీఎస్పీ రాఘవరావు, ఆర్డీవో ఎంఎల్ నరసింహం, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజధాని నిర్మాణకమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.




పోలీసు అధికారుల ప్రశంసాపత్రాలతో కళాజాత బృందం

సమసమాజం కోసం..

సమాజంలో ఇంకా ఆర్థిక అసమానతలు, కులమత భేదాలు, మూఢనమ్మకాలు, అన్యాయం, అవినీతి కొనసాగుతున్నాయి. ఇటువంటి రుగ్మతలను పారద్రోలినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యపడుతోంది.

- సంయుక్త, కళాజాతా సభ్యురాలు



సామాజిక చైతన్యం కోసం..

సమాజంలో ఎక్కువగా మోసపోయేది, ఇబ్బందులు ఎదుర్కొనేది మహిళలే. వారిలో సామాజిక చైతన్యం వచ్చినప్పుడే వీటిని అరికట్టవచ్చు. యువతులు కళాజాత బృందంగా ఏర్పడి మంచి ఆశయం, ధృఢ సంకల్పంతో ముందుకు రావడం అభినందనీయం. తమ వంతు సహాయసహకారాలు అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నాను.

- ఆర్వీడీఎస్ వెంకటేశ్వర్లు



మహిళల్లో చైతన్యం కోసమే..

మహిళల్లో చైతన్యం వచ్చినప్పుడే దేశాభివృద్ధి జరుగుతోంది. సమాజంలో జరిగే రుగ్మతలు, అన్యాయం, అవినీతిని పారద్రోలవచ్చు. మహిళా చైతన్యం కోసం వాడవాడలా తిరిగి ఆటపాటలు, వీధి నాటకాలతో అవగాహన కల్పిస్తున్నాం.

- కే. మల్లిక



అజ్ఞానం పారదోలేందుకే..

అనేక మంది అజ్ఞానంతో రుగ్మతలకు గురై బాధపడుతున్నారు. సమాజంలో ఇటువంటి వారు దోపిడికి, దగాకు గురవుతున్నారు. ఈ క్రమంలో వారిలో అజ్ఞానాన్ని పారద్రోలి.. విజ్ఞానాన్ని నింపగలిగినప్పుడు వారికి న్యాయం జరుగుతుంది.

- అన్నవరం తనూజా



మహిళల్లో ప్రశ్నించేతత్వం రావాలి


కళ్ల మందు జరిగే అన్యాయాలు, అక్రమాలను మనకెందుకులే అని ఊరుకున్నప్పుడు సమాజం పెడదోవపడుతుంది. ప్రధానం గా మహిళల్లో ప్రశ్నించేతత్వం పెంచుకోవాలి. చట్టాలపై అవగాహన కలిగి హక్కులు సాధించుకున్నప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుంది.

- గువ్వల విజయ

స్తంభాలగిరి ఈశ్వరుడిని దర్శించుకుంటే సంతానప్రాప్తి

ఆధ్యాత్మికం

● పూజారి పొండయ్య



"సంతానం లేని దంపతులు నాలుగువారాలు పాటు క్రమం తప్పకుండా డక్కిలి మండలం దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామిని దర్శించుకొంటే సంతాన ప్రాప్తి సిద్ధిస్తోందని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతి సోమవారం ఆలయానికి విచ్చేసే భక్తుల్లో అధిక సంఖ్యలో సంతానం కోసం వచ్చే భార్యాభర్తలే అధికంగా ఉంటున్నారు. వందేళ్ల కిత్రం ఏర్పాటైన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు పూరిపాకలో పూజలు అందుకొన్న శివయ్య నేడు ప్రముఖ దేవాలయంగా రూపాంతరం చెందడం వెనుక ఉన్న కథే సంతానంలేని దంపతులు నాలుగు వారాలపాటు క్రమం తప్పకుండా ఆలయానికి వచ్చి నిద్రచేసి స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే సంతానం కలుగుతోందని భక్తులు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ ఆలయంకు చేరుకోవలంటే రాపూరు, వెంకటగిరి నుంచి బస్సు మార్గంలో డక్కిలికి చేరుకొని అక్కడి నుంచి 5 కిలో మీటర్లు ఆటోల్లో ఆలయాలని చేరుకోవాల్సి ఉంటుంది. స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి మహిమగల దేవుడని పూజారి పండయ్య అంటున్నారు. భక్తుల కోర్కెలు ఇట్టే ఈడేరుతాయన్నారు."

- డక్కిలి

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు జీతాల పెంపు

నెల్లూరు (క్యాంపస్) : సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురు వారం ప్రకటన విడుదల చేసింది. కింది స్థాయి సిబ్బంది జీతం రూ. 7,500 నుంచి 12వేల వరకు పెరిగింది. కేటగిరి వారీగా రూ.25వేల వరకు జీత భత్యాలను ప్రభుత్వం పెంచింది. జిల్లాలో 592 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 163 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎస్‌ఎస్‌ఏలో పనిచేస్తున్నారు. వీరందరికి పెరిగిన జీత భత్యాలు అందనున్నాయి. అయితే దీనికి సంబంధించినటువంటి పూర్తి ఆర్డర్ ఇంకా చేరలేదని అధికారులు చెబుతున్నారు.

జలవనరుల శాఖ టీవోగా విజయకుమార్

నెల్లూరు (వ్యవసాయం) : జలవనరుల శాఖ టెక్నికల్ ఆఫీసర్‌గా కే విజయకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆ శాఖ నెల్లూరు సెంట్రల్ డివిజన్ జాయింట్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆయనకు పదోన్నతి లభించడంతో సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా నియమితులయ్యారు.

ఉద్యోగులకు రిస్క్ అలవెన్స్‌లు మంజూరు చేయాలి

ఉద్యోగపర్వం

● జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రవిశేఖర్



"అటవీశాఖ వైల్డ్ లైఫ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు వెంటనే రిస్క్ అలవెన్స్‌ను మంజూరు చేయాలి. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వాన్ని కోరాము. దీంతోపాటు పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి అటవీ సిబ్బందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి. అనేక ఏళ్లుగా ఉద్యోగాలు భర్తీ ప్రక్రియ చేపట్టడం లేదు. పదవీ విరమణ చేస్తున్నారే కానీ ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదు. దీంతో ఉన్న వారిపై పని ఒత్తిడి ఎక్కువైపోతోంది. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. అందరికీ రోడ్డు ప్రమాద బీమాలు ఏర్పాటు చేయాలి."

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

రేపటి నుంచి పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు

- ప్రస్తుతం ఉన్న చోట నేడు రిలీవ్
- మొత్తం 4,985 మందికి స్థానచలనం
- ముగిసిన బదిలీ పర్వం

నెల్లూరు (క్యాంపస్) : ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. జూన్ 9వతేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ నెల 1వతేదీకి పూర్తయినప్పటికీ నెల్లూరు జిల్లాలో 19వతేదీకి పూర్తి కానుంది. ఈ నెల 1వతేదీ నుంచి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి 12వతేదీకి ముగించారు. కానీ, బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆర్డర్లు చేతికి అందలేదు. దీంతో ఎక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు అక్కడే పాఠాలు బోధిస్తున్నారు.

ఈ రోజే రిలీవ్ కండి

బదిలీ అయిన వారు శుక్రవారం మధ్యాహ్నానికి ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ అయి శనివారం ఉదయానికి కొత్త పాఠశాలలో చేరాలని డీఈవో మువ్వా రామలింగం ఓ ప్రకటనలో ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 7,468 మంది ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోగా 4,985 మంది బదిలీ అయ్యారు. వీరిలో స్థానిక సంస్థలకు చెందిన వారు 4,894 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నవారు 91 మంది ఉన్నారు. వీరందరూ శనివారం నుంచి నూతన పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించనున్నారు.



పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

\- మేనేజర్

ప్రజల భద్రతే ధ్యేయం

- వాహనాల విస్తృత తనిఖీలు : ఎస్పీ
- నెలరోజుల్లో 19,369 కేసుల నమోదు



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రామకృష్ణ

నెల్లూరు (క్రైం) : ప్రజల భద్రతే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం నగరంలోని ఉమేష్‌చంద్ర పోలీసు సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రవాణాశాఖ, ఆర్టీసీ, పోలీసులు సంయుక్తంగా గత నెల 17వ తేదీన రోడ్‌సేఫ్టీ సమావేశం నిర్వహించి జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల్లో ప్రత్యేక తనిఖీలకు శ్రీకారం చుట్టామన్నారు. దీంతో ఈ నెల రోజుల్లో ఇప్పటివరకు 19,369 వాహనాలపై మోటర్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి రూ.56,28,460 జరిమానా వసూలు చేశామన్నారు. అలాగే లైసెన్స్‌లు లేని 1657 వాహనాలపై ఐపీసీ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. దీని ఫలితంగా రహదారులపై రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఏప్రిల్ నెలలో 64, మే నెలలో 44, జూన్‌లో 51 రోడ్డు ప్రమాద మరణాలు సంభవించగా ఈ స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా జూలైలో 30 ప్రమాదాలు మాత్రమే జరిగాయన్నారు. ఈ నెలలో ఇప్పటివరకు 14 మరణాలు మాత్రమే జరిగాయని, వీటిని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలను ఇలానే కొనసాగించాలని, నిబంధనలు పాటించనివారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం రవివర్మ, ట్రాఫిక్ డీఎస్పీ రామారావు, రోడ్ సేఫ్టీ నోడల్ ఆఫీసర్, అట్రాసిటీ సెల్ డీఎస్పీ సుధాకర్, సీసీఎస్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్‌బీ డీఎస్పీ కోటారెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ మాణిక్యరావు, ఎంవీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఇంట్లో ఐటీ సోదాలు

నెల్లూరు (రూరల్) : వైసీపీకి చెందిన బండి శ్రీకాంత్ రెడ్డి ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం తిరుపతికి చెందిన అధికారులు నెల్లూరు నగరానికి సమీపంలోని పొట్టే పాళెంలో ఉన్న శ్రీకాంత్ ఇంటిని సోదా చేశారు. విలువైన పత్రా లు, బ్యాంకు లాకర్లు, నగదు, బంగారు ఆభరణా లను స్వాధీనం చేసుకుని బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. ఇసుక రీచ్‌ల సిండి కేట్‌లో ఒకడిగా వ్యవహరించిన శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడంతో పాటు పన్నులు కూడా చెల్లించలేదన్న సమాచారంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడి చేసినట్లు సమాచారం. దాడులు కొనసాగుతున్నాయని, అనంత రం వివరాలు వెల్లడిస్తా మని ఓ అధికారి తెలిపారు. కాగా, శ్రీకాంత్‌రెడ్డి ఇంటిపై ఐటీ దాడి జరగడంతో వైసీపీ వర్గాల్లో కలవరం రేగింది.



బండి శ్రీకాంత్‌రెడ్డి

కలిగిరిలో నేత్ర వైద్య శిబిరం

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం అమ్మ-నాన్న సేవా సంస్థ నిర్వాహకుడు ఎం. వేణుగోపాలరావు ఉచిత నేత్రవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 130 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించామన్నారు. తొమ్మిది మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యాధికారులు సూచించగా వారిని నెల్లూరు తరలించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.ఈ శిబిరంలో దంతవైద్యపరీక్షలతోపాటు, ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడం పెంచల నరసింహారెడ్డి, ఎఫ్‌సీఐ డైరెక్టర్ వేళ్ల నరేంద్రబాబు, శ్రీరాం కలిగిరయ్య తదితరులు పాల్గొన్నారు.

చవితికి వినాయకులు సిద్ధం




విక్రయానికి సిద్ధంగా గణపతి ప్రతిమలు

కావలిటౌన్: వినాయక చవితికి విగ్రహాలు తయారీ చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఈ నెల 25 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నందున కావలి పట్టణ ముసునూరు, ప్రగతినగర్, గాయత్రి నగర్ ప్రాంతాల్లో విగ్రహ తయారీదారులు విగ్రహాలు వివిధ సైజుల్లో తయారీ చేసి రంగులతో ముస్తాబు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి విగ్రహాల కొనుగోలుకు పట్టణానికే రావాల్సి ఉన్నందున పెద్ద సంఖ్యలో విగ్రహాలు తయారీ చేసి సిద్ధంగా ఉంచారు.

రూపన్‌వాలా కమిషన్ రిపోర్టును రద్దు చేయాలి

కావలిటౌన్: వేముల రోహిత్ ఆ త్మహత్య కేసుకు సంబంధించిన రూపన్‌వాలా కమిషన్ రిపోర్టును రద్దు చేసి, ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రోహిత్ ఆత్మహత్యకు కారకులయిన వైస్ చాన్స్‌లర్ అప్పారావు, మంత్రులు స్మృతీఇరానీ, బండారు దత్తాత్రేయలు దోషులు కాదని ఏకె రూపన్‌వాలా నివేదిక ప్రభుత్వానికి సమర్పించడంలో బీజేపీ, టీడీపీలు దళిత వ్యతిరేకతను చాటుకున్నాయన్నారు. రోహిత్ దళితులని రెండు దఫాలు గుంటూరు జిల్లా కలెక్టర్ నివేదిక పంపినా, దాన్ని కాదని కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలకు అనుగుణంగా బీసీ అని రిపోర్టు తెప్పించుకుని ఈ దుర్మార్గమైన నివేదిక ఇచ్చి దోషులను తప్పించారని విమర్శించారు.

మంత్రి ఆదినారాయణ వ్యాఖ్యలు దళితుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి తాళ్లూరి మాల్యాద్రి, సభ్యులు రావి మాల్యాద్రి, పఠాన్ కాలేషా, జాన్, తదితరులు పాల్గొన్నారు.

కారుకు తప్పిన ప్రమాదం

జలదంకి: జలదంకి-జమ్మలపాలెం మధ్య కావలి-ఉదయగిరి రోడ్డుపై సింగిల్ బ్రిడ్జి వద్ద గురువారం త్రుటిలో ప్రమాదం తప్పింది. కావలి నుంచి కలిగిరి వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సింగిల్‌బ్రిడ్జి వద్దకు చేరుకునే లోపే మరో వాహనం ఎదురుగా బ్రిడ్జి పైకి వచ్చింది. దీంతో బస్సును డ్రైవర్ ఆపడంతో వెనుకనే వస్తున్న కారు వచ్చి బస్సు వెనుక ఆగింది. వెనుకకు చూడకుండా బస్సు డ్రైవర్ రివర్స్‌లో వెనుకకు రావడంతో కారు ముందుటైరు వద్ద తగిలింది. శబ్దం రావడంతో పాటుగా కారులో ఉన్న వారు పెద్దగా కేకలు వేయడంతో బస్సుడ్రైవర్ వెంటనే బస్సు ఆపేశాడు. ఈ సంఘటనతో కారులో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై బస్సుడ్రైవరుకు కారులో ఉన్న వారికి స్వల్పవివాదం ఏర్పడి ఇరువురు పోలీసు స్టేషను వెళ్లారు. అనంతరం రాజీచేసుకుని వెళ్లారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

జలదంకి: మండల పరిధిలోని బ్రాహ్మణక్రాక వీఆర్ఏ మద్రి రమణయ్య(60) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన మృతి విషయం తెలుసుకుని ఇన్‌చార్జి తహసీల్దార్ జాన్‌ప్రభాకర్ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు అందించే రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీఆర్ఏ సంఘం తరపున మండల అధ్యక్షుడు మద్రి వెంకటేశ్వర్లు రూ.5వేలు ఆర్థిక సాయం కుటుంబసభ్యులకు అందించి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకేర్ మిషన్ దాతృత్వం

జలదంకి: జలదంకిలో గురువారం ఐకేర్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఆర్థికసాయం, దివ్యాంగురాలికి వీల్‌ఛైర్‌ను సంస్థ నిర్వాహకుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జలదంకి ఎస్ఐ ఆంజనేయులు హాజరై దివ్యాంగురాలైన మారుబోయిన పూజితకు వీల్‌ఛైర్, రావుల సుభాషిణి కంటి శస్త్రచికిత్సకు రూ.5వేలు, అందురాలు చలంచర్ల నాగలక్ష్మీకి రూ.5వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఏగూరి మాధవికి రూ.6వేలు చెక్కుల రూపేణా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్వగ్రామంపై ఉన్న అభిమానంతో ఇక్కడి పేదలను గుర్తించి వారికి తనవంతు ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తున్న వడ్డే శ్రీకాంత్‌రెడ్డి వ్యక్తిత్వం పదిమందికి ఆదర్శమని కొనియాడారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సాయం చేయడమే ఐకేర్ మిషన్ ఆశయమన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ సభ్యులు మధు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాగైడ్
కావలి

మానస :	పిదా
లత ఏ/సీ :	లై
స్రవంతి:	జయ జానకీ నాయక
ఎస్వీ వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన మహేష్

కావలి(క్రైం): విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ రోడ్డు కూడలిలో విగ్రహాన్ని ఢీ కొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం అర్థరాత్రి జరిగింది. కావలి వైకుంఠపురానికి చెందిన బిల్లామహేష్ పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. రాత్రివిధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా ఉదయగిరి రోడ్డు కూడలి వద్ద యానాదిరెడ్డి విగ్రహాన్ని ఢీకొని గాయపడ్డాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావం అవుతున్న ఆ యువకుడిని స్థానికులు ఆటోలో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరలించారు.

ఆటో ఢీకొని..



గాయాలపాలైన ప్రసాద్

కావలి(క్రైం): కల్యాణ మండపంలో చెత్తను రోడ్డు పక్కన పడేసి వస్తున్న ప్రసాద్ అనే యువకుడిని గుర్తు తెలియని ఆటో ఢీకొనగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. కావలి ఉత్తర శివారులోని కల్యాణమండపంలో వివాహ అనంతరం భోజనాల సమయాల్లో మిగిలిన చెత్తను రామిరెడ్డిగుంట సమీపంలో పారేసి వస్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ప్రసాద్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ప్రసాద్‌ను స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కావలిటౌన్: బాలికలు వ్యక్తిగత ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ పద్మజ అన్నారు. గురువారం ముసునూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బాలికా ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ పార్వతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య సూత్రాలపై అవగాహన కలిగి విధిగా పాటించాన్నారు. విద్యతోనే ఉన్నతశిఖరాలు అధిరోహించవచ్చని, పేదరికాన్ని జయించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్‌ఫేర్ అధికారి అంకయ్య, మాలకొండారెడ్డి, వార్డెన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ పద్మజ

హిందూ ధర్మ రక్షణకే ఆలయాల నిర్మాణం

కావలి రూరల్: హిందూ ధర్మ పరిరక్షణకు మారుమూల గ్రామాల్లో కూడా ఆలయాలు నిర్మాణం జరుగుతుందని సమరసత సేవా సంస్థ జిల్లా ప్రచారక్ వెంగళరెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్టీ కాలనీలో గురువారం కోదండరామస్వామి ఆలయానికి భూమి పూజ జరిగింది. పూజా కార్యక్రమాల్లో వెంగళరెడ్డి, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు జిల్లా సభ్యులు రాజేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమరసత సేవా సంస్థ తరపున గ్రామాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు రథయాత్రలు, హిందూ ధర్మఉపన్యాసాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా సంస్థ మండల ధర్మ ప్రచారక్ కాటంగారి లక్ష్మీనారాయణ, సంస్థ మండల కన్వీనర్ సీహెచ్ వెంకటప్రసాద్, దాసు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ శంకుస్థాపన పూజలు చేస్తున్న వెంగళరెడ్డి, తదితరులు

పెద్దపట్టపుపాళెం కొత్తూరులో

కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కావలిరూరల్: కావలి రూరల్ మండలం పెదపట్టపుపాలెం కొత్తూరులో గురువారం కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి దాతృత్వం వహించిన రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ గ్రామంలో జరిగే స్వామివారి ఉత్సవాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకుని దైవ చింతనతో ఉండాలన్నారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నుడా డైరెక్టర్ పాలడుగు రంగారావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రళయకావేరి భాస్కర్, రూరల్ మండల అధ్యక్షుడు కోసూరి వెంకటేశ్వర్లు, ఎల్లంగారి పార్వతయ్య, వాయిల శీనుబాబు, ఆవుల రామకృష్ణ, నాగన్నగారి శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనులతో పాటు రూరల్ మండలంలోని కాపులు, భక్తులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కలిగిరి: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని స్థానిక అధికారులను జడ్పీ సీఈవో దూది వసుమతి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మరుగుదొడ్ల నిర్మాణాలపై ఎంపీడీవో కే నర్మదతో ఆమె సమీక్షించారు. గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్ల లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.




కలిగిరి ఎంపీడీవోతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో వసుమతి

తీరప్రాంతంలో ఎమ్మార్ వ్యాక్సిన్

అల్లూరు : మండలంలోని ఇస్కపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తీరప్రాంతంలోని చంద్రబాబునగర్, కొత్తకుర్రు, ఇస్లాంకాలనీ, జవ్వాగు, గాలిదిబ్బలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో గురువారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారిణి శేషమ్మ ఆధ్వర్యంలో 347 మందికిగాను 302 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను అందించారు. 87 శాతం పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పద్మావతి, పీ కృష్ణయ్య, దానమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

బ్రహ్మయ్య, ఈవోపీఆర్‌డీ

? : గ్రామాల్లో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలు

! : సీజనల్ వ్యాధులు సోకే కాలం కావడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపడుతున్నాం. గత వారం నార్తుమోపూరు, బట్రకాగొల్లు, నార్తుఆములూరుల్లో చెత్త తొలగించాం.

? : తాగునీరు అందించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు

! : మండలంలో తాగునీరు అందించేలా ప్రతి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక బోర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నాం.

? : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పని తీరు ఎలా ఉంది

! : కొన్ని అవాంతరాలు ఉన్నా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ సౌకర్యం లేనందున పూర్తిస్థాయిలో సంపద తయారు చేసేందుకు వీలు పడడం లేదు. మండలంలో మరో ఐదు కేంద్రాలు ప్రారంభమవ్వనున్నాయి.

? : పంచాయతీల్లో మురుగు కాలువల పరిశుభ్రతపై స్పందన

! : మురగు కాలువల్లోని పూడికను తీయిస్తున్నాం. దోమలు ప్రబలే అవవకాశం లేకుండా చేస్తున్నాం.

? : మండలంలో పంచాయతీ కార్యాలయ భవనాలు ఎన్ని మంజూరు అయ్యాయి

! : మండలంలో అల్లూరు, బట్రకాగొల్లు, వెలిచర్ల పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి.

- అల్లూరు

సౌకర్యాలు లేని కూరగాయల మార్కెట్

● ముందుకు రాని వ్యాపారులు ● నెరవేరని లక్ష్యం





కలిగిరిలో నిర్మించిన రాజీవ్ కూరగాయల మార్కెట్, కూరగాయలకు బదులు పాతసామానులు పడేసిన వైనం

కలిగిరి: పట్టణంలో అన్ని రకాల కూరగాయలు వ్యాపారులు ఒకేచోట చేరి అమ్ముకోవడానికి వీలుగా 2005లో రాజీవ్ కూరగాయల మార్కెట్‌ను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించారు. పంచాయతీ వారు కట్టించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రధాన రహదారితోపాటు మసీదువీధిలోకి వచ్చేలా 10దుకాణాలు, కాంప్లెక్స్ లోపలి భాగంలో 12 దుకాణాలను నిర్మించారు. అయితే షాపింగ్ కాంప్లెక్స్ ముందుభాగాన ఉన్న దుకాణాలను షట్టర్, విద్యుత్ సౌకర్యాలను కల్పించిన పంచాయతీ, లోపలిభాగాన కూరగాయల మార్కెట్‌కు షట్టర్లు, తలుపులు లేకుండా దుకాణాలను కేటాయించింది. అయితే మార్కెట్ ప్రారంభించిన సమయంలో వ్యాపారుల డిపాజిట్‌లు చెల్లించి అద్దెలకు దుకాణాలను తీసుకున్నారు. అయితే వ్యాపారులు మార్కెట్ లోకి వచ్చినప్పటి నుంచి తగిన సౌకర్యాలు లేకపోవడం, దుకాణాలకు రక్షణ కొరత ఉండటం మూలాన వారు అసౌకార్యానికి గురయ్యారు. దుకాణాలను బాడుగకు తీసుకున్నవారు సక్రమంగా అద్దెలు చెల్లించకపోవడంతో పంచాయతీ లోపలి దుకాణాలను పట్టించుకోవడం మానేసింది. దీనికితోడు కొంతమంది వ్యాపారులు ప్రధాన కూడలిలోనే కూరగాయల వ్యాపారం చేయడం మూలాన మార్కెట్‌లో వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో మూడు నెలల కాలంలోనే ఒక్కొక్కరు దుకాణాలను వదిలి తిరిగి తమ పాత స్థానాల్లోనే వ్యాపారాలు చేసుకోవడానికి వెళ్లిపోయారు. అయితే కొంతమంది వ్యాపారాలు చేసుకుంటామన్నా పంచాయతీ సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యే సరికి రాజీవ్‌కూరగాయల మార్కెట్ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. దుకాణాలు ఖాళీగా ఉండటంతో మార్కెట్ బోసిపోయింది. పంచాయతీ పాలకులు, అధికారులు కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రైతులైనా మార్కెట్ ప్రాంగణంలో కూరగాయలు అమ్ముకుంటామని వారు పేర్కొంటున్నారు.


డిపాజిట్‌లు కూడా తిరిగి ఇవ్వలేదు



పంచాయతీ వారు ఏర్పాటు చేసిన రాజీవ్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేసువడానికి రూ.10వేలు డిపాజిట్‌గా చెల్లించాం. ప్రతినెలా ఠంచనుగా బాడుగలు కూడా చెల్లించాం. అయితే దుకాణాలను తమకు ఇవ్వలేదు. తిరిగి తమ డిపాజిట్‌లను చెల్లించమన్నా సమాధానం చెప్పడంలేదు.

- కావేటి శేషయ్య

వ్యాపారాలు జరగక బయటకు వచ్చాం



మూడు నెలలపాటు రాజీవ్‌కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు చేశాం. అయితే ప్రధాన కూడలిలో కొంత మంది వ్యాపారం చేయడం మూలాన మార్కెట్‌లో వ్యాపారులు జరగపోవడంతో ఖాళీ చేసి బయటకు రావడం జరిగింది.

-లక్కు చెంచిరెడ్డి,
కూరగాయల వ్యాపారి

దుకాణాలకు షట్టర్లను ఏర్పాటు చేస్తాం



మార్కెట్ లోపలి దుకాణాలు వ్యాపారాలులేక ఖాళీగానే ఉన్నాయి. పట్టనంలో సర్వే జరిగిన అనంతరం లోపలి దుకాణాలకు షట్టర్‌లు ఏర్పాటు చేసి అవసరమైన వారికి బాడుగకి ఇస్తాం.

- పంచాయతీ కార్యదర్శి,
వెలుగోటి మధు

ఆనందరాజ్ కుటుంబానికి చంద్రన్న బీమా

బిట్రగుంట: దినకూలీగా పనిచేస్తున్న ఆనంద్‌రాజ్(33) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ క్రమంలో గురువారం చంద్రన్న బీమాకింద రూ. 5వేలను మండల కన్వినర్ మాలేపాటి నాగేశ్వరరావు,రాష్ట్ర ఉపాధి హామీ పథక సలహా సభ్యురాలు కట్టేపల్లి భవానిలు ఆయన భార్య కవితకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రన్న బీమా పేదరికంలో ఉన్నవారికి ఎంతో ఉపయోగకరమని మిగిలిన రూ. 25 వేలు 21 రోజు తరువాత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మాకా హరపత్‌రాజ్, అంతోని, స్థానికులు ఉన్నారు.

చంద్రన్న భీమాద్వారా ఆర్థిక సహాయం

కలిగిరిలో..

కలిగిరి: మండలంలోని పడమరగుడ్లదొనలో చంద్రన్న బీమా పథకం క్రింద యెండ్లూరి కౌసల్యమ్మకు గురువారం ఐదువేల నగదును అందించారు. పడమరగుడ్లదొన మాజీ సర్పంచు కౌసల్యమ్మ భర్త యెండ్లూరి రామయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దహన సంస్కారాలకు ఈ మొత్తం అంద చేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో రామాలయానికి శంకుస్థాపన

బిట్రగుంట: బోగోలు మండలం ఎస్వీపాలెం దళితవాడలో టీటీడీ దేవాదాయ శాఖ సమరసత ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం రామాలయ నిర్మాణ శంకుస్థాపన జరిగింది. వేద పండితులు వేదగిరి సత్యానారాయణాచార్యులు శాంతిహోమ పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. పంచాయతీ సర్పంచు కట్టేపల్లి సింహాద్రి, భవానీ దంపతులు పూజలు నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ సాంప్రదాయం పెంపొందించే దిశగా ఆలయ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు హరిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

కొండాపురం: మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ భూముల కౌలువేలం ఇన్‌చార్జి ఈవో రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి మండలంలోని పలు గ్రామాలలో సుమారు 93 ఎకరాలుండగా గతంలో ఎ 43.50 సెంట్లకు కౌలువేలం నిర్వయించగా రూ 1.13 లక్షలకు రైతులు రెండేళ్లపాటు సాగుకు పాటలో పాడుకున్నారన్నారు. మిగిలిన భూములకు సంబంధించి ఎ 49.48 సెంట్లకు జరిగిన వేలంలో రూ 1.32 లక్షలకు రైతులు పాడుకున్నారన్నారు. సంవత్సరం పాటు భూములు సాగుకోసం మండలానికి చెందిన దాసరి కిషోర్, గద్దె కోటేశ్వరరావు, చిమ్మిలి మాధవ, పాటిబండ్ల నరసింహం, నర్రా అనీల్ బహిరంగ వేలంలో ఆలయ భూములను పాడుకున్నారు. ఆలయ భూముల కౌలుకు సంబంధించి ఇప్పటివరకు రూ 3.90 లక్షలు నిల్వ ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిధులను ఆలయ అభివృద్ధికి ఖర్చుచేస్తామని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షుడు పోలినేని రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్ పిల్లలకు తప్పనిసరి

బిట్రగుంట: ఎమ్మార్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ పర్రి సులోచనమ్మ, సర్పంచు దొడ్ల రమణమ్మ అన్నారు. బోగోలు ప్రాథమిక పాఠశాలలో గురువారం కోవూరుపల్లి వైద్యులు సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఎమ్మార్ వ్యాక్సిన్‌లు పిల్లలకు అందజేశారు. బోగోలు, ఎస్వీపాలెం, ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని పాఠశాలలోని 840 మంది విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్‌లు అందజేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు అంజయ్యాయాదవ్, కావలి ఏఎంసీ డైరెక్టర్ మన్నన్‌బాష, ఆసుపత్రి కమిటీ చైర్మన్ పులికం శ్రీహరిరెడ్డి, సీతారామయ్య, చిలకపాటి వెంకటేశ్వర్లు, మాధవ పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులను ఆదుకోండి

కలిగిరి: ఉద్యాన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కావలి డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్స్ కమిటీ సభ్యుడు టీసీ మాల్యాద్రినాయుడు విజ్ఞప్తి చేశారు. ఇటీవల విజయవాడలోని సిద్దార్థ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సేంద్రీయ వ్యవసాయ నర్సరీ మేళా రైతు అవగాహన సదస్సులో రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవిచౌదరికి స్థానిక రైతులతో కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. జిల్లాలో రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఉద్యాన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పండ్లతోటలు కాపాడటానికి ట్యాంకర్లద్వారా నీరు అందిస్తామన్న ప్రభుత్వం టాంకర్లతో తోలిన నీటికి సంబంధించిన నిధులు రైతుల ఖాతాలలో జమ కాలేదన్నారు. ఆ నిధులను రైతుఖాతాలకు జమచేయాలని కమిషనర్‌ను కోరారు. అదే విధంగా జిల్లాలో అభివృద్ధికి నోచుకోని భూములకు రాయితీలను ప్రకటించి, పండ్లతోటలను పెంచేలా రైతులకు ప్రోత్సాహకాలను అందించాలని కోరారు.

శివ.. శివా!



ఆదిమూర్తిపురంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

ఆదిభిక్షువుకు అన్నమెందుకు అనుకున్నారో ఏమో.. అక్రమార్కులు ఆలయ మాన్యంపై వచ్చే కౌలు ఆదాయాన్ని గద్దల్లా తన్నుకుపోతున్నారు. అలనాటి రాజుల కైంకర్యాలు స్థానిక భోక్తలకు చేరిపోతున్నాయి. ఫలితంగా అన్నపూర్ణ సమేతుడికి నిత్య ధూప, దీప, నైవేద్యాలు పెట్టే నాథుడు కరువయ్యాడు.

- కొండాపురం

- ఆస్తులున్నా నివేదన సున్నా..
- రామలింగేశ్వరుడి మాన్యం 93 ఎకరాలు
- కాశీవిశ్వేశ్వరుడి భూమి 180 ఎకరాలు
- కౌలు ఏమవుతున్నట్టు!?

కొండాపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి, గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలు అతి పురాతనమైనవి. త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ ప్రాంతంలో శివుడిని పూజించాడంటారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయాలు ఎక్కడోగాని ఉండని పెద్దలు చెబుతారు. అలనాటి రాజులు స్వామివారి నిత్య కైంకర్యాలకు వందలాది ఎకరాల మాన్యం ఇచ్చారు. దానిపై వచ్చే ఆదాయంతో అప్పట్లో ఈ శైవాలయాలు నిత్యకల్యాణం పచ్చతోరణంటా విరాజిల్లాయంటారు. కాలక్రమంలో అక్రమార్కులు చేరిపోయి అందినకాడికి బొక్కేశారన్న విమర్శలున్నాయి.

● అభివృద్ధి కానరాదు

కొండాపురం గ్రామ శివారులో రామలింగేశ్వర ఆలయం చెరువుకట్ట సమీపంలో ఉంది. ఆలయ నిర్వహణకు సుమారు 93 ఎకరాలు మండలంలోని గుడవళ్లూరు, మర్రిగుంట, నేకునాంపేట, వెలిగండ్ల, ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలంలోని మొగిలిచెర్ల తదితర గ్రామాల్లో మాన్యం ఉంది. దేవాదాయశాఖ అధికారులు ఏటా వీటి కౌలు వేలం నిర్వహిస్తారు. సుమారు మూడు లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయినా ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. నిత్య కైంకర్యాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. శివరాత్రి పండుగ రోజున మాత్రమే కొంత నగదు వెచ్చించి విశేష పూజలుచేసి భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

● పలుమార్లు చోరీలు

చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఈ రామలింగేశ్వర ఆలయంలో పలుమార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు, చోరీలు జరిగాయి. పదేళ్ల కిందట ఆలయం ఎదురుగా ఉన్న రాతి నంది విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఎనిమిదేళ్ల కిందట గర్భగుడిలో తవ్వకాలు చేపట్టారు. ఆలయ హుండీని పగులగొట్టి భక్తులు స్వామి వారికి సమర్పించిన విలువైన కానుకలు అపహరించారు. మూడేళ్ల కిందట గర్భగుడిలోని శివలింగాన్ని సగానికి విరగ్గొట్టారు. గతేడాది డిసెంబరులో ఆలయ చైర్మన్‌తో కలసి మరికొందరు గర్భగుడిలో మరమ్మతుల పేరుతో తవ్వకాలు జరిపి లంకెబిందెలు స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. ఇటీవల ఆలయం వెలుపల ఉన్న వినాయకుడి రాతి విగ్రహం మాయమైంది. వరుస చోరీలపై దేవాదాయశాఖ అధికారులు, గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఒక్క కేసు కూడా ఛేదించలేదని భక్తులు వాపోతున్నారు. ఆలయ భద్రతను అధికారులు, పోలీసులు గాలికొదిలేశారని వారు ఆరోపిస్తున్నారు.

● కాశీవిశ్వేశ్వరుడి మాన్యం

గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం కాశీవిశ్వేశ్వరాలయానికి 180 ఎకరాల మాన్యం పార్లపల్లి, గానుగపెంట, ఆదిమూర్తిపురం గ్రామాల్లో ఉంది. పూజారికి అదనంగా ఏ.12.30 సెంట్ల భూమిని ప్రత్యేకంగా కేటాయించారు. ఇంత మాన్యం ఉన్నా గరళకంఠుడికి నిత్య పూజలు సక్రమంగా జరగడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. శివరాత్రి ఉత్సవాలకు రూ.3.30 లక్షలు ఖర్చయినట్లు లెక్క చూపి అధికారులు, ధర్మకర్త వాటాలు వేసుకొని పంచుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● ఏటా మాన్యం కౌలు వేలం

ఆలయ మాన్యం కౌలు ఏటా నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఈవో రవీంద్రరెడ్డి తెలిపారు. కొండాపురంలోని రామలింగేశ్వర ఆలయానికి సంబంధించి 43 ఎకరాలకు జులై 19వ తేదీన వేలం నిర్వహించగా 1.12 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఆదిమూర్తిపురం కాశీవిశ్వేశ్వరుడి ఆలయ మాన్యం 51 ఎకరాలకు కౌలు జూన్ 4న వేలం నిర్వహించగా 1.61 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. రెండు ఆలయాలకు సంబంధించి మిగులు భూమికి త్వరలో వేలం నిర్వహిస్తాం.

● అభివృద్ధికి ప్రతిపాదనలు

రామలింగేశ్వరస్వామి ఆలయం నిధులు 2.5 లక్షలు ఉందని, శిఖరాలకు కలశం, మూలవిరాట్టు, ఆలయం వెలుపల వినాయక విగ్రహాన్ని త్వరలో ఏర్పాటుచేస్తామని ఆయన అన్నారు. ప్రధాన ద్వారానికి ఇనుప గ్రిల్స్, ప్రహరీ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. కాశీ విశ్వేశ్వర ఆలయానికి నాలుగు లక్షల నిధులున్నాయి. ఏటా ఆలయ మరమ్మతులు చేపడుతున్నా మని ఆయన వివరించారు.

నిధులేమవుతున్నాయో?



రామలింగేశ్వర ఆలయానికి సుమారు 93 ఎకరాల భూమి ఉంది. ఏటా లక్షలాది రూపాయల కౌలు వస్తోంది. దేనికి ఖర్చు పెడుతున్నారో తెలియడంలేదు. ఆలయ అభివృద్ధికి అధికారులు పూనుకుంటే గ్రామస్థులు సహకరిస్తారు.

- చైతన్య, భక్తుడు

సోమశిల ప్రాజెక్టు ఉద్యోగి దుర్మరణం

● బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం.

కలువాయి: మండలంలోని వెంకటరెడ్డిపల్లి-రాజుపాళెం గ్రామాల మధ్య సోమశిల-పొదలకూరు రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో సోమశిల ప్రాజెక్టు ఉద్యోగి గోదావరి పెంచలయ్య (25) దుర్మరణం చెందారు. విధులు ముగించుకుని సోమశిల నుంచి కలువాయికి మోటారు సైకిల్‌పై వస్తున్న పెంచలయ్యను గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. గోదావరి పెంచలయ్య సోమశిల ప్రాజెక్టులో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కలువాయి గిరిజన కాలనీలో నివాసం ఉంటూ సోమశిలకు వెళ్లి విధులు నిర్వర్తించి వస్తుంటారు. ప్రతి రోజులాగే బుధవారం కూడా విధులకు వెళ్లి తిరిగి వస్తూ మృత్యువాత పడ్డారు. సోమశిల మునకప్రాంతానికి చెందిన పెంచలయ్య తండ్రి నరసింహులు కూడా సోమశిల ప్రాజెక్టులో ఉద్యోగం చేస్తూ ఐదు ఏళ్ల క్రితం మృతి చెందారు. దీంతో నరసింహులు ఉద్యోగం పెంచలయ్యకు ఇచ్చారు. పెంచలయ్యపై ఆధారపడి తల్లి, ముగ్గురు అక్కచెల్లెళ్లు జీవిస్తున్నారు. పెంచలయ్య మృతితో వారు రోదిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం పంపి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆవుల సైదులు తెలిపారు.



గోదావరి పెంచలయ్య (ఫైల్)

తిరుమల వెళ్తుండగా

రోడ్డు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో నవ దంపతులు
- బాధితులంతా కృష్ణా, ఒంగోలు జిల్లాల వారు



ప్రమాదానికి గురైన కారు

కావలి(క్రైం)/దగదర్తి: పెళ్లిదుస్తులలోనే తిరుమలేశుడిని దర్శించుకునేందుకు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో నూతన దంపతులతోపాటు వారి బంధువులు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున దగదర్తి మండలం ఉలవపాళ్ల క్రాస్‌రోడ్ వద్ద జాతీయరహదారిపై జరిగింది. వధువు తమ్ముడు హేమంత్ కథనం మేరకు, విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన భారతి, ప్రకాశంజిల్లా మార్టూరు సమీపంలోని చెందుపల్లికి చెందిన భరత్‌కు బుధవారం రాత్రి చెందుపల్లిలో వివాహం జరిగింది. వివాహానంతరం తిరుమలకు వెళ్లేందుకు ఓ కారులో వరుడి తల్లితండ్రులు సుబ్బారావు, సుబ్బాయమ్మలతోపాటు వధువు స్నేహితురాలు శివ, వధువు తమ్ముడు హేమంత్, మరో యువకుడు రాజేంద్రతో కలసి బయలుదేరారు. హైవేపై దగదర్తి మండలం ఉలవపాళ్ల క్రాస్‌రోడ్ వద్దకు కారు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో వాహనంలో ఉన్న వారిలో హేమంత్, రాజేంద్ర మినహా డ్రైవర్‌తో సహా ఆరుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని బోగోలు 108 సిబ్బంది ఈఎంటీ ప్రసాద్, పైలెట్ చేవూరి శివలు కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితులు మెరుగైన చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన వరుడి తండ్రి సుబ్బారావు



వరుడు అశోక్



వధువు భారతి



వరుడి తల్లి సుబ్బాయమ్మ



వధువు స్నేహితురాలు శివ

వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చెముడుగుంటలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు, ఒరిస్సాకు చెందిన సంతోష్ సాహూ (45) కొంత కాలంగా స్థానిక బాలాజి స్టీల్స్‌లో పని చేస్తూ చెముడుగుంటలో నివాసం ఉంటున్నాడు. అయితే భార్యాపిల్లలు లేని ఈ వ్యక్తి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోటలో ఆటోడ్రైవర్...

కోట: పట్టణంలోని ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న మస్తానయ్య (25) అనే ఆటో డ్రైవర్ గురువారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మస్తానయ్య కొంత కాలంగా ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మనుబోలు : ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసు దొంగలు పట్టపగలే రెచ్చిపోతున్నారు. పథకం ప్రకారం ఇద్దరు యువకులు గొలుసు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం పిడూరు క్రాస్ రోడ్డు వద్ద పి. ఇందిరమ్మ మెడలోని సరుడును తెంపుకుని ఉడాయించారు. వెంకటాచలంకు చెందిన ఇందిరమ్మ స్థానిక పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో తపాలా కార్యాలయానికి వెళ్లి ఎల్ఐసీ ప్రీమియం చెల్లించి అండర్ బ్రిడ్జి దాటి వస్తుండగా ఓ యువకుడు హడావుడిగా వచ్చి మెడలోని సరుడును లాక్కుని పరుగెత్తాడు. ఇందిరమ్మ కేకలు వేయడంతో స్థానిక మహిళలు వచ్చి కింద పడిపోయిన మంగళసూత్రాలు, నల్లపూసలు సేకరించి ఇచ్చారు. చోరీ అయిన సరుడు మూడున్నర సవర ఉంటుందని, రూ. 70వేల విలువ ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

మనుబోలు : మండలంలోని జాతీయరహదారిపై బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద గురువారం కారు బోల్తా పడింది. ఏఎస్‌పేట మండలానికి చెందిన యెద్ల భాస్కర్ రెడ్డి, ఆయన బావ మాల కొండారెడ్డి, ఆయన భార్య లక్ష్మీ, కుమార్తె ప్రియాంకలు చెన్నైలోని తాంబరం నుంచి కారులో దగదర్తిలోని బోదగుడిపాడు గ్రామానికి వెళుతుండగా బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంతో భాస్కర్‌రెడ్డి, మాలకొండారెడ్డిలు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కోట: చిట్టేడులో గురువారం పారిచర్ల వెంకయ్య (19) గురువారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. చిట్టేడు దళితవాడకు చెందిన వెంకయ్య 20 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కటుంబ సభ్యుల ఎక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆ యువకుడు ఇంటికి చేరాడు. సాయంత్రానికి నుంచి చిట్టేడు, వజ్జావారిపాళెం గ్రామాల సమీపంలోని రోడ్డు పక్కన వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పశువుల కాపరులు గుర్తించి గ్రామంలో తెలియజేశారు. సమాచారం అందుకున్న వెంకయ్య తల్లిదండ్రులు మృతదేహాన్ని వద్ద బోరున విలపించారు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అవగాహన లేమితో
ఎరువుల అతి వినియోగం

● రైతు శిక్షణ కేంద్రం డీడీ శ్రీవన్నారాయణ

?: పంటల సాగులో ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహనలేమి కనిపిస్తోంది. మీరే మంటారు.

!: వాస్తమే. వారికి ఎరువుల వాడకంపై అవగాహన లేక మితిమీరిన స్థాయిలో పురుగు మందులు, ఎరువులు వాడేస్తున్నారు. దీని వల్ల భూమి సారం కోల్పోవడం తప్ప ప్రయోజనం ఉండదు. ఈ అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టాము. క్షేత్ర స్థాయిలో రైతులందరికీ అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాము. ఈ కార్యక్రమానికి ప్రస్తుత ఖరీఫ్‌లో నాంది పలుకుతాం.

?: వరికి ప్రత్యామ్నాయ పంటలు అంటున్నారు. దీనిపై చైతన్యమేది...

!: జిల్లాలో రైతులకు వరి సాగుపైనే అవగాహన ఎక్కువ. అయితే, ఈ ఖరీఫ్‌లో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఇందుకు కొన్ని ప్రాంతాలను ఎంచుకున్నాము. వాటిలో వరి సాగు కష్టమైనందున ప్రత్యామ్నాయ పంటలు సిఫార్సు చేశాం.

?: ప్రత్యామ్నాయ పంటలకు గుర్తించిన ప్రాంతాలేవి.

!: మెట్ట ప్రాంతాలే ఎక్కువ. ఉదయగిరి, దుత్తలూరు, జలదంకి, చిట్టమూరు, వింజమూరు మండలాలతోపాటు మరికొన్ని ఉన్నాయి. అక్కడ ఏ పంటలు వేయాలో ఆయా ప్రాంతాలకెళ్లి రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాము. నేల స్వభావాన్ని బట్టి రైతులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

?: సాగు భూముల కాలుష్యానికి నివారణ చర్యలేమిటి.

!: దీనినే ప్రధాన అంశంగా వ్యవసాయశాఖ భావిస్తోంది. రైతులు సూక్ష్మధాతువులు ఉచితంగా పొందాలన్నా, ఎరువులు తీసుకోవాలన్నా ముందు భూసార పరీక్షలకు చెందిన వివరాలు కచ్చితంగా ఉండాలి. ప్రతి రైతు తమ పొలంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే ప్రభుత్వ రాయితీలు అందుతాయి. దీని వల్ల అధిక రసాయనాల వాడకంతో భూమి కలుషితం కాకుండా కాపాడడమే కాకుండా భూసారం పెరుగుతుంది.

- నెల్లూరు (వ్యవసాయం)

అంగన్‌వాడీలకు ఆర్థిక కష్టాలు!

● రూ.లక్షల్లో పేరుకున్న బకాయిలు
● కూరగాయలు, గ్యాస్, అద్దె బిల్లులు పెండింగ్
● అప్పుల పాలవుతున్న సిబ్బంది

నెల్లూరు (వేదాయపాళెం)

అంగన్ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతాం... చిన్నారులకు కార్పొరేట్ విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందిస్తాం.... అన్న అమృత హస్తం పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారం అందిస్తాం..... అంటూ పాలకులు, అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే, ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు తీర్చి తరువాత వాటికి కార్పొరేట్ హంగులు సమకూర్చాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.



నెలనెలా అందని వేతనాలు

సహజంగా ఎక్కువ మంది ఉద్యోగులు ప్రతి నెల ఐదో తేదీలోపు జీతాలు తీసుకుని ఇంటికి కావలసిన వస్తువులు కొనుక్కుంటారు. కానీ, అంగన్‌వాడీల పరిస్థితి. భిన్నంగా ఉంటుంది. ఇంటికి కావలసిన సరుకుల కోసం కాక, అంగన్‌వాడీ సెంటర్లకు కావలసిన సరుకుల కోసం వీరు అప్పులు చేస్తున్నారు. జీతాలు ఐదారు నెలలకు ఒకసారి వస్తుండడంతో ఆ జీతాలు తాము తెచ్చే అప్పుల వడ్డీకి సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ప్రస్తుతం ఆరు నెలల జీతం బకాయిలు వీరికి చెల్లించాల్సి ఉంది.

నిర్వహణ భారం

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు నెలలకు ఒకసారి చెల్లింపులు చేస్తోంది. దీంతో ఆ కేంద్రాల నిర్వహణ కార్యకర్తలకు పెనుభారంగా మారుతోంది. భవనం అద్దె, కూరగాయలు, గ్యాస్.... తదితరాల కోసం సిబ్బంది అప్పు చేయాల్సి వస్తోంది. ఈ విధంగా ఇప్పటి వరకు సుమారు రూ. 20లక్షల మేర అంగన్‌వాడీ సెంటర్లకు బకాయి ఉన్నట్లు సమాచారం. అద్దె చెల్లించలేకపోతే భవనం ఖాళీ చేయమని యజమానులు తెగేసి చెబుతున్నారు. కొందరైతే అంగన్‌వాడీ కేంద్రం గేట్లకు తాళాలు వేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటివి జరిగినప్పుడు మాత్రమే ఉన్నతాధికారులు అంగన్‌వాడీల సమస్యను రాష్ట్ర అధికారులకు దృష్టికి తీసుకుని వెళ్లి బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నారు తప్ప మిగిలిన సమయాల్లో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సుమారు ఏడాది కాలానికి అద్దెలు, గ్యాస్, కూరగాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. నెలవారీ చెల్లింపులు చేస్తే అంగన్‌వాడీ సిబ్బందిపై అధికారులకు పూర్తి స్థాయిలో పట్టు ఉంటుంది. కానీ, బకాయిలు పేరుకుపోవడం, సిబ్బంది ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చదువు శ్రద్ధగా చెప్పండి.. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి అని అధికారులు, సీడీపీవోలు అడగలేని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆందోళనకు సిద్ధం

ప్రీ స్కూల్స్‌గా మార్చిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ విద్యాబోధన, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీతోపాటు, టీకాలు వేయడం, పల్స్ సర్వే, ఓటర్ల నమోదు తదితర కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నా అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంగన్‌వాడీ యూనియన్ ఆరోపిస్తోంది. తనిఖీల పేరుతో సిబ్బందిని విధుల నుంచి తొలగించడం సబబు కాదంటున్నారు. ఇటీవల ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 90 మందికిపైగా అంగన్‌వాడీలకు నోటీసులు ఇవ్వడం సరికాదని, పొరపాట్లు సరిదిద్దుకునే అవకాశం ఇవ్వకుంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీల సమస్యలు పట్టించుకోకుండా ఈ విధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని, ఆందోళనకు సిద్ధమవుతున్నామని వారు హెచ్చరిస్తున్నారు.

ఐదు నెలలకు ఒకసారి కూడా జీతాలు ఇవ్వడం లేదు. 10 రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణకు ఖర్చు పెడుతున్నాం. కూరగాయలకు కూడా అప్పు చేయాల్సి వస్తోంది. ఐదు నెలల తరువాత బిల్లులు చెల్లిస్తున్నారు. వడ్డీలను మేమే చెల్లించుకోవాల్సి వస్తోంది. కుటుంబం కోసం తెచ్చుకున్న అప్పునకు, సెంటర్ల కోసం తెచ్చుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం..

- ఓ అంగన్‌వాడీ కార్యకర్త అవేదన

సెంటర్లకు నెలనెల బాడుగ కట్టండి లేకపోతే ఖాళీ చేయండి అని ఇంటి ఓనర్లు తిడుతున్నారు. అద్దె బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి మరీ బాడుగ చెల్లిస్తున్నాం. గ్యాస్ సిలిండర్ కోసం కూడా ఇబ్బంది పడుతున్నాం. ఇలాగైతే మాకు వచ్చే డబ్బులతో ఎలా బతికేది?.

- మరో అంగన్‌వాడీ కార్యకర్త అక్రందన

అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న సమస్యలను, మా సమస్యలు తీర్చకుండా పని చేయమని అడిగితే ఎలా?. ముందు మా గోడు పట్టించుకోండి. మేం ఎలా బతుకుతున్నామో చూడండి. అదేమీ లేకుండా సరిగా పనిచేయడం లేదని మా మీద నిందలు వేస్తే ఎలా? మీలాగా వేలకు వేలు జీతాలు ఒకటో తేదీన తీసుకుంటున్నామా?, వేలకు వేలు జీతాలు తీసుకుంటున్న వారు సరిగా పనిచేయకపోయినా అడగరు.. మా మీద మాత్రం చర్యలు తీసుకుంటారా? ఇదెక్కడి న్యాయం?

- ఇంకో అంగన్‌వాడీ కార్యకర్త ఆగ్రహం



మాట్లాడుతున్న ఆనందరావు

దళితులకు క్షమాపణ చెప్పాలి

● 20న రౌండ్‌టేబుల్ సమావేశం
● ఏపీ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందరావు

నెల్లూరు (వేదాయపాళెం) : దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డి దళితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏపీ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరు ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు చదువుకోరని, శుభ్రంగా ఉండరని మంత్రి వ్యంగ్యంగా మాట్లాడడం శోచనీయమన్నారు. రిజర్వేషన్లను అంబేద్కర్ పదేళ్లు ఇస్తే, 70 ఏళ్లయినా ఇంకా అనుభవిస్తున్నారని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్ర మంత్రికి రిజర్వేషన్ల గురించి తెలియక పోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలైనా దళితులు అభివృద్ధి చెందకపోవడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణమని ఆయన విమర్శించారు. ఈనెల 20వ తేదీన దళిత సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టపు శీనయ్య, బీ వేణు, జ్యోతి చిన్నయ్య, ప్రసన్న కుమార్, హరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కస్టడీకి తీసుకున్న
ఆ నలుగురు మళ్లీ కోర్టుకు..

● విచారణలో వెల్లడికాని వివరాలు ● మరోసారి కస్టడీకి తీసుకొనే ప్రయత్నం

కావలి(క్రైం): క్రికెట్ బెట్టింగ్‌లలో ప్రధాన బుకీలు గుర్రం వెంకటేశ్వర్లు, నంద్యాల అరుణ్‌కుమార్, మన్నెం శ్యాంప్రసాద్, దాసరి సుశాంత్‌లను ఒక రోజు విచారణ అనంతరం గురువారం సాయంత్రం కావలి పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. అయితే విచారణలో నిందితుల వద్ద నుంచి క్రికెట్ బెట్టింగ్‌లకు సంబంధించిన మరికొంత మంది పంటర్లు, బుకింగ్ రాయుళ్ల పేర్లను మినహా ఎటువంటి కీలక సమాచారాన్ని రాబట్టలేకపోయినట్లు తెలిసింది. సమగ్ర సమాచార సేకరణ కోసం క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో నిందితులను విచారణ కోసం మరలా కోర్టులో పిటీషన్ వేసి నాలుగైదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని కీలకమైన సమాచారం రాబట్టి క్రికెట్ బెట్టింగ్‌లను పూర్తిగా నిరోధించే ప్రయత్నంలో పోలీసులు ఉన్నట్లు సమాచారం. క్రికెట్ బెట్టింగ్ కేసులో నిందితులైన నలుగురిని కావలి ఒకటో పట్టణ పోలీసులు ఈ నెల 3వ తేదీ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు రిమాండ్‌లో ఉన్న వారిని విచారణ నిమిత్తం కావలి పోలీసులు కోర్టులో పిటీషన్ వేసి బుధవారం విచారణ నిమిత్తం ఒక రోజు పోలీసుకస్టడీకి తీసుకున్నారు. విచారణలో నిందితులు వెల్లడించి న పేర్లు గల వ్యక్తులను పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తుంది. విచారణ అనంతరం నిందితులు నలుగురిని గురువారం సాయంత్రం కావలి కోర్టులో హాజరు పరిచారు.

టెండర్ల లాలూచీ వెనుక..

ఓ ఇంజనీరు మంత్రాంగం

- ఆర్‌అండ్‌బీలో కమీషన్ల కక్కుర్తి
- ఆ నలుగురికే పనులివ్వాలన్న టీడీపీ నేత
- టెండర్లపై వివరణ కోరిన ఈఎన్‌సీ

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గూడూరు- దుగరాజపట్నం రహదారి అభివృద్ధి పనుల టెండర్ల వెనుక ఆ శాఖ ఇంజనీరు ఒకరు చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదటి నుంచి రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్లు కమీషన్లకు కక్కుర్తిపడి తమ అనుకూలమైన కాంట్రాక్టర్లకే పనులు అప్పగిస్తున్నారని అపవాదు కొనసాగుతోంది. దీనికితోడు రాజకీయ నేతల మద్దతు వారికి లభిస్తుండడంతో ఇక ఇంజనీర్లకు అడ్డు అన్నది లేదు. ఎవరు పనులు తీసుకున్నా ఇంజనీర్లకు ఏడు శాతం పర్సంటేజీ కచ్చితంగా సమర్పిస్తేనే బిల్లులు చేతికి వస్తాయి. దుగరాజపట్నం రహదారి పనులకు రూ. 35 కోట్లతో నిర్వహించిన టెండర్ల అవకతవకలపై కాంట్రాక్టర్ల ఫిర్యాదు మేరకు ఆ శాఖ ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ) జిల్లా అధికారులను వివరణ కోరారు. కాగా టీడీపీ నేత ఏ మాత్రం వెనక్కి తగ్గ కుండా తాను చెప్పిన వారికే పనులు అప్పగించాలని ఇంజనీర్లపై ఒత్తిళ్లు తెస్తూ తనకు ఇవ్వాల్సిన ఐదు శాతం కమీషన్ ముట్టచెప్పాలని కోరుతున్నారు. ఇదే అంశంపై గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఏకపక్షంగా టెండర్లు' కథనం ఇటు రాజకీయ నేతల్లో, అటు ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లలోనూ కలకలం సృష్టించింది.

35 కోట్లతో రోడ్డు అభివృద్ధి

దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ. 35 కోట్లు విడుదల చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏడు ప్యాకేజీలుగా విభజించి గత నెలలో టెండర్లు ఆహ్వానించారు. పలువురు ఈ పనులు దక్కించుకునేందుకు పోటీ పడి షెడ్యూల్ దాఖలు చేశారు. ఈ- ప్రొక్యూర్‌మెంట్ విధానంలో జరిగిన ఈ టెండర్లలో ఎవరు షెడ్యూల్ వేసిందీ ఎంతో గోప్యతగా జరగాల్సి ఉంది. అయితే గూడూరు డివిజన్‌లో ఏళ్ల తరబడి తిష్ట వేసుకుని పనిచేస్తున్న ఓ ఇంజనీరు ఈ టెండర్ల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లతో మంతనాలు, రింగ్ చేయడం వంటి వ్యవహారాలన్నీ ఆ ఇంజనీరే సర్దుబాటు చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నేతలతో అత్యంత సన్నిహితంగా ఉండే ఆ ఇంజనీరుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ముందుగానే కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి ఎవరెవరికి పనులు అప్పగించాలో కూడా ఆ ఇంజనీరే సూచనలు చేసి నట్లు కాంట్రాక్టు వర్గాలు పేర్కొంటున్నాయి. టీడీపీ నేత ఒకరికి ఐదు శాతం కమీషన్లు ఇవ్వాల్సి ఉండడంతో ఆ మేరకు కాంట్రాక్టర్లను ఒప్పించి అంచనా వ్యయంపై ఐదు శాతం పెంపుతో షెడ్యూల్ దాఖలు చేసే విధం గా నిర్ణయం తీసుకున్నారు. అందుకనే నలుగురు కాంట్రాక్టర్లకే ఏడు వర్కులు అప్ప చెప్పాలని మొదటి నుంచి ప్రయత్నాలు సాగుతున్నాయి. రెండు వర్కులకు లెస్‌తో వేసిన ఓ కాంట్రాక్టర్ షెడ్యూల్‌ను పక్కన పెట్ట డంతో ఆయన కోర్టును ఆశ్రయించినా అవేవీ పట్టించు కోకుండా టీడీపీ నేత సూచించిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గూడూరుకు చెందిన మరో కాంట్రాక్టర్ నిబంధనల మేరకు షెడ్యూల్ దాఖలు చేసి 'బ్యాచ్ మిక్స్ ప్లాంట్ అర్హత' సాధించినా దూరం (లీడ్) లెక్కించి తనను డిస్‌క్వాలిఫై చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ కాంట్రాక్టర్ నేరుగా ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈఎన్‌సీ ఆ ఫిర్యాదును ఎస్ఈకి పంపి వివరణ కోరి నట్లు సమాచారం. మరో రెండు వర్కులకు ఒకే బ్యాచ్ మిక్స్ ప్లాంట్‌ను లీజుకు చూపినా ఆ టెండర్లు ఖరారు చేసేందుకు ఇంజనీర్లు ఉత్సాహం చూపుతున్నారు. ఒక వర్కుకు ఒక బ్యాచ్ మిక్స్ ప్లాంట్ ఉండాలన్న నిబంధనను పక్కన పెట్టడం విమర్శలకు తావిస్తోంది.

● కమీషన్ల కక్కుర్తి

ఆర్‌అండ్‌బీలో ఏ పనులు చేయాలన్నా ఇంజనీర్లకు పర్సంటేజీలు సమర్పించుకోవాల్సిందే. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించే అసిస్టెంట్ ఇంజనీరు నుంచి ఎస్ఈ వరకు ఈ పర్సంటేజీల మామూళ్లు రహస్యంగానే జరుగుతూ వస్తోంది. క్షేత్ర స్థాయి ఏఈ, డీఈ, ఈఈలకు ఒక్కొక్క శాతం బిల్లుల చెల్లింపు సమయంలో సమ ర్పించాలి. మొదట అగ్రిమెంట్ సమయంలోనే ఎస్ఈకి ఒక శాతం సమర్పిస్తేనే అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తవుతుందని కాంట్రాక్టర్లు బహిరంగంగా చర్చించుకుం టున్నారు. కార్యాలయ హెచ్‌డీ, సిబ్బంది వరకు అర్థ శాతం, పే అకౌంట్ ఆఫీసులో మరో శాతం.. వెరసి మొత్తం ఏడు శాతం పర్సంటేజీలు కాంట్రాక్టర్లు చెల్లించాలి. ఇది ఇంజనీరింగ్ సెక్షన్ వరకు అనుకుంటే పొరపాటే ఆయా ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకులకు తృణమో, ప్రణమో సమర్పించుకోవాలి. కష్టపడి రోడ్డు వేసే కాంట్రాక్టర్‌కు మరో ఐదు శాతం వరకు లాభం ఉండే విధంగా చూసుకుంటారు. ఇలా సుమారు 15 శాతం వరకు అదనపు ఖర్చవుతుంది. నాణ్యత ప్రమాణాల మేరకు పనులు చేయాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లు ఈ పర్సంటేజీలు ఇచ్చుకోలే మంటూ గగ్గోలు పెడుతున్నారు. ఓ ఉన్నతాధికారి త్వరలో బదిలీ అవుతారని, ఈలోగా ఈ పనుల అగ్రిమెంట్ పూర్తయితే ఒక శాతం.. అంటే రూ. 35 లక్షలు నేరుగా ముట్టుతుందనే భావంతో సత్వరం టెండర్లు ఖరారు చేసేందుకు ఉత్సాహ పడుతున్నట్లు సమాచారం. ఎవరు ఎన్ని చెప్పినా తమ పర్సంటేజీలు తమదేన న్నట్లు ఆర్‌అండ్‌బీలో నిర్వహిస్తున్నారని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. దుగరాజపట్నం రోడ్డు టెండర్లపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ' ఏకపక్షం టెండర్లు ' కథనం ఇటు రాజకీయ నాయకుల్లోనూ, ఇంజనీరింగ్ వర్గాల్లోనూ కలకలం సృష్టిం చింది. ఎవరా టీడీపీ నేత...అంటూ ఆరా తీశారు. కాని ఆ టీడీపీ నేత మాత్రం ఇదేం పట్టించుకోకుండా ఆ నలుగురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని ఇంజ నీర్లపై ఒత్తిళ్లు తెస్తున్నారు. తన ఐదు శాతం కమీషన్‌లో తగ్గితే సహించేది లేదని వెల్లడిస్తున్నట్లు కాంట్రాక్టు వర్గాలు పేర్కొంటున్నాయి. మరి ఉన్నతాధికారులు ఈ టెండర్ల ఖరారుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

న్యాయస్థానం ఉరిమింది



- హత్య కేసులో నెల్లూరు సెషన్స్ కోర్టు తీర్పు
- ముద్దాయి కుక్కల వెంకటేశ్వర్లుకు ఉరిశిక్ష


నెల్లూరు (లీగల్) : ఇతరుల ప్రాణాలకన్నా జల్సాలే ఎక్కువని భావించాడు. డబ్బు కోసం ప్రాణం తీయడానికి కూడా పూనుకున్నాడు. నరహంతకుడిలా మారి వరుస హత్యలు చేసుకుంటూపోయాడు. చివరకు పోలీసుల చేతికి చిక్కి, కోర్టు బోను ఎక్కాడు. అతడి వ్యవహారశైలి తెలుసుకున్న న్యాయమూర్తి అతడికి ఈ భూమ్మీద బతికే అర్హత లేదని తేల్చి చెప్పారు. ప్రాణమంటే కనీస విలువలేని వ్యక్తికి అసలు ప్రాణం అవసరం లేదని కోర్టు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉరి శిక్ష విధిస్తూ సంచలన తీర్పును వెలువరించింది. కాగా, అల్లీపురం వద్ద పూజారి దంపతుల హత్య కేసులో కూడా ఈ ముద్దాయిపై నేరం రుజువు కావడంతో ఇదే కోర్టు వెంకటేశ్వర్లు బతికి ఉన్నంత వరకు జీవితఖైదు అనుభవించాలని గతంలో తీర్పు ఇచ్చిఉంది. ప్రస్తుతం వెంకటేశ్వర్లు నెల్లూరు సెంట్రల్ జైలులో ఆ శిక్ష అనుభవిస్తూ ఉన్నాడు. అంతేకాకుండా కావలిలో ఓ మహిళను హత్య చేసి ఇద్దరు పిల్లలను గాయపరిచాడన్న కేసులో కూడా నిందితుడుగా ఉన్నాడు. కేవలం వ్యసనాలకు బానిసైన 27 సంవత్సరాల వెంకటేశ్వర్లు ఇలా హత్యలు చేసుకుంటూ పోయి ఉరికి దగ్గరయ్యాడు. కేవలం బంగారం కోసం ఓ సైకోలా తయారై పలు హత్యలకు పాల్పడిన వెంకటేశ్వర్లు ఆయుధం 'సుత్తి'. సుత్తితోనే నాలుగు హత్యలు చేశాడు. అతడు చేసిన నేరాలు అత్యంత దుర్మార్గంగానూ, సమాజంలో తిరగడానికి అతడు అనర్హుడుగానూ భావించిన న్యాయమూర్తి 22 మంది సాక్షులను విచారించిన అనంతరం ఉరిశిక్ష విధించారు. నిందితుడు చేసిన నేరాలన్నీ రెండేళ్ల వ్యవధిలోపే విచారణకు రావడం విశేషం. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.కె.రఫీమాలిక్, లైజన్ ఆఫీసర్ బి.శ్రీనివాసులు వాదించి నిందితులకు శిక్షపడేలా చేశారు.



గతేడాది ఏప్రిల్ 2న వెంకటేశ్వర్లు చేతిలో హత్యకు గురైన పూజారి దంపతులు

వ్యసనాలకు బానిసై..

ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ముద్దాయి వెంకటేశ్వర్లు కొండాపురం మండలం ఎర్రగుట్లపల్లి గ్రామానికి చెందినవాడు. తొమ్మిదో తరగతి వరకు చదివిన నిందితుడికి చదువు అబ్బకపోవడంతో తల్లిదండ్రులు అతన్ని పినతల్లి తిరుపతమ్మ ఊరైన అనంతపురం జిల్లా హిందూపురానికి పంపారు. అక్కడ వెంకటేష్ ఓ హోటల్‌లో ఏడేళ్ల పాటు పనిచేస్తూ గడిపాడు. అక్కడ తాగుడు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు వంటి వాటికి బానిసయ్యాడు. ఈ హత్య జరగడానికి మూడు సంవత్సరాలకు ముందు వెంకటేశ్వర్లు కావలికి వచ్చి అక్కడ దక్షిణ జనతా పేటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని తోపుడు బండిపై నూడిల్స్ వ్యాపారం మొదలు పెట్టాడు.



కోర్టు ఆవరణలో ముద్దాయి వెంకటేశ్వర్లు

ఈ సమయంలో 3-6-2015 తేదీన నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన ముద్దులమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక బిడ్డ కూడా ఉన్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన వెంకటేశ్వర్లు ఇతరుల దగ్గర అప్పులు చేయడం ప్రారంభించాడు. అప్పులిచ్చిన వారు అవి తీర్చాలంటూ ఒత్తిడి తేవడంతో అతడుసులభంగా డబ్బు సంపాదించేందుకు నేరవృత్తి వైపు మళ్లాడు. మొదటగా కావలి పట్టణంలో ఓ మహిళను హత్య చేసి, అడ్డం వచ్చిన పిల్లలను సైతం గాయపరిచి ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. తర్వాత నెల్లూరు రూరల్ మండల పరిధిలో తన భార్య ఊరైన అల్లీపురం సమీపంలో ఉన్న పెద్దచెరుకూరులో వృద్ధ దంపతులైన పూజారి దంపతులతో పరిచయం పెంచుకుని కేవలం బంగారు కోసం ఆ వృద్ధ దంపతులిద్దరినీ దారుణంగా హత్య చేశాడు. అంత టితో ఆగకుండా 9-7-2016 తేదీన ఉదయం సమయంలో ఏదోఒక ఇంట్లో దోపిడీకి పాల్పడేందుకు నెల్లూరుకు వచ్చాడు. చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని ఓ ఆడిటర్ ఇం టిని ఎంచుకున్నాడు. అదే సమయంలో అతని మోటార్ సైకిల్ పంక్చర్ కావడంతో చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో పీడబ్ల్యూడీ ఆఫీస్ దగ్గర ఈ కేసులో 13వ సాక్షిగా ఉన్న మెకానిక్ తన్నీరు సురేంద్ర వద్దకు వెళ్లి పంక్చర్ అయిన తన మోటార్ సైకిల్‌ను ఇచ్చాడు. 10.30 గంటల ప్రాంతంలో ఆడిటర్ రామరాజు నాగేశ్వరరావు ఇంట్లోకి వెళ్లాడు. ఆ ఇంట్లో ఆడిటర్ భార్య రావిప్రోలు ప్రభావతి ఉన్నారు. వెంకటేశ్వర్లు తాను "సెట్ టాప్ బాక్స్" రిపేరు చేసేందుకు వచ్చానని ఆమె తో చెప్పగా, ఆమె ప్రస్తుతం ఇంట్లో కరెంటు లేదని చెప్పడంతో బయటకు వచ్చేశాడు. 11.30 - 12 గంటల మధ్య లో కరెంట్ రావడంతో తిరిగి ఆ ఇంటికి వెళ్లాడు. సెట్ టాప్ బాక్స్‌ను రిపేరు చేస్తున్నట్లుగా నటించడం ప్రారంభించాడు. ఆ సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు గుంపర్తి మాధురి, గుంపర్తి అనంతకృష్ణ ఆ ఇంటిలోనే ఉన్నారు. అదే సమయంలో ప్రభావతి 'డీటీహెచ్' కంపెనీ వారికి ఫోన్ చేసి నెట్‌వర్క్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తుండడంతో వెంకటేశ్వర్లు ఒక్కసారిగా ఆమెపైకి దూకి సుత్తితో తలపై ఇష్టమొచ్చినట్లు కొట్టాడు. దాంతో ఆమె రక్తపు మడుగులో పడిపోయింది. ఆమెను రక్షించేందుకు వచ్చిన గుంపర్తి అనంతకృష్ణను కూడా సుత్తితో ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో ఆయన కూడా రక్తపు మడుగులో పడిపోయాడు. అక్కడే బెడ్‌రూంలో ఉండిన ఈ కేసులో రెండో సాక్షి గుంపర్తి మాధవి తలపై కూడా సుత్తితో మోది గాయపరిచాడు. అనంతరం మాధవి దగ్గర ఉన్న సెల్‌ఫోన్, బంగారు చైన్, గోల్డ్ రింగ్, చెవి దుద్దులు దోచుకున్నాడు. తర్వాత రక్తపు మడుగులో పడి ఉన్న ప్రభావతి మెడలోని తాళిబొట్టు సరుడు, ఆమెకు సంబంధించిన ఇతర వస్తువులు దోచుకుని ఇంటిలో నుంచి పరారవుతుం డగా అదే సమయంలో ఆడిటర్ రామరాజు నాగేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. వెంకటేశ్వర్లు పరారయ్యేందుకు ప్రయత్నించగా నాగేశ్వరరావు అతన్ని గట్టిగా పట్టుకుని పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు, దారిన పోయే వారు అక్కడకు చేరుకుని అతడిని పట్టుకున్నా రు. ఇంట్లో రక్తపు మడుగులో ఉన్న ముగ్గురిని సమీపం లోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టరు అప్పటికే ప్రభావతి మరణించిందని ధ్రువీకరించారు. గాయపడిన ఇద్ద రికి చికిత్స చేసి వారి ప్రాణా లు కాపాడారు. ఈ మేరకు ఆడిటర్ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో బాలాజీనగర్ పోలీసులు నిందితుడిపై సెక్షన్ 302, 307, 394, 397, 450 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోలీసులు కేసును త్వరితగతిన విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ జరిగిన అనంతరం గురువారం తుది తీర్పు వెలువడింది. సెక్షన్ 302 ఐపీసీ కింద ఉరిశిక్షతోపాటు రూ.5వేలు జరిమానా, సెక్షన్ 450 కింద 10 సం వత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3వేలు జరిమా నా, 307 కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా, 394 ఐపీసీ కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా, 397 ఐపీసీ కింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. శిక్షలన్నీ ఏకకాలంలోనే అనుభవించాలని అందులో పేర్కొన్నారు.

కాగా .. 1997 సంవత్సరంలో షార్ వద్ద జరిగిన ఓ హత్యకేసులో ఉరి శిక్ష పడిన తర్వాత జిల్లాలో మరోసారి ఉరిశిక్ష పడడం వెంకటేశ్వర్లుకే.

రెండు దశాబ్దాల తర్వాత..

అతడు చేసిన హత్యలు జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. హత్య జరిగిన 13 నెలల్లోనే విచారణ పూర్తయి ముద్దాయికి ఉరిశిక్ష పడడం విశేషం.



డెంగ్యూ వ్యాధికి గురై
చికిత్స పొందుతున్న వెంకటమ్మ

- మంచం పడుతున్న కాలనీలు
- చోద్యం చూస్తున్న అధికారులు

విజృంభిస్తున్న డెంగ్యూ!

రేయింబవళ్లు దాడి చేస్తున్నాయి



రేయింబవళ్లు దాడి చేస్తున్న దోమలతో పోరా టం చేస్తున్నాం. మురుగులో ఉత్పత్తి చెందుతున్న దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

- ప్రమీలమ్మ, శ్యామసుందరపురం

అంతా మురుగే



శ్యామసుందరపురంలో మురుగు కాలువలపై శ్రద్ధ చూపడం లేదు. డ్రైనేజీ కాలువలలో దోమలు నిల్వచేరి ఇబ్బంది పెడుతున్నాయి. కాలనీ అంతా మురుగు మయం.

- కోటమ్మ, శ్యామసుందరపుం

కోట: డెంగ్యూ జ్వరం రోజురోజుకు విజృంభిస్తోంది. అనేక కాలనీల్లో ప్రజలు మంచం పట్టారు. శరీరంలో రక్త కణాలు పూర్తిగా తగ్గిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ జ్వరాలుగా గుర్తించినప్పటికీ స్థానిక వైద్యాధికారులు మాత్రం విషజ్వరాలు అని ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కోట పట్టణంలో 12 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఎక్కువశాతం కూలీలు, రిక్షా, బెల్దారి పని కార్మికులే. ఆకుతోట దిబ్బ, శ్యామసుందరపురం, రామ్‌రాజ్ థియేటర్ వీధి ప్రాంతాల్లో ఎక్కువగా కార్మికులు నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో రెండు, మూడు వారాల నుంచి విడవని జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో రెక్కాడితేగాని డొక్కాడని పలు కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయి. ఆకుతోట దిబ్బలో నివాసం ఉంటున్న ఓ ఆర్టీసీ కార్మికుడు, అతని కుమార్తె జ్వరంతో బాధపడుతుండటంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డాక్టర్లు డెంగ్యూ అని తేల్చారు. వారు అక్కడే చికిత్స పొంది కోలుకుంటున్నారు. రామ్‌రాజ్ థియేటర్ వీధిలో నివాసం ఉంటున్న అహ్మద్‌బీ కూడా మూడు వారాల నుంచి విడవని జ్వరంతో బాధపడుతుంది. ఆమె కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా డెంగ్యూ జ్వరంతో ఆమె శరీరంలోని రక్తకణాలు పూర్తిగా పడిపోయాయని తెలిపినట్లు బాధితురాలు తెలిపింది. క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న గజ్జల వెంకటమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈమె రెండు వారాల నుంచి విడవని జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్లు ఆమెకు డెంగ్యూ జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఇలా పట్టణంలోని పలు కాలనీల్లో నివాసం ఉంటున్న అనేక మంది విడవని జ్వరాలతో బాధపడుతున్నారు. అయితే బయట ప్రాంతాలకు వెళ్లి కార్పొరేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోలేక కోట, నాయుడుపేట, గూడూరు, ప్రాంతాల్లోని చిన్నపాటి ప్రైవేటు ఆసుపత్రులలోనే మంచాలకు పరిమితమవుతున్నారు. రోజురోజుకు ఈ డెంగ్యూ జ్వరాలు పట్టణంలో విస్తరిస్తున్నాయి.

● అరకొర సేవలు

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో డెంగ్యూ జ్వరాలతో ప్రజలు బాధపడుతుండగా వైద్య ఆరోగ్య సిబ్బంది అరకొర సేవలందించి చేతులు దులుపుకొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా అవి డెంగ్యూ జ్వరాలు కాదని, సాధార జ్వరాలు అని ఆరోగ్య సిబ్బంది అంటున్నారని తెలుస్తోంది. అయితే పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో డెంగ్యూ ప్రబలుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శ్యామసుందరపురంలో సుమారు 1500 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నాయి. అక్కడ పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ప్రధాన వీధుల్లో మురుగు చేరి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అంతేకాకుండా డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయని కారణంగా దోమలు దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు.



శ్యామసుందరపురంలో మురుగు

చర్యలు తీసుకుంటాం



డెంగ్యూ జ్వరపీడితులు ప్రభుత్వ ఆసుపత్రికి రావడం లేదు. వారి వివరాలు నమోదు కాలేదు. డెంగ్యూకు సంబంధించిన చికిత్సలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకు సంబంధించిన మందులు ఉన్నాయి. డెంగ్యూ జ్వరాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడుతాం.

- డాక్టర్ రవికుమార్, వైద్యాధికారి, కోట



అమరా సుబ్బారావును సన్మానిస్తున్న వస్త్రవ్యాపారులు

ఏఐటీటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా
అమరా సుబ్బారావు

కావలి: ఆల్ ఇండియా టెక్స్‌టైల్ ట్రేడ్ ఫెడరేషన్ (ఏఐటీటీఎఫ్) ప్రధాన కార్యదర్శిగా కావలికి చెందిన అమరా వెంకటసుబ్బారావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన్ను వస్త్రవ్యాపారులు గురువారం ఏపీసీ మార్కెట్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఏఐటీటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా అమరా వెంకటసుబ్బారావును నియమించడం జిల్లాకే గర్వకారణమని పలువురు వస్త్రవ్యాపారులు పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఆయన పోరాడాలన్నారు. అమరా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ వస్త్రాలకు జీఎస్‌టీని మినహాయించాలని నేతల దృష్టికి తీసుకెళ్లి తన వంతు పోరాటం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో వస్త్ర వ్యాపార సంఘ నాయకులు తన్నీరు మాల్యాద్రి, మోడరన్ నరసింహం, కటకం రాము, జీ వెంకటేశ్వర్లు, ఐవీ సుబ్బారావు, చెన్నిన వెంకట సత్యనారాయణ, ఐవీ సురేష్, ఓలేటి నాగేశ్వరరావు, వేమా రమేష్, పీ రమేష్‌బాబు, అమరా నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమరా వేదగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు ఆత్మకూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపు రైతులకు పరిహారం అందేనా..!

● 25 ఏళ్లుగా ఎదురుచూపు

కలువాయి : కలువాయి చెరువు కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం.. పరిహాసంగా మారింది. సుమారు 25 ఏళ్లుగా ముంపునకు గురైన భూముల్లో పంటల సాగు నిలిపివేసి రైతులు పరిహారం కోసం న్యాయ స్థానంలో పోరాడుతున్నారు. కోర్టు సూచనలు మేరకు ఉన్నాతాధికారులు చెరువు కింద ముంపునకు గురైన భూములు పరిశీలించి, పరిహారం విషయమై రైతులతో చర్చలు జరుపుతున్న సమయంలో రైతులకు పరిహారంపై ఆశలు చిగురిస్తాయి. ఆ తరువాత ఏళ్లు గడుస్తూన్నా ఎలాంటి కదలిక లేకపోడంతో మళ్లీ వారిని నిరాశ అవగిస్తోంది.



చెరువు కింద ముంపునకు గురైన భూములు

దీంతో భూమలు కోల్పోయిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కలువాయి చెరువును సోమశిల దక్షిణ కాలువ కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేశారు. దీంతో కలువాయి చెరవులో 1990 నుంచి సోమశిల జలాలు నింపుతున్నారు. ఈ చెరువు కింద 536 ఎకరాలు భూములు ముంపునకు గురయ్యాయి. అప్పటి నుంచి పరిహారం కోసం న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నారు. అయినా ఇంత వరకు వారికి పరిహారం అందలేదు. అందుతుందో లేదోనని పలువురు పేద రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పడప్పుడూ ఉన్నాతాధికారులు తమ భూములు పరిశీలించి రైతు ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే రైతులు ఆర్థికంగా చితికిపోయారు.

మత్స్యకారులకు నైపుణ్య పరీక్షలు



వల వేయడాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

రాపూరు: కండలేరు జలాశయం పరిధిలోని దాచూరు గిరిజన మత్స్యకార సహకార సంఘంలో నూతన సభ్యత్వాల కోసం దరఖాస్తు చేసుకున్న మత్స్యకారులకు కండలేరు జలాశయం వద్ద గురువారం నైపుణ్యం పరీక్షలు నిర్వహించారు. చెల్లటూరు, కండలేరు డ్యాం, కుమ్మరగుంట, రేగడపల్లి గ్రామాలకు చెందిన 89 మంది మత్స్యకారులు సభ్యత్వం కొరకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నైపుణ్యం పరీక్షలు నిర్వహించారు. చేపల వేట సాగించే వారికి ఎలాంటి అనుభవంపై ప్రమాదాలు లేకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ పరీక్షలు నిర్వహించారు. జలాశయంలో వల విసరడం, ఈత, వలలు రిపేరు చేయడం వంటి వాటిపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఒంగోలు చంద్రశేఖర్, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రకాష్, సొసైటీ డెరెక్టర్ నాగరాజు, సహాయ పరిశీలకులు శ్రీనివాసులు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు గూడూరు లక్ష్మీనారాయణ, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య పాల్గొన్నారు. అంతకు ముందు ఇక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతి కోసం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.



మత్స్యకార్లను ధ్రువీకరిస్తున్న అధికారులు

Who can approach Insurance Ombudsman?

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

BANK PO/ CLERKS EXAM SPECIAL

1. What is PMVVY? Give details.
a) Pradhan MantriVayaVandanaYojana (PMVVY)
b) The scheme is open to people aged 60 years and above
c) For monthly pension, the minimum amount to be invested is Rs.1.5 lakhs and the maximum is Rs.7.5 lakhs. LIC has been given mandate to operate the scheme
d) The scheme is exempt from GST
e) All the above

2. When currency notes of denominations of Rs. 1000 and Rs. 500 (specified bank notes or SBNs), valued at Rs. 15.4 trillion and constituting 86.9 percent of the value of total notes in circulation, were demonetized?
a) 2015 b) November 8, 2016
c) 2014 d) 2012 e) 2011

3. MSM releases will also feature salient facts, data and tables that are germane to the topic. What is MSM (in RBI)?
a) Money Street Memos
b) Mint Street Memos
c) Many Street Memos
d) Most Stressed Memos
e) None of these

4. Current Account and Saving Account (CASA) deposits are called as what?
a) High cost deposits b) Costly deposits
c) Low cost deposits d) Fixed deposits
e) None of these

5. Pradhan Mantri Jan-DhanYojana (PMJDY) accounts can be linked with which of the following?
a) Aadhar card number and mobile phone number
b) PMSBY or PMJJBY c) APY
d) All the above e) None of these

6. A significant amount of Specified Bank Notes (SBNs) viz., Rs.500 (old) & Rs. 1000 (old) flowed into which of the following special types of accounts in 2016?
a) Basic Saving Bank Deposit Account (BSBDA);
b) PMJDY Accounts; Kisan Credit Card (KCC);
c) Dormant or inoperative accounts; co-operative banks' accounts with SCBs;
d) Bullion trader/jewellers' accounts; and loan accounts.
e) All the above

7. About 85 per cent of the total collections by LIC of India in November 2016 were under which of the following?
a) The 'single premium' policies, which are paid in lump sum
b) Monthly c) Quarterly
d) Annually e) None of these

8. The Reserve Bank's Central Board, at its meeting held recently, approved the transfer of surplus to the Government of India amounting to Rs. 306.59 billion for the year ended________ .
a) June 30, 2017 b) December 2016
c) March 31, 2017 d) April 30, 2017
e) None of these

9. Which type of General Insurance Policies can be purchased online?
a) Motor (2-wheeler & Private car)
b) Health/ Personal Accident/
c) Overseas Mediclaim/ Householder/
d) Shopkeeper/ Pravasi Bhartiya Bima Yojana
e) All the above

10. When a person can renew his general insurance policy?
a) Only from 30 days before the expiry date of policy till the date of expiry
b) Within one year from the date of expiry
c) Within 2 years from the date of expiry
d) Within 5 years from the date of expiry
e) None of these

11. Who are entitled to join PRADHAN MANTRI SURAKSHA BIMA YOJANA?
a) All savings bank account holders in the age 18 to 70 years in participating banks
b) Below 5 years of age
c) Below 10 years of age
d) Below 12 years of age
e) None of these

12. What is the premium per member under PMSBY?
a) Rs.12/- per annum per member
b) Rs.100/- c) Rs.150/-
d) Rs.250/- e) None of these

13. Who is the Master Policy Holder for PMSBY?
a) LIC b) RBI
c) Participating Bank will be the Master policy holder on behalf of the participating subscribers
d) NABARD e) None of these

14. What is "Group insurance"?
a) Insurance for only one person
b) Insurance cover obtained by a group of individuals, either through an employer or otherwise, under a single contract;
c) Insurance for a married couple only
d) Insurance only for unmarried person
e) None of these

15. What is the method of Appropriation of Premium in PMSBY?
a) Insurance Premium to Insurance Company: Rs.10/- per annum per member
b) Reimbursement of Expenses to BC/ Micro/Corporate/Agent : Rs.1/- per annum per member
c) Reimbursement of Administrative expenses to participating Bank: Rs.1/- per annum per member
d) All the above e) None of these

16. Insurance Ombudsmen are appointed by the Governing Body and are empowered to entertain which type of complaints in respect of personal line insurances?
a) any partial or total repudiation of claims by an insurer
b) Any dispute in regard to premium paid or payable in terms of the policy
c) any dispute on the legal construction of the policies in so far as such disputes relate to claims
d) delay in settlement of claims; and non-issue of any insurance document to customers after receipt of premium
e) All the above

17. Who can approach Insurance Ombudsman?
a) Any aggrieved individual who has taken an insurance policy on persona lines
b) if deceased the legal heir(s) under such policy
c) Both (a) and (b) d) Supreme Court
e) None of these

18. Is there any time limit to approach the insurance ombudsman?
a) Within one year of the rejection by the insurer of the representation of the complaint or the insurer's final reply to the representation
b) Within 2 years c) Within 4 years
d) Within 5 years e) None of these

19. When the accident cover for the member shall terminateand nobenefit will be payable, under PMSBY?
a) On attaining the age of 50 years
b) On attaining age 70 years (age nearest birth day).
c) On attaining the age of 40 years
d) On attaining the age of 30 years
e) None of these

20. Aninsurance Ombudsman shall be appointed for a term of how many years? Give details?
a) 3 years
b) Shall be eligible for reappointment provided that no person shall hold office as an Ombudsman after he has attained the age of seventy years.
c) Both (a) and (b)
d) After the age of 75 years
e) None of these

21. "Health insurance business" means the effecting of contracts for which of the following ?
a) For sickness benefits
b) Medical, surgical or hospital expense benefits, whether in-patient or out-patient travel cover and
c) Personal accident cover
d) All the above e) None of these

22. No policy of life insurance shall be called in question on any ground whatsoever after the expiry of how many years from the date of the policy? (i.e., from the date of issuance of the policy or the date of commencement of risk)
a) three years b) 4 years c) 5 years
d) 6 years e) None of these

23. A contract of marine insurance is an agreement whereby the insurer undertakes to indemnify the assured, in the manner and to the extent thereby agreed, against which of the following?
a) Marine losses, that is to say, the losses incidental to marine adventure
b) Air cargo c) Railway transport
d) Road transport e) None of these

24. State Bank of India (SBI) has informed that it has introduced 'Work from Home Policy' for whom? Give details?
a) Permanent Officers in the Bank.
b) The facility can be availed occasionally up to 5 days a month or for a longer duration
c) It is subject to approval by the Competent Authority not less than officers in the grade of TEGS-VI i.e. Deputy General Manager/TEGSS-I i.e. Chief General Manager
d) All the above e) None of these

25. Which bank has launched a facility where by its existing customers can avail personal loansupto Rs.15 lakhs at its ATMs?
a) ICICI Bank b) Citi Bank
c) American Express d) SBI
e) None of these

26. The second life insurer in India to go public soon?
a) SBI Life b) LIC
c) New India Insurance
d) United India Insurance
e) Oriental Insurance

Praturi Potayya Sarma

ANSWERS

1) e	4) c	7) a	12) a	17) c	22) a
2) b	5) d	8) a	13) c	18) a	23) a
3) b	6) e	9) e	14) b	19) b	24) d
		10) a	15) d	20) c	25) a
		11) a	16) e	21) d	26) a

ఉద్యోగాలు

బిఎంఆర్‌సిఎల్

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిఎంఆర్‌సిఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్షన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 20

కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు

విభాగాలు - ఖాళీలు: టెలికం 2, ట్రాక్షన్ 2, ఎఎఫ్‌సి 2, సిగ్నలింగ్ 1, సివిల్ / ఆర్ఎస్ఎస్ 2, సిస్టం డిజైన్ 2, ఇ & ఎం లిఫ్ట్స్ & ఎస్కలేటర్స్ 3, టివిఎస్ & ఇసిఎస్ 2, డిపో 2

వేతనం: నెలకు రూ.35910 + ఇతర అలవెన్సులు

అర్హత: (డిప్లొమా/ బిఇ/ బిటెక్)(మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ మెకట్రానిక్స్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇండస్ట్రియల్ కంట్రోల్/ టెలి కమ్యూనికేషన్/ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ డిజిటల్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ నెట్ వర్కింగ్/ పవర్ ఎలక్ట్రానిక్స్/ సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని దాని హార్డు కాపీని కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 26

చిరునామా: General Manager(HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor, BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore 560027

వెబ్‌సైట్: www.kannada.bmrc.co.in

అడ్మిషన్స్

ఎస్‌కెఎల్‌టిఎస్‌హెచ్‌యు

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం (ఎస్‌కెఎల్‌టిఎస్‌హెచ్‌యు)- ఉద్యాన **బిఎస్సీ (ఆనర్స్)**లో ప్రవేశానికి ఉద్దేశించిన **హార్టిసెట్ 2017**కు దరఖాస్తులు కోరుతోంది.

దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ద రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్, హైదరాబాద్ - 500030

వెబ్‌సైట్: www.skltshu.ac.in

ఐఐఎఎస్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ (ఐఐఎఎస్)- కింద పేర్కొన్న రీసెర్చ్ విభాగాల్లో **ఫెలోషిప్**లకోసం దరఖాస్తులు కోరుతోంది

రీసెర్చ్ విభాగాలు: సోషల్/ పొలిటికల్ అండ్ ఎకనామిక్ ఫిలాసఫీ/ కంపేరటివ్ ఇండియన్ లిటరేచర్ (యాన్షెంట్/ మెడ్‌లెవల్/మోడ్రన్/ ఫోక్/ ట్రైబల్)/ కంపేరటివ్ స్టడీస్(ఫిలాసఫీ/ రెలిజియన్/ హిస్టరీ-హిస్టరియోగ్రఫీ, ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ)/ ఎడ్యుకేషన్/ కల్చర్/ ఆర్ట్స్ - పర్ఫార్మింగ్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ లాజిక్ అండ్ మేథమెటిక్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్లాబ్లమ్స్ ఆఫ్ నేచురల్ అండ్ లైఫ్ సైన్సెస్/ స్టడీస్ ఇన్ ఎన్విరాన్‌మెంట్/ ఇండియన్ సివిలైజేషన్ ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ ఏషియన్ నైబర్స్/ ప్రాబ్లమ్స్ ఆఫ్ కాంటెంపరరీ ఇండియా ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ నేషన్ బిల్డింగ్

ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 30

చిరునామా: Secretary, Indian Institute of Advanced Study, Shimla- 171005

వెబ్‌సైట్: www.iias.ac.in

భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?

భూగోళశాస్త్రం

1. 'జాగ్రఫీ' పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?
ఎ) హెకాటియస్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) ఎరటోస్థనీస్ డి) అరిస్టాటిల్
2. భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) రాట్జెల్ బి) హెకాటియస్
సి) అరిస్టాటిల్ డి) అనాగ్జిమెండర్
3. ఆధునిక భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) ఎరటోస్థనీస్ బి) అల్ఇద్రిసి
సి) అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ డి) టాలమి
4. భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) జెమ్స్ రన్నెల్ బి) సర్‌జాన్ ఎవరెస్ట్
సి) విలియం లాంబ్డన్ డి) ఎవరూ కాదు
5. రాజకీయ భూగోళశాస్త్ర వ్యవస్థాపకుడు ఎవరు?
ఎ) అరిస్టాటిల్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) హెకాటియస్ డి) మెర్కెటర్
6. శాస్త్రీయంగా మొదటి ప్రపంచ పటం తయారు చేసింది?
ఎ) హెకాటియస్ బి) అల్ఇద్రిసి
సి) టాలమి డి) అనాగ్జిమెండర్
7. 'అట్లాస్' పదాన్ని తొలిసారి ఉపయోగించింది ఎవరు?
ఎ) మెర్కెటర్ బి) చైనీయులు
సి) రాట్జెల్ డి) కార్ల్ రిట్టర్
8. ప్రపంచ పటంలో దక్షిణాన్ని పైభాగంలో చూపింది ఎవరు?
ఎ) టాలమి బి) అల్ఇద్రిసి
సి) మెర్కెటర్ డి) హెకాటియస్
9. ఖగోళశాస్త్ర బైబిల్ అని ఏ గ్రంథాన్ని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రాలజి బి) కాల్టోగ్రఫి
సి) ఆల్మజిస్ట్ డి) ఏదీకాదు
10. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కోపర్నికస్ ఏ దేశస్థుడు?
ఎ) పోలెండ్ బి) గ్రీక్ సి) స్పెయిన్ డి) హాలెండ్
11. రోదసీ యాత్రికుడికి బయట ఉన్న ఆకారం ఏ రంగులో కనిపిస్తుంది?
ఎ) నీలం బి) ఎరుపు సి) తెలుపు డి) నలుపు
12. కింది వాటిలో విశ్వ ఆవిర్భావ సిద్ధాంతం కానిది ఏది?
ఎ) భూకేంద్రక సిద్ధాంతం బి) బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం
సి) డోలనా సిద్ధాంతం
డి) నిరంతరసృష్టి సిద్ధాంతం
13. డోలనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) జార్జ్ అబ్జెలియోటర్
బి) అలెన్‌శాండెజ్
సి) హెర్మన్ బాండీ డి) థామస్ గోల్డ్
14. వాయు పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) లాప్లాస్ బి) ఇమాన్యుయెల్ కాంట్
సి) చాంబర్లిన్ & మౌల్టాన్
డి) రస్సెల్స్
15. గ్రహాల పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) ఇమాన్యుయెల్ కాంట్ బి) లాప్లాస్
సి) జీన్స్ & జెఫ్రిన్ డి) చాంబర్లిన్ & మౌల్టన్
16. విశ్వ దీవులు అని వేటిని అంటారు?



ఎ) గెలాక్సీలను బి) నిహారికలను
సి) దుమ్ముధూళి కణాలను
డి) శూన్య ప్రదేశాన్ని
17. పాలపుంతకు సమీపంలో ఉన్న గెలాక్సీ ఏది?
ఎ) హైడ్రా బి) క్లెస్టర్
సి) ఆండ్రొమెడా డి) బెటిర్‌గ్లెక్స్
18. విశ్వంలో అతి పెద్ద నక్షత్రం ఏది?
ఎ) సూర్యుడు బి) సిరియాస్
సి) ప్రాక్సిమాసెంటావరి డి) బెటిల్‌గ్లెక్స్
19. విశ్వంలో దూరాలను కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం ఏది?
ఎ) కాంతి సంవత్సరం బి) అస్ట్రానామికల్ యూనిట్
సి) పార్‌సెక్ డి) ఏదీకాదు
20. ఒక కాంతి సంవత్సరం =
ఎ) 9.3 x 8^{10} km బి) 9.8 x 10^{12} km
సి) 9.3 x 10^{12} km డి) 9.4 x 10^{12} km



పర్వతం నాగార్జున
సీనియర్ ఫ్యాకల్టీ

21. దక్షిణ ధృవం వద్ద నుంచి ఆకాశంలో కనిపించే నక్షత్ర సమూహాన్ని ఏమంటారు?
ఎ) ఉర్సుమెజర్ బి) గ్రెట్‌బేర్
సి) సప్తర్షి మండలం డి) ఉర్సుమైనర్
22. గెలాక్సీలకు, నిహారికలకు మధ్య గల ఖాళీ ప్రదేశ శాతం ఎంత?
ఎ) 97% బి) 98% సి) 99% డి) 96%
23. పాలపుంత అనే గెలాక్సీని 'స్వర్గానికి దారులు' అని ఏ దేశస్థులు పిలుస్తారు?
ఎ) చైనా బి) గ్రీక్
సి) హిబ్రూ డి) ఎస్కిమోలు

పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్

24. చైనా అంతరిక్ష నావికులను ఏమని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రోనాట్స్ బి) కాస్మోనాట్స్
సి) టైకోనాట్స్ డి) ఏదీకాదు
25. నక్షత్రాలకు జన్మస్థానాలు అని వేటిని అంటారు?
ఎ) గెలాక్సీలు బి) నిహారికలు
సి) పాలపుంత డి) శూన్యప్రదేశం
26. కృష్ణబిలాలను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
ఎ) ఐన్‌స్టీన్ బి) రాస్‌గన్
సి) స్టీఫెన్ హాకిన్స్ డి) ఆల్ఫ్‌వెన్
27. కృష్ణబిలాలపై పరిశోధన చేసిన భారతీయుడు ఎవరు?
ఎ) సుబ్రమణ్యం చంద్రశేఖర్
సి) వెంకట్రామన్ రాధాకృష్ణన్
సి) హరగోవింద్ ఖొరానా డి) ఎవరూ కాదు
28. నక్షత్రాల్లో అధిక శాతం గల వాయువు?
ఎ) హీలియం బి) నైట్రోజన్
సి) ఆక్సిజన్ డి) హైడ్రోజన్
29. నక్షత్రాల్లో ఉష్ణోగ్రతను కొలిచే పరికరం?
ఎ) క్రైమోమీటర్ బి) కాస్మోక్రొనా
సి) పైరోమీటర్ డి) ఏదీకాదు
30. గ్రహాల జాబితా నుంచి తొలగించిన ప్లూటో గ్రహానికి ఏ నంబర్ కేటాయించారు?
ఎ) 134340 బి) 144240 సి) 134240 డి) 134342
31. సూర్యుని పరిభ్రమణ కాలం ఎంత?
ఎ) 250 కాంతి సంవత్సరాలు
బి) 250 మిలియన్ సంవత్సరాలు
సి) 27 మిలియన్ సంవత్సరాలు డి) ఏదీకాదు
32. సూర్యుని కాంతి భూమిని చేరడానికి పట్టే కాలం?
ఎ) 500 సెకన్లు బి) 600 సెకన్లు
సి) 450 సెకన్లు డి) 550 సెకన్లు
33. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే భాగం ఏది?
ఎ) ప్రోటోస్పియర్ బి) కరోనా
సి) క్రోమోస్పియర్ డి) ఏదీకాదు
34. ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణం?
ఎ) కాంతి విక్షేపణం బి) కాంతి పరిక్షేపణం
సి) కాంతి అవక్షేపణం డి) కాంతి వివర్తనం
35. సూర్యునికి, భూమికి మధ్య ఉండే గరిష్ఠ దూరం?
ఎ) 147 మిలియన్ కి.మీ.
బి) 149.5 మిలియన్ కి.మీ.
సి) 152 మిలియన్ కి.మీ.
డి) 153 మిలియన్ కి.మీ.
36. సూర్యగ్రహణ సమయంలో సూర్యునిలో కనిపించే భాగం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కరోనా డి) ఏదీకాదు
37. సూర్యునిలో అతి చల్లని ప్రాంతం?
ఎ) క్రోమోస్పియర్ బి) సూర్యాంకాలు
సి) కరోనా డి) ఏదీకాదు
38. సూర్యుని గురుత్వాకర్షణశక్తి భూమి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
ఎ) 28 రెట్లు బి) 27 రెట్లు సి) 13 రెట్లు డి) 29 రెట్లు
39. సూర్యునిలో అత్యంత వేడిగా ఉండే ప్రాంతం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కేంద్రం డి) ఏదీకాదు
40. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే రంగులు?
ఎ) ఎరుపు, నారింజ బి) ఎరుపు, ఆకుపచ్చ
సి) ఎరుపు, తెలుపు డి) ఎరుపు - పసుపు

సమాధానాలు

1) సి	7) ఎ	13) బి	20) సి	27) ఎ	34) ఎ
2) బి	8) బి	14) బి	21) డి	28) డి	35) సి
3) సి	9) సి	15) డి	22) ఎ	29) సి	36) సి
4) ఎ	10) ఎ	16) ఎ	23) బి	30) ఎ	37) బి
5) బి	11) డి	17) సి	24) సి	31) బి	38) ఎ
6) డి	12) ఎ	18) డి	25) బి	32) ఎ	39) సి
		19) సి	26) సి	33) సి	40) ఎ

ఉద్యోగాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - రెగ్యులర్ & కాంట్రాక్ట్ స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21
రెగ్యులర్ పోస్టులు: డిజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, ఎజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, డిఎం(ఐఎస్ ఆడిట్) 5
కాంట్రాక్ట్ పోస్టులు: వైస్ ప్రెసిడెంట్- కస్టమర్ అనలిటిక్స్(ఎసెట్ ప్రోడక్ట్స్) 1, సీనియర్ మేనేజర్(ప్రోడక్ట్ స్పెషలిస్ట్) 2, వైస్ ప్రెసిడెంట్ - కంప్లయింట్స్ మేనేజ్‌మెంట్ 1, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఐఎస్ ఆడిట్) 5, సీనియర్ మేనేజర్ (ఐఎస్ ఆడిట్) 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.sbi.co.in

సిసిఆర్‌హెచ్

సెంట్రల్ కౌన్సెల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (సిసిఆర్‌హెచ్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన **జూనియర్ రీసెర్చ్ ఫెలో**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
క్యాంపస్‌లు: రీజనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, గుడివాడ క్లినికల్ రీసెర్చ్ యూనిట్, తిరుపతి
వేతనం: నెలకు రూ.25,000 + హెచ్‌ఆర్‌ఏ
ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: ఆగస్టు 26న
వెబ్‌సైట్: www.ccrhindia.nic.in

ఐఐఎఫ్‌పిటి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ (ఐఐఎఫ్‌పిటి)- కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టులు - ఖాళీలు: రీసెర్చ్ అసోసియేట్ 1, సీనియర్ రీసెర్చ్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2
దరఖాస్తు ఫీజు: 500 **ఇంటర్వ్యూ:** ఆగస్టు 22న
వేదిక: Indian institute of food processing Technology, pudukkottai road, Thanjavur-613005, Tamilnadu.
వెబ్‌సైట్: www.iifpt.edu.in

ఎన్ఐపిసిసిడి

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ & ఛైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపిసిసిడి)- కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 25
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(సైన్స్/ కామర్స్/ సోషల్ సైన్స్) లేదా తత్సమాన అర్హత ఉన్నవారు అర్హులు. పిహెచ్‌డి/ ఎంఫిల్ + ప్రొఫెషనల్ / టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయసు: 65 ఏళ్లకు మించరాదు
వేతనం: నెలకు రూ.45,000
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.nipccd.nic.in/vac.html

సిఎస్ఐఆర్ - ఐఎంఎంటి

సిఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటి)- **ప్రాజెక్ట్ స్టాఫ్** భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 13
అర్హత: బిఎస్సీ(మినరల్ ప్రాసెసింగ్/కెమిస్ట్రీ)/ ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) / ఎంటెక్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్/ సైన్స్/ మినరల్ ప్రాసెసింగ్/ కెమికల్ ఇంజనీరింగ్/ బయో టెక్నాలజీ)/ (బిఇ/ బిటెక్)(మెటలర్జీ/ కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్)/ డిప్లొమా (మెటలర్జీ/ మెకానికల్/ కెమికల్) పూర్తిచేసి ఉండాలి.
ఇంటర్వ్యూలు: ఆగస్టు 29, 30
వెబ్‌సైట్: www.immt.res.in

బిఆర్ఎయు

డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ - ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
విభాగాలు: లా 1, సోషల్ వర్క్ 1, బయో టెక్నాలజీ 1, మేథమెటిక్స్ 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ 1
దరఖాస్తు ఫీజు: రూ.2000
పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 29 **వెబ్‌సైట్:** www.brau.edu.in

ఐడబ్ల్యుఎస్‌టి

బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ & టెక్నాలజీ (ఐడబ్ల్యుఎస్‌టి)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 6
పోస్టులు: స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ 2)1, ఎల్‌డిసి 3, ఫారెస్ట్ గార్డ్ 2. అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: Director, Institute of Wood Science & Technology, 18 th Cross, PO Malleswaram, Bengaluru- 560003
వెబ్‌సైట్: http://iwst.icfre.gov.in

ఎమ్మార్‌తో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల

కొడవలూరు: ఎమ్మార్ వ్యాక్సిన్ తట్టు,రుబెల్లా వ్యాధుల నుండి కాపాడడమే కాకుండా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని కొడవలూరు వైద్యాధికారి హరిశ్చంద్రసతీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో రాచెర్లపాడు,రేగడచెలిక,చంద్రశేఖరపురం ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను వేశారు.అనంతరం విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

దేవస్థానం భూములు స్వాధీనం

ఇందుకూరుపేట : ఇందుకూరుపేటలోని దేవస్థానం భూములు పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖ సంయుక్తంగా స్వాధీన పరుచుకున్నాయి.. గురువారం కోర్టు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు ఇందుకూరుపేటలోని షఫీ ఆధీనంలో ఉన్న మూడు ఎకరాల భూమిని స్వాధీన పరుచుకుని దేవస్థానానికి అప్పజెప్పారు. కొడవలూరు మండలం రాజుపాళెంకు చెందిన వెంకటేశ్వర దేవస్థానానికి చెందిన మూడు ఎకరాల భూమి షఫీ అనే రైతు కౌలుకు చేసుకుంటున్నాడు. కౌలు చెల్లించకుండా భూమిని వదలకుండా ఉండడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇస్తూ తక్షణం భూములను స్వాధీనం చేసుకుని దేవస్థానానికి అప్పజేప్పాలని పోలీసులను ఆదేశించింది. ఆ మేరకు గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ రవీంద్రరెడ్డి, ఎస్ఐ బలరామిరెడ్డి, ఏఎస్ఐ మధుసూదన్‌రావు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, భూములను స్వాధీన పరుచుకుని ప్రభుత్వానికి అప్పజెప్పారు. ఈ మేరకు రికార్డులు కూడా రాసి గ్రామస్థులు సంతకాలు తీసుకున్నారు.

రైతులను రక్షించండి: సీపీఎం



రైతులతో మాట్లాడుతున్న రాజగోపాల్

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట మండలంలో ప్రముఖ ఆక్వా పరిశ్రమలు రైతుల జీవనాన్ని భవిష్యత్‌ను కాలరాస్తున్నాయని దీనిని సంయుక్తంగా ఎదుర్కోవాలని కమ్యూనిస్టు పార్టీ నాయకులు చంద్ర రాజగోపాల్ పిలుపునిచ్చారు. రైతు సంఘం, కౌలు దారుల సంఘం, కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా గురువారం గంగపట్నం, కొత్తూరు, జగదేవిపేట, మొత్తలు, డేవిస్‌పేట గ్రామాల్లో రైతులను కలుసుకుని అవగాహన కల్పించారు. ఆక్వా పరిశ్రమల వలన కలుషిత నీరు, వ్యర్థ నీరు, రసాయనిక నీరు వ్యవసాయ కాలువలకు వదులుతుండడం వలన పంటలు పాడైపోతున్నాయని, పశువులు, గేదెలు ఈ నీరు తాగి మృతి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆక్వా పరిశ్రమలు ఇప్పటికైనా వారి నీటిని కాలువల్లోకి వదలకుండా చూసుకోవాలని దీనికి మండలంలో రైతులందరూ కలిసి రావాలని కోరారు. 23వ తేదీలోపు వారు నిర్మూలించుకోలేకపోతే 24న ఆక్వా పరిశ్రమల వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఈ కాలువలకు వారు నీరు వదలకుండా తామే చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. ఆక్వా పరిశ్రమలున్న డేవిస్‌పేటకు 24న జరిగే ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందులో జిల్లా, మండల రైతు నాయకులు, కౌలు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తోందని శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. లేగుంటపాడు గ్రామంలో గురువారం రూ.30.5లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన పశువుల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ వైద్యశాలలపై దృష్టి పెట్టారని చెప్పారు. పశు సంపద పెంపొందించుకునేందుకు వీలుగా పశువైద్యశాలల్ని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. అనంతరం రూ.20లక్షలతో నిర్మించతలపెట్టిన నాలుగు బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ భవనం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు రామలింగేశ్వర రావు, ఎంపీడీవో జాలిరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ మస్తానయ్య, ఎంపీపీ గిద్దలూరు ఉమ, జడ్పీటీసీ చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పడుగుపాడు సొసైటీ అధ్యక్షులు జెట్టి రాజగోపాల్ రెడ్డి,టీడీపీ నాయకులు ఏలూరుకృష్ణయ్య, బాలరవి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేగూరు సుబ్బానాయుడు, కె.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

కొడవలూరు: విద్యుదాఘాతానికి గురై యవకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం వేకువజామున మండలంలో జరిగింది. మండలంలోని దామేగుంట గ్రామంలో నివాసముంటున్న సుమన్ ఆదే గ్రామంలో ఉన్న తన పొలాల్లోని విద్యుత్ మోటారును వేయడానికి వేకువజామున వెళ్లాడు. అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్య సేవల నిమిత్తం అతడిని వెంటనే చెన్నైకి తరలించారు.

పిడుగుపాటుకి పూరిల్లు దగ్ధం

కొడవలూరు: మండలంలోని బసవాయపాళెం గ్రామంలో నివాసముంటున్న సుబ్బయ్య ఇంటిపై బుధవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పూరిల్లు దగ్ధమైంది. పిడుగుపాటు సమయంలో ఇంట్లోని వారంతా బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ పిడుగుపాటుతో నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దార్ బషీర్ కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అర్థిక సహాయం అందేలా చేస్తానని తెలిపారు.

నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

కొడవలూరు: నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి విస్వాసం వ్యక్తం చేశారు. మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం గ్రామాలలో గరువారం 683 టీడీపీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోన్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్ష నాయకులకు కనబడడంలేదని కోటంరెడ్డి ప్రతిపక్ష నాయకులను విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుండాలమ్మ పాళెం గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

భక్తులకు ప్రత్యేక అన్నదానం



అభయాంజనేయస్వామి విగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని నాగాయగుంట పంచాయతీ పరిధిలోని పాతకొండూరుపాళెంలో నూతనం గా నిర్మించిన ఆలయంలో గురువారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ దాతలు, స్థానిక భక్తజనం నడుమ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు హనుమాన్ శర్మతోపాటు పలువురు రుత్వికులు ముందుగా గణపతి పూజ నిర్వహించి ఆంజనేయస్వామి వి గ్రహానికి పాలు, పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలతో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. నాగమాంబాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కత్తి పద్మావతి, శేషయ్య దంపతులు దాతలుగా 15అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించగా గర్భగుడిలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు దాతగా కటారి వీరయ్య అనే దాతతోపాటు 18మంది దాతలు రూ.10వేల నుంచి 5వేలు వరకు విరాళందజేసి తమ వంతు సహాయసహకారాలందించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు హనుమాన్‌శర్మ మాట్లాడుతూ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిగిన రోజునుంచి 41రోజులపాటు మండల పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నయ్య, చిన్నయ్య, కిరణ్‌కుమార్, బాలగంగాధర్, మల్లికార్జున్‌తోపాటు పలవురు స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



పరిస్థితి అదుపులోకి తెస్తాం

బలరామిరెడ్డి, ఎస్ఐ ఇందుకూరుపేట

? : మైపాడులో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

!: నేను కొత్తగా వచ్చాను. అయినప్పటికీ పరిస్థితులు అన్నీ గమనించాను. మైపాడు బీచ్ వద్ద ప్రతి ఆది, సెలవు రోజుల్లో ప్రత్యేక పహారా ఏర్పాటు చేస్తాను. అక్కడే డ్రింక్ పరీక్షలు నిర్వహిస్తాం. వ్యభిచారం పూర్తిగా కం ట్రోల్ చేసేందుకు నిఘా ఏర్పాటు చేశాను.

? : ఇసుక రీచ్‌ల మీద ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

!: మండలంలో ఒక్క రీచ్‌కు కూడా అనుమతి లేదు. అయినా ఇసుక తరలిపోతోంది. ప్రతి రోజూ కూడా రహదారులని పోలీసుల దిగ్బంధనం చేస్తున్నాం. ఇసుక అక్రమార్కులపై చర్యలు తప్పవు.

? : పేకాట, కోడి పందేలపై చర్యలు తీసుకుంటున్నారా

!: జూదాల నిర్మూలనకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాం. త్వరలోనే చర్యలు మొదలవుతాయి. ఫలితాలను మీరే త్వరలోనే చూస్తారు.

- ఇందుకూరుపేట

కానరాని పారిశుధ్యం.. పట్టించుకోని పాలకులు



ఇస్కపాళెం అంబేద్కర్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని ఇస్కపాళెం, కామాక్షికాలనీ, అంబేద్కర్‌నగర్,, ఖాదర్ నగర్ తోపాటు పలు వీధులు, కాలువలు, నివాసాల పరిసర ప్రాంతాలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి. మురుగునీరు చేరి పందులు స్వైర విహారం చేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులుగానీ పాలకులు గానీ పట్టించుకోవడంలేదని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లముందు చేరిన మురు గునీరు, చెత్తా చెదారాల వల్ల మురుగు తయార వుతుండడంతో పెద్దలు, పిల్లలనే తేడాలేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. కాలువలు పూడిక తీసే విషయాన్ని అధికారులు పట్టించు కోక పోవడంతో చెత్తాచెదారాలు ప్లాస్టిక్ కాగితాలతో కాలువలు పూడిపోయి కంపు కొడుతున్నాయి. దీనికితోడు పందులు బెడద ఎక్కువైంది. రాత్రి పగలనే తేడాలేకుండా దోమలు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని చెత్తాచెదారాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇస్కపాళెం పరిధిలోని పలు ప్రాంతాలు పరిశీలించి చర్యలు పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో చర్చించి వెంటనే కాలువలు, వీధుల్లో చెత్తా చెదారాలు, మురుగును తొలగించేందుకు చర్యలు చేపడుతాము.

- ఎంపీడీవో సుజాత



వ్యాధులభయంతో అల్లాడుతున్నాం



మురుగుకాలువల్లో పూడిక తీయడంలేదు. దుర్గంధంతో భజనం చేయలేకున్నాం. దోమలతో చిన్నపిల్లలు ఇప్పటికే జ్వరాల బారిన పడ్డారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్వచ్ఛందంగా మేమే నాలుగురోజులకసారి చెత్తాచెదారాలు తొలగించుకుంటున్నాం. అధికారులు స్పందించి మురుగు, చెత్తను తొలగించి ప్రజలను వ్యాధుల ఆందోళన నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

- రమణమ్మ, అంబేద్కర్‌కాలనీ.

వింజమూరులో వర్షం

వింజమూరు: వింజమూరులో గురువారం రాత్రి 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఇప్పటివరకూ రైతులు వానల కోసం ఎదురు చూశారు. దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు.

నేడు 'సాలీడ్‌వేస్ట్'పై శిక్షణ

ఉదయగిరి: సాలీడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శుక్రవారం వింజమూరులో శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో వీరాస్వామి గురువారం తెలిపారు. ఉదయగిరి మండలంలోని అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

చెత్త రహితంగా వింజమూరు

●శిక్షణలో డిపీవో శ్రీహరి

వింజమూరు: జిల్లాలోని స్వచ్ఛ వింజమూరుగా నిలపాలని డీపీవో శ్రీహరి అన్నారు. గురువారం స్థానికంగా వ్యర్థాల నుంచి సంపద కేంద్రంలో వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వానపాముల ఎరువును ఏ విధంగా తయారుచేయాలి, దాని ఉపయోగాలు వివరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా కేంద్రా నికి తీసుకురావాలన్నారు. ఎవరైనా చెత్తను రోడ్డుపైగానీ, డ్రైనేజీలోగానీ వేస్తే ఆపరాధరుసుం విధించాలన్నారు. చెత్తలేని పంచాయతీగా మార్చా లన్నారు. వానపాములు వేసేందుకు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతిగృహాల నుంచి వ్యర్థాలను సేకరించాలన్నారు. వానపాముల ఎరువు అమ్మకం జరిగే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక ట్రైసైకిల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వసుమతి, ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, గీర్వాణి, సర్పంచు జీ.బాలకృష్ణారెడ్డి, ఎంపీపీ జీ.కృష్ణకిరణ్‌రెడ్డి, ఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ సరళ, జడ్పీటీసీ పీవీ నారాయణరెడ్డి, ఎంపీడీవో ప్రత్యూష, ఈవోపీఆర్డీ ఆర్.పద్మ, కోఆర్డినేటర్ సత్యనారాయణ, వింజమూరు, సీతారామపురం మండలాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీహరి

'గిరి'లో సంచార విజ్ఞాన ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఉదయగిరి: స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సంచార విజ్ఞాన ప్రదర్శనను గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిలకించారు. జ్ఞానేంద్రీయాల పనితీరు, వర్ణాంధత్వం, దూరదృష్టి, ధ్వని దిశను కనుగొనుట, జ్ఞానశక్తి, చెవి పనితీరు తదితరంశాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. డెమోనిస్ట్రేటర్లుగా మహేష్, భానుప్రకాష్, ధనుంజయలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భిక్షాలు, ఉపాధ్యాయులు గౌస్‌బాష, నరసింహులు, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

వింజమూరు: మండలంలోని ఊటుకూరు ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన సామగ్రినిదాత వితరణ చేశారని ప్రధానోపాధ్యాయులు ఆర్.కనకరావు తెలిపారు. గ్రామానికి చెందిన కొండా వెంకటేశ్వరచౌదరి వారి తల్లిదండ్రులు కొండా చినవెంకటయ్యచౌదరి, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఈ వితరణ చేశారని పేర్కొన్నారు. దాతను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు మాదినేని నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఫ్యాన్ల బహూకరణ

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలకు గురువారం కానిస్టేబుల్ దంపతులు ఫ్యాన్లు వితరణ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ హోంగార్డు వాకమల్ల జనార్ధన్‌రెడ్డి, భాగ్యమ్మ దంపతులు, కల్లూరి ఓబుల్‌రెడ్డి ఐదు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ సాధీక్ బాషా, ఆకుల శ్రీనివాసులరెడ్డి, షేక్ ఎండీ కరీం, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



మాట్లాడుతున్న సత్యవాణి

ఉదయగిరి రూరల్: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని ఏడీఏ పి.సత్యవాణి సూచించారు. మండలంలోని గండిపాళెం గ్రామంలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వరి సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. పంటలో సూక్ష్మ పోషకాలు జింక్, ఇనుము ధాతులోపాలను ఎలా గుర్తించి వాటిని ఎలా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, ఏఈవో బి.సుధీర్‌కుమార్, ఆత్మ బటీఎం సుధాకర్‌రెడ్డి, ఏటీఎం దొరసానమ్మ, ఎంపీఈవోలు ఫయాజ్, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని జడదేవి గ్రామంలో ఆదివారం నుంచి జరుగుతున్న శ్రీగంగమ్మతల్లి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి బండ్లు పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ

వింజమూరు: మండలంలోని సాతానువారిపాళెం గ్రామంలో గురువారం శ్రీఅభయాంజనేయస్వామివారి శిలా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ శుద్ధి చేపట్టారు. సాయంత్రం విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, వాస్తుహోమం, ధాన్యాధివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పసుపులేటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సునీల్‌కుమార్‌అచారి ఆధ్వర్యంలో కార్యక్రమాల జరుగుతున్నాయి. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీకా పంపిణీ పరిశీలన



టీకా వేస్తున్న సిబ్బంది

వింజమూరు: వింజమూరులో జరుగుతున్న మీజిల్స్, రుబెల్లా టీకాల పంపిణీని ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం సభ్యులు పి.శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. మండలంలోని ఏ కిస్తీపురం, మోటచింతల పాళెం, స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో టీకాల పంపిణీని పరిశీలించి పలు సూచనలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీకాలు వేయించుకొనేందుకు భయపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఎక్కడా ఈ టీకాల వల్ల దుష్ప్రభావం లేదన్నారు. టీకాలు వేసిన అనంతరం రెండు గంటలు పరిశీలనలో ఉంచతామన్నారు. చర్మంపై దద్దుర్లు, వాంతులు, జ్వరం వస్తే వైద్యాధికారులను అందుబాటులో ఉంచామన్నారు. టీకాలు వేసే కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో మాత్రమే టీకాలు వేస్తున్నామని, ఇకపై ఇంటింటికొచ్చి మిగిలిన పిల్లలందరికి టీకాలు వేస్తామన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

వరికుంటపాడు: మండలంలోని మహమ్మదాపురం గ్రామంలో సర్వేనెంబర్ 155, 156ల్లో 91లోఉన్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ భూమిని ఆక్రమిస్తున్నారని పలువురు తహసీల్దారు టీ శ్రీనివాసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఆయన పరిశీలించి ఎవరైనా అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేయాలి

వింజమూరు: దళితులను కించపరుస్తూ మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డి వెంటనే అరెస్టు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బూదాల ప్రేమదాసు ఒక ప్రకటనలో డిమాండు చేశారు. మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీలను నెవరేర్చాలని డిమాండు చేశారు. ఎస్సీవర్గీకరణకు సహకరించాలన్నారు. ఎన్ని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు.

వధూవరులకు మేకపాటి ఆశీర్వాదం

సీతారామపురం: మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పలువురు వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని గంధంవారిపల్లి, సంగసానిపల్లి గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. అయ్యవారిపల్లి గ్రామంలో వైసీపీ నాయకుడు రమణయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జనార్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న స్క్వాడ్ అధికారి సర్దోజీరావు

వింజమూరు: వింజమూరులోని పలు ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఏడీఏ ఏ సర్దోజీరావు మాట్లాడుతూ ఒకే లైసెన్సు కలిగిన ఎరువులన్నీ ఒకే గోదాములో ఉండాలన్నారు. అన్ని కంపెనీలో ఎరువుల వివరాలను ఒకే ఫారంలో పొందుపర్చాలని తెలిపారు. ఫారం-వోలో ఉన్న ఎరువులను మాత్రమే అమ్మాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డీబీటీ ద్వారా ఎరువులు అమ్మకాలు చేయాలన్నారు. స్టాక్ బోర్డు, లైసెన్సు వివరాలు తెలిపే పట్టికను ఏర్పాటు చేయాలని హెచ్చరించారు. లైసెన్సులో పొందుపర్చిన ఎరువులను గోదాములో నిల్వ చేసుకోవాలని, ఇతర ఉత్పత్తులు అందులో కాకుండా వేరుగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏవో సుబ్రహ్మన్యం, యజమానులు ఉన్నారు.

బిందు, తుంపర్ల సేద్యంపై శిక్షణ

వింజమూరు: మండలంలోని ఎర్రబల్లిపాళెంలో సూక్ష్మ బిందు సేద్యం, ఆత్మ వారి సౌజన్యంతో బిందు, తుంపర్ల సేద్యంపై గురువారం శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఐ ఇంజనీర్ వెంకటేష్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం వల్ల తక్కువ నీటితో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంటలకు చీడపీడలు వచ్చే అవకాశాలు చాలా తక్కువన్నారు. పురుగుమందులు, రసాయనిక ఎరువుల ఖర్చు కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా పంటలు పండిస్తే ప్రభుత్వం రాయితీ ద్వారా డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు అందిస్తుందన్నారు. 2017-18 సంవత్సరానికి 10వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం ద్వారా పంటలుసాగు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం డ్రిప్ పరికరాలను ఎలా ఉపయోగించాలనే విషయాన్ని ప్రత్యక్షంగా చేసి చూపారు. కార్యక్రమంలో ఎంఐడీసీ నారాయణరావు, ఎంపీఈవో రత్నం, ఆత్మ సిబ్బంది మౌనిక, మేఘన, ఎంఐవో సుప్రియ, రైతులు పాల్గొన్నారు.



పరికరాలను ఉపయోగించే విధానాన్ని తెలుపుతున్న వెంకటేష్

ఆన్‌లైన్ సేవలు ఆగడంతో అవస్థలు

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆన్‌లైన్ పని చేయక అటు సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో ఉండే ఏపీ స్కాన్ ఆన్‌లైన్ నెల క్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మరమ్మతులకు గురైంది. స్థానిక అధికారులు సమస్యను జిల్లా అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. విద్యార్థులు, రైతుల శ్రేయస్సు దృష్ట్యా తహసీల్దారు వెంకటసునీల్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయ అధికారులతో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. బిఎస్ఎన్ఎల్‌కు బిల్లులు చెల్లింకపోవడంతో ఆ సౌకర్యం కూడా ఆగిపోయింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏపీ స్కాన్ అందుబాటులోకి తెచ్చి ప్రజల కష్టాలు తీర్చాల్సి ఉంది.

'ఉపాధి' గ్రామసభలు

సీతారామపురం: మండలంలోని జయపురం, పోలంగారిపల్లి, సింగారెడ్డిపల్లి, గుండుపల్లి గ్రామాల్లో గురువారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆయా పంచాయతీల్లో ఉపాధి పనులపై చేపట్టిన ఆడిట్ వివరాలు వెల్లడించారు. పలుచోట్ల పనుల్లో నాణ్యతాప్రమణాలు లోపించాయని గుర్తించారు. సమగ్ర సచారం 19న జరిగే బహిరంగా చర్చావేదికలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ సురేష్, డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. కుటుంబసభ్యుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లకు అనుకూలం. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ఇంటికి అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. చర్చలు, ప్రయాణాలు లాభిస్తాయి.



మిథునరాశి: (మే21-జూన్21): బిల్లులు, చెక్కులు అందుకుంటారు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఈ విషయాల్లో కొత్త ఆలోచనలు అమలు చేసేందుకు తగిన సమయం. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



సింహరాశి: (జూలై24-ఆగస్టు23): సినీ, రాజకీయ రంగాల వారు లక్ష్యాలు సాధిస్తారు. దీర్ఘకాలంగా వాయిదాపడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. అలజడి తగ్గి మనశ్శాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక దృక్పథం పెరుగుతుంది.




కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రక్షణ రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): రాజకీయ, బోధన, న్యాయ, రక్షణ రంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలకు అనుకూలం. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): స్పెక్యులేషన్లు, పెట్టుబడులపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. శ్రీవారు, శ్రీమతి సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వృత్తిపరమైన సమావేశాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో భాగస్వామి సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల ఆరోగ్యం మెరుగుపడుతుంది.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులకు శుభప్రదం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పింఛన్లు ఇవ్వండి సారూ!

● 23 వేల మంది దరఖాస్తు

● రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందని అనుమతి

● అధికారుల చుట్టూ అర్హుల ప్రదక్షిణ

నెల్లూరు (హరనాథపురం) : కొత్త పింఛన్ల మంజూరు కోసం వేలాది మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురు చూస్తున్నారు. పింఛన్ల కోసం అర్జీలు సమర్పించిన వారిని వర్గీకరించి కంప్యూటర్లలో నమోదు చేస్తున్న, కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాక పోవ డంతో అర్హులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 2,56,059 మందికి పింఛన్లు ఇస్తున్నారు. వృద్ధులు 1,01,730 మంది, చేనేత కార్మికులు 4,772, వికలాంగులు 31,439, వితంతువులు 1,05,496 కల్లుగీత కార్మికులు, 1178, అభయహస్తం కింద 11,444 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరందరికీ ప్రతి నెల రూ.27.85 కోట్లు పింఛనుగా చెల్లిస్తున్నారు. 2014కు ముందు ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.200 ఉండగా, ఇప్పుడు రూ.వెయ్యికి చేరుకుంది. 80శాతం మించి అంగవైకల్యం కలిగిన వికలాంగులకు రూ.1500 పింఛనుగా అందచేస్తున్నారు. 2014 ముందు నెలకు రూ.5.23 కోట్లు ఇస్తుండగా ఇప్పుడు రూ.27.85 కోట్లు పింఛన్ల రూపేణా ఇస్తున్నారు. ఈ మూడేళ్లలో జిల్లాలో ఇప్పటివరకు 49వేల కొత్త పింఛన్లు మంజూరు చేశారు.

● **23 వేలమంది దరఖాస్తు**

జిల్లాలో కొత్త పింఛన్ల కోసం 23వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా పింఛన్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. 4వ విడత జన్మభూమిలో జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 2 వేల పింఛన్లు మంజూరు చేశారు. ఆనాడు మొత్తం 35వేల మంది దరఖాస్తు చేసుకోగా 20వేల మందికే పింఛన్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత మరో 8 వేల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారు. ప్రస్తుతం 23వేల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసి ఉన్నారు. జన్మభూమి కమిటీ నిర్ధారించిన వారికే ఆ పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. కమిటీల పెత్తనం కారణంగా నిజమైన అర్హులకు పింఛన్లు మంజూరు కావడంలేదని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అర్హులకు పింఛన్లు అందేలా చూడాల్సిన అవసరం ఉంది.



పింఛన్ల కోసం కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధులు

అర్హులకు పింఛన్లు అందేలా చూస్తాం

అర్హులైన అందరికీ కొత్త పింఛన్లు అందేలా చూస్తాం. మంజూరైన పింఛను దారులందరికీ ప్రతి నెలా పింఛన్లు సక్రమంగా అందేలా చూస్తున్నాం. సమీక్షా సమావేశాలు నిర్వహించి పింఛనుదారుల సమస్యలు పరిష్కరిస్తున్నాం.

- లావణ్యవేణి, పీడీ, డీఆర్‌డీఏ

బిల్లుల చెల్లింపు సులభతరం

● హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి

నెల్లూరు(కలెక్టరేట్): హౌసింగ్ శాఖలో బిల్లుల చెల్లింపు సులభంగా, వేగవంతంగా జరగనుందని హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ సమావేశ మందిరంలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల వివరాల అప్ లోడింగ్‌పై శిక్షణ శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ ఈజీఎస్ నిధుల వినియోగానికి సంబంధించి డేటా అప్‌లోడింగ్ గతంలో ఆలస్యంగా జరగడం వల్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు ఆలస్యమయ్యేదన్నారు. అయితే, ఎన్ఆర్ ఈజీఎస్ నిధుల అప్‌లోడింగ్ బాధ్యతను ప్రభుత్వం హౌసింగ్ శాఖకే అప్పగించటం వలన అప్ లోడింగ్ వేగంగా జరిగి బిల్లుల చెల్లింపు సత్వరమే జరిగే అవకాశం కలుగుతుందన్నారు. నిధుల వినియోగ వివరాల అప్ లోడింగ్ గురించి డేటా ఎంట్రీ ఆపరేటర్లు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. విజయవాడ నుంచి వచ్చిన శివప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ సాయిరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అధికారులు

24న ఆక్వా

పరిశ్రమల ముట్టడి

నెల్లూరు (వేదాయపాళెం) : ఇందుకూరుపేట మండలం డేవిస్ పేటలో, నెల్లూరు రూరల్ పరిధిలో ఉన్న ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలను ఈనెల 24వ తేదీన ముట్టడిస్తామని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కార్యదర్శులు వీ పెద్దిరెడ్డి, పీ జమలయ్య, వీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వారు విలేఖర్లతో మాట్లాడారు. డేవిస్‌పేటలోని ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లకు చెందిన వ్యర్థాలు, కాలుష్య కారకాలను పంటకాలువల్లోకి వదులుతుండడంతో వృక్షాలకు, పశువులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. జిల్లా అధికారులకు, కాలుష్య నియంత్రణ శాఖకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయా సంస్థల నుంచి కాలుష్యాన్ని వెదజల్లుతున్న పైపులను ఈ నెల 24వ తేదీలోగా మూసివేయకపోతే ఆ పరిశ్రమలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీ శ్రీరాములు, టీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నష్టాలు వివరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు (కలెక్ట రేట్): బాల్య వివా హాల వలన కలిగే నష్టాన్ని బాలి కలకు వివరించాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులకు సూచించారు. ఎంపవర్ మెంట్ ఆఫ్ అడోలసెంట్ గర్ల్స్ అనే అంశంపై వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ బంగ్లాలో సమీక్షించారు. ప్రభుత్వ రెసి డెన్షియల్ పాఠశాలల్లో, హాస్టళ్లలో కౌమారదశలో ఉన్న బాలికలకు ఆరోగ్యం, ఆత్మసంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. బాలికల అవగాహనకు సంబంధించి పుస్తకాన్ని ముద్రించాలన్నారు. ఆ పుస్తకాల్లోని అంశాలు బాలి కలకు బోధించేలా మహిళా ఉపాధ్యాయులకు సూచించాలన్నారు. రిసోర్సు పర్సన్లను గుర్తించటంతోపాటు వారికి శిక్షణ ఇచ్చి బాలికా సాధికారతకు కృషి చేయాలని ఆదేశించారు. బాలికలకు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు వివిధ పోటీ పరీక్షల గురించి తెలియచేయాలన్నారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ వెంకట సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రశాంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం, ఆర్వీఎం పీవో రమణ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధు సూదన్, డీఈవో మువ్వా రామలింగం, ఐటీడీఏ పీవో కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,785
సవర (8 గ్రాములు)	-	22,280
వెండి కిలో ధర	-	42,200
వెండి గ్రాము ధర	-	42.20

చికెన్ ధరలు



వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	84
లేయర్	82
స్కిన్ చికెన్	139
స్కిన్‌లెస్ చికెన్	163
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	154
స్కిన్‌లెస్	180
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,700 నుంచి రూ. 3,300 వరకు

పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,200 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:		78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:		6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :		------------
అవుట్‌ఫ్లో	:	200 క్యూసెక్కులు
ఆవిరి	:	52 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: -------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	-------------

జంబ్లింగ్ వర్డ్స్

1. BONB ▸......................
2. YABB ▸......................
3. TOAC ▸......................
4. CHIR ▸......................
5. ICNH ▸......................

జంతర్‌మంతర్

1. ర్దయంని ▸......................
2. భఅయం ▸......................
3. దులుస్త ▸......................
4. రోపక్షం ▸......................
5. యికిరా ▸......................

చెప్పగలరా?

విసుగులో ఉన్నా కానీ
ముసుగులో లేను
జేబులో ఉన్నా కానీ జాబులో లేను
గీతలో ఉన్నా కానీ గీటులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

సమస్త తప్పిదాలకూ కారణం మనసు. దాన్ని సరిగ్గా ఉంచుకుంటే ఎప్పటికీ తప్పులు చేయవు.
- గౌతమ బుద్ధుడు

'ఐక్యూ'లో ఐన్‌స్టీన్‌ను దాటేశాడు!



ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రాహుల్ అనే కుర్రాడి ఐక్యూ (ఇంటెలిజెంట్ కోషంట్) గురించి గూగుల్‌ను ఎక్కువ శాతం అడుగుతున్నారట. బ్రిటన్‌లోని చానెల్ 4 టీవీలో 'చైల్డ్ జీనియస్' కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రౌండ్‌లోనే గట్టోడు అనిపించుకున్న రాహుల్ ఓవర్‌నైట్ హీరో అయ్యాడు. ఈ బుడతడు భారత సంతతికి చెందినవాడు కావటం మరో విశేషం.

రాహుల్ కుటుంబం ఉత్తర లండన్‌లోని బార్నెట్ ప్రాంతంలో నివసిస్తోంది. రాహుల్ తండ్రి మనీష్ ఐటి కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. తల్లి కోమల్ ఫార్మసిస్ట్. రాహుల్ వయసు పన్నెండేళ్లు. బ్రిటన్‌లోని 4 చానల్‌లో ఓ వారం పాటు జరిగిన 'చైల్డ్ జీనియస్' కార్యక్రమంలో రాహుల్ పాల్గొంటున్నాడు. ఈ పోటీ కోసం సదరు కార్యక్రమ నిర్వాహకులు 8-12 ఏళ్లలోపు వయసున్న 20 మందిని ఎంపిక చేశారు. వారే పోటీలో పాల్గొంటారు. తొలి రౌండ్‌లోనే రాహుల్ కత్తిలాంటి కుర్రాడనిపించుకున్నాడు. స్పెల్లింగ్ టెస్ట్‌లో పూర్తి మార్కులు పొందాడు. జ్ఞాపకశక్తి పరీక్షలో 15 ప్రశ్నలకు గానూ 14 ప్రశ్నలకు సరైన సమాధానాలిచ్చాడు. అతని ఐక్యూ లెవల్‌ను 162గా నిర్ధారించారు. ఇది ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ ఐక్యూ లెవల్ కంటే ఎక్కువ కావటంతో రాహుల్ మోస్ట్ పాపులరయ్యాడు. ఇక తదుపరి పరీక్షల తర్వాత ఈ వీకెండ్‌లో విజేతను ప్రకటిస్తారు.



4 చానల్ 'చైల్డ్ జీనియస్' కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

లాటిన్ భాషపై ప్రేమ..

"మ్యాథ్స్, జీకే అంటే ఇష్టం. నా ఫేవరేట్ భాష లాటిన్. నాకు తెలిసి నేను మేధావి అనుకుంటా. ఏ విషయాన్నైనా సులువుగా గుర్తుంచుకుంటాను. ఎప్పుడూ అందరికంటే ది బెస్ట్ ఉండాలి.. అనుకునే మెంటాలిటీ నాది" అంటూ రాహుల్ చెప్పుకొచ్చాడు. ఏదైనా రివైజ్ చేసుకోలేకపోతే రాహుల్ బాధపడిపోతాడట. ఆటలాడుకునే ఆడుకునే ఎక్స్ బాక్స్ తన దగ్గర ఉంటే తెగ హ్యాపీగా ఫీలవుతాడట ఈ బాల మేధావి.

మా వాడే విజేత

రాహుల్ జ్ఞాపకశక్తి భేష్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నట్లు విశేషమేంటంటే రాహుల్ శిక్షణ తీసుకుంది స్వయాన తన తండ్రి దగ్గరే. మొత్తానికి రాహుల్ తలితండ్రులు మాత్రం ఈ పోటీలో తమ కొడుకు విజేతగా నిలుస్తాడని నమ్మకంగా చెబుతున్నారు. ఈ వారాంతంలో జరిగే ఫైనల్‌లో రాహుల్ విజేత కావాలని మనమూ కోరుకుందాం!


టంగ్ ట్విస్టర్స్

1. Who ever slit the sheets is a good sheet slitter.
2. Crush grapes, grapes crush, crush grapes.
3. There was a minimum of cinnamon in the aluminum pan
5. A black bloke's back brake-block broke.


ఔనా!

ఎక్కువ ఐక్యూ (ఇంటెలిజెంట్) ఉన్న వాళ్లకు బ్రెయిన్ యాక్టివిటీ కూడా ఎక్కువే! ఆ కారణంగా వీళ్ల డిప్రెషన్‌కు గురైతే ఆ ప్రభావం మిగతా వాళ్లకంటే వీళ్లపై 3 రెట్లు ఎక్కువగా ఉంటుంది.

బొమ్మ గీయండి



రంగులు అద్దండి




నవ్వుల్ నవ్వుల్

టీచర్ : రోహిత్ కళ్లు మూసుకుని రాస్తున్నావేంటి?
రోహిత్ : పరీక్షల్లో చూసి రాయకూడదని మా అమ్మ చెప్పింది టీచర్.
టీచర్ : !!!


చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



జత పరచండి



జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. NOBB 2. BABY 3. COAT 4. RICH 5. CHIN జంతర్‌మంతర్ : 1. నిర్దయం 2. అభయం 3. దుస్తులు 4. పరోక్షం 5. కిరాయి చెప్పగలరా? : విజేత

పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచండి!





మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు, పాల్గొన్న అభ్యర్థులు

- సమాజాభివృద్ధికి పాటుపడాలి
- శిక్షణ కేంద్రం అభివృద్ధికి సహకరిస్తా
- కొత్త అభ్యర్థుల శిక్షణ ప్రారంభంలో కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు (క్రైం) : సమాజంలో ఎంతో కీలకమైన పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేవిధంగా నూతనంగా ఎంపికైన పోలీసు సిబ్బంది పాటు పడాలని కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. చెముడుగుంట పంచాయతీ పరిధిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం ఐదవబ్యాచ్‌కు ఎంపికైన 195 మంది సివిల్ కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభమైంది. కలెక్టర్‌తోపాటు ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణా కేంద్రంలో అత్యాధునిక వసతులు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేంద్రం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. అభ్యర్థులకు మంచి ఆహారం అందించేలా పీడీఎస్ రైస్‌ను అందించడంతోపాటు డ్వామా ద్వారా స్విమ్మింగ్ ఫూల్, వర్షపు నీటిని నిలువ చేసే చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు అందిస్తామని తెలిపారు. పోలీసుశాఖపై తనకు ప్రత్యేక గౌరవం ఉందని, తాను కూడా కొంతకాలం పోలీసశాఖలో పని చేశానని గుర్తు చేసుకున్నారు. తొలుత 2005లో సివిల్స్ రాసిన సమయంలో భారతీయ రైల్వేకు ఎంపికై శిక్షణ పొందిన అనంతరం రెండవసారి 2006లో రాజస్థాన్ ఐపీఎస్ కేడర్‌కు ఎంపికై ఏఎస్పీగా అక్కడ కొంతకాలం పనిచేశానన్నారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచి ఐఏఎస్‌గా ఎంపికయ్యానని తెలియచేశారు. పోలీసు దుస్తులకు ఉన్న గౌరవం, విలువ గురించి క్షుణ్ణంగా తెలియచేసి దాని ఔన్నత్యాన్ని కాపాడాలని సూచించారు. ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన సిబ్బంది నిబద్ధతతో శిక్షణ పొందాలని, క్రమశిక్షణ పాటించి పోలీసు ఉన్నతికి పాటుపడాలని సూచించారు. 9 నెలల పాటు అన్ని అంశాలపై శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ప్రతి అంశంలోనూ నిష్ణాతులుగా తయారు కావాలన్నారు. ఈ శిక్షణను తాను నిత్యం పర్యవేక్షిస్తుంటానని తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన కర్నూలుకు చెందిన 118 మంది, చిత్తూరుకు చెందిన 77 మంది అభ్యర్థులు ఉత్తమ పోలీసులుగా బయటకు రావాలని సూచించారు. ఈ అభ్యర్థుల్లో ఏడుగురు పోస్టు గ్రాడ్యుయేషన్, 26 మంది గ్రాడ్యుయేషన్, ముగ్గురు ఎంటెక్, 11 మంది బీటెక్, ఒక ఎంబీఏ, ఒక ఎంసీఏలు పూర్తి చేసిన వారు కూడా పోలీసుశాఖకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు అక్కడ నిర్మాణంలో ఉన్న భవనాలను, స్విమ్మింగ్ ఫూల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, ప్రిన్సిపల్ శరత్‌బాబు, వైస్‌ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసాచారి, ఆర్‌ఐ లక్షణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ ఫూల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్

బస్ షెల్టర్ నిరుపయోగం..



అయ్య బాబోయ్ పుట్ట : ముత్తుకూరు మండలం పీవీ కండ్రిగలో..



ముత్తుకూరు : చెత్తా చెదారంతో కుమ్మరమిట్ట బస్‌షెల్టర్



ఫెర్టిలైజర్స్ గోదాముగా కొండాపురం ఆర్టీసీ బస్‌షెల్టర్



వెంకటగిరి : ఇక్కడ బస్‌షెల్టర్ ఉందా!?



వాకాడు : బస్‌షెల్టరులో టీ దుకాణమా!?



ఓజిలి : నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

ఎండా వాన నుంచి ప్రయాణికులకు రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల ఆక్రమణకు గురవగా, ఇంకొన్ని చోట్ల చెత్తాచెదారంతో నిండి పోయి ఉన్నాయి. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా ఆక్రమణకు గురైన బస్ షెల్టర్ల దృశ్య మాలిక ఇది....

- ఆంధ్రజ్యోతి బృందం



బండలాగుడు పోటీల్లో ఎద్దులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

వరికుంటపాడు: మండలంలోని జడదేవి గ్రామంలో గంగమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా గురువారం ఉత్సాహంగా ఎద్దులు బండలాగుడు పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ఎద్దులు పాల్గొన్నాయి. కడప జిల్లా బద్వేల్ మండలం గుంతుపల్లి గ్రామానికి చెందిన మోదేపల్లి వెంకటసుబ్బయ్య, కడప జిల్లా చాపాడు మండలం పెద్దసీపాడు గ్రామానికి చెందిన టి.వెంకటేశ్వర్లు, ప్రకాశ ం జిల్లా దొనకొండ మండలం పోలేపల్లికి చెందిన బి.అనూషాకు చెందిన ఎద్దులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. విజేత యజమానులకు రూ.30లు, రూ.20లు, రూ.10లు వేల చొప్పున బహుమతి అందచేశారు. పోటీలను తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

వింతదూడ జననం



చేజర్ల: మండలంలోని నాగలవెల్లటూరు గ్రామంలో పాడి రైతు ముప్పసాని బాబు గేదె గురువారం వింత దూడను ఈనింది. పుట్టిన దూడకు రెండు తలలు, రెండు నాలుకలతో పాటు మూడు నోర్లు ఉన్నాయి. వింతదూడను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు అధికంగా తరలి వచ్చారు. ప్రస్తుతం దూడ ఆరోగ్యం నిలకడగా ఉందని, జన్యులోపాల కారణంగా ఇలాంటి పరిమాణాలు జరుగుతుంటాయని పశువైద్యాధికారులు పేర్కొన్నారు.

పలకరించిన వర్షం



గూడూరులో కురుస్తున్న వర్షం

వర్షం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఊరట కలిగిస్తూ గురువారం రాత్రి వర్షం పలకరించి వెళ్లింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతోపాటు ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయిన తరుణంలో రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఆకాశం మేఘావృతమై కొద్దిసేపు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం చెందారు. గూడూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వర్షం కురవడంతో నిమ్మ, బత్తాయి, మామిడి తోటల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా నాయుడుపేట, జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది.

- గూడూరు(టౌన్)

నేడు వైసీపీ ర్యాలీ

ఆత్మకూరు: ఫీజురీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం వైసీపీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జి వశీం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ర్యాలీ అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటామని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందక అవస్థలు పడుతున్న విద్యార్థుల స్థితిగతుల గురించి తెలుపుతూ వినతిపత్రం ఆర్డీవోకు వినతిప్రతం అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు.

అన్నసంజీవనిపై అనాసక్తి..!

● మొక్కుబడిగా జనరిక్ దుకాణాలు ● వినియోగంపై వీడని అపోహలు



ఆత్మకూరులో జనరిక్ మందుల దుకాణం

ఆత్మకూరు: పేదలకు అతిచౌకగా మందులను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నసంజీవిని పథకం (జనరిక్‌దుకాణాలు) ఆచరణలో విఫలమవుతోంది. ప్రైవేట్ ఔషధదుకాణాల్లో మందుల విక్రయాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. నేరుగా కంపెనీల నుంచి జనరిక్‌మందులు తెప్పించి డీఆర్‌డీఏ, సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో దుకాణాలు ఏర్పాటు చేసింది. మెప్మా ఆధ్వర్యంలోనూ పట్టణ ప్రాంతాల్లో కొన్ని దుకాణాలు నిర్వహిస్తోంది. అవి ఆశించిన మేర ప్రజలకు ఉపయోగపడడం లేదనే విమర్శలు ఉన్నాయి. అన్ని మండలాల్లోను జనరిక్ దుకాణాలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేర వైద్యఆరోగ్య శాఖ డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ఏడాది 50 జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా... ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. గతంలో ఉన్న 15దుకాణాలు మాత్రమే కొనసాగుతున్నాయి

అతితక్కువ ధరలకే...

జనరిక్ మందులషాపుల్లో బీపీ, సుగర్, గ్యాస్ట్రబుల్, ఆయాసం, జ్వరం, నొప్పులు, విటమిన్‌మాత్రలు, యాంటీబయోటిక్‌మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. సుమారు 200 పైబడి మందులు తక్కువ ధరలకే లభిస్తాయి. సాధారణంగా మెడికల్ దుకాణాల్లో వాటికి అధిక ధర చెల్లించాల్సి ఉంటుంది. జనరిక్‌దుకాణంలో 10 పారాసిట్మల్ మాత్రలు కేవలం రూ.5కే లభ్యమవుతాయి. అదే ప్రైవేట్ షాపుల్లో రూ.20 చెల్లించాల్సిందే.

వినియోగంపై అపోహలు

జనరిక్‌మందుల దుకాణంలో అతి చౌకగా మాత్రలు లభిస్తుండడంతో అవి నాశిరకమేమోనన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. వాటిని తొలగించాల్సిన వైద్యులు సైతం బ్రాండెండ్ మందులను సిఫారస్సు చేస్తున్నారు. అవగాహన కల్పించాల్సిన దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

వైద్యుల ప్రోత్సాహం కరువు

ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో పని చేసే వైద్యులు తప్పనిసరిగా జనరిక్ మందులు రాయాలని భారతీయ వైద్యమండలి ఆదేశాలు ఉన్నాయి. అమలు చేసే వారు తక్కువగా ఉన్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఖరీదైన బహుమతులను ఎర చూపడంతో డాక్టర్లు వాటినే సిఫారస్సు చేస్తున్నారు. రోగుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జనరిక్‌మందులను సిఫారస్సు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విస్తరించని జనరిక్ దుకాణాలు...

జిల్లాలో జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటులో జాప్యానికి ప్రధాన కారణం అనుమతులే. దుకాణం ఏర్పాటు చేయాలంటే ఫార్మాసిస్టును నియమించాలి. డ్రగ్ ఇన్‌స్పెకర్టర్ ద్వారా అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వపరంగా అనువైన స్థలం చూపించాలి. ఎస్‌హెచ్‌జీ గ్రూపులు నిర్వహణకు ముందుకు రావాలి. వీటి ఎంపికలో జరుగుతున్న జాప్యం వల్లే గతేడాది ఉత్తర్వులు ఇచ్చినా... ఇప్పటి వరకూ మండలాల్లో దుకాణాలు ఏర్పాటు కాకపోవడానికి కారణంగా తెలుస్తుంది.

కొరవడిన ప్రచారం...

జిల్లాలో ప్రస్తుతం ఉన్న జనరిక్ దుకాణాలకు సైతం సరైన ప్రచారం లేక ఆదరణ కొరవడింది. ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన జనరిక్‌దుకాణమే ప్రత్యక్ష నిదర్శనం. స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరిక్ దుకాణానికి పురిటినొప్పులు తప్పడం లేదు. మొదట ప్రారంభమైనా కొన్ని అనివార్యకారణాల వల్ల ఏడాది పైబడి మూతపడింది. ఎట్టకేలకు మెప్మా అధికారులు పొదుపుగ్రూపుసభ్యులకు జనరిక్ దుకాణాల నిర్వహణ బాధ్యతను అప్పగించి తిరిగి ఆరు నెలల క్రితం పునఃప్రా రంభించారు. ఇక్కడ జనరిక్‌దుకాణం ఏర్పాటు చేశారుగానీ ప్రచారం లేకపోవడం, నిర్వహణ మొక్కుబడిగా ఉండడంతో ఆశించిన మేర ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ మెడిక ల్‌షాపుల్లోనే విక్రయించే మందులను కొనుగోలు చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణం లోని 100 పడకల వైద్యశాల ప్రాంగణంలో జనరిక్ మందుషాపు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నా అధికారులు ఆ దిశగా దృష్టిసారించి మిన్నకుండిపోయారు.

విరివిగా దుకాణాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ మందులదుకాణాలను విరివిగా ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తాయి. గతంలో ఈ మందులపై ప్రజలకు అవగాహన లేక కొనుగోలుకు వెనుకంజ వేసేవారు. ప్రస్తుతం కొంతమేర జనరిక్ దుకా ణాలపై అవగాహన కలిగింది. ఆత్మకూరు పట్టణంలో రెండు, మూడు జనరిక్‌దుకాణాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తం.

-రవి కుమార్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు, ఆత్మకూరు

దుకాణదారుల దోపిడీని అరికట్టాలి



కొన్ని ప్రైవేట్ మందుల దుకాణాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టే దిశగా జనరిక్‌మందులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి. జనరిక్‌మందులు తక్కువ ధరలకు లభిస్తాయనే విషయం చాలామంది ప్రజలకు తెలియదు. విద్యావంతులకు కూడా సరైన అవగాహన లేదు. ప్రైవేట్ దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేస్తున్నారు.

-ప్రభాకర్‌నాయుడు, సాగునీటిసంఘం అధ్యక్షుడు, అప్పారావుపాళెం

దుకాణాల ఏర్పాటుకు రాయితీలు



ఇటీవల ప్రభుత్వం జనఔషధి పేరుతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకోడానికి కొన్ని రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయడానికి వీలు కల్పించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు ముందుకు వచ్చిన వారికి రూ.2.50 లక్షల నిధులు ఇస్తారు. త్వరలో ఆత్మకూరు పట్టణంలోని 100 పడకల వైద్యశాలలో సైతం జనరిక్ మందులదుకాణం ఏర్పాటుపై దృష్టిసారిస్తాం.

-వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

● ఇంటర్వ్యూ



పని చేయని బయోమెట్రిక్

సత్యనారాయణ, ఎంఈవో

? : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలను వినియోగిస్తున్నారా?

! : పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు అంతంతమాత్రంగా పని చేస్తున్నాయి. వాటికి సంబంధించి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయకలేదు. ఎలా వినియోగించుకోవాలో తెలియడం లేదు. దాంతోబయోమెట్రిక్ మిషన్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని మిషన్లు పని చేస్తున్నా మరమ్మతులకు గురవుతుండడంతో నెల్లూరుకు తరలిస్తున్నాం.

? : మధ్యాహ్న భోజన పథకం పనితీరు ఎలా ఉంది?

! : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం సక్రమంగా అమలవుతోంది. ఆగస్టు ఒకటి నుంచి ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేస్తున్నందున వారానికి మూడు రోజుల పాటు విద్యార్థులకు అందచేస్తున్నాం.

? : శిథిలావస్థలో ఉన్న పాఠశాలల పరిస్థితి ఏమిటీ?

! : మండలంలోని పల్లెపాడు, పాతఅల్లంపాడు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. అదనపు భవన నిర్మాణాలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నూతన భవనాలు నిర్మిస్తాం.


- మర్రిపాడు

20న మాజీ మంత్రి ఆనం రాక

ఆత్మకూరు: మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 20వ తేదీన ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో నిర్వహించే తెలుగుదేశంపార్టీ సమన్వయ సమావేశాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 20 ఉదయం 10 గంటలకు అనంతసాగరంలోని వికాస్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జరిగే టీడీపీ సమన్వయకమిటీ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బి.అగ్రహారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మర్రిపాడు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ వద్ద నిర్వహించే సమన్వయసమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

శిథిలావస్థకు హాస్టళ్లు

అనంతసాగరం: మండలంలోని రేవూరులో ఉన్న బీసీ బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాలుశిథిలావస్థకు చేరాయి. గదులతోపాట శ్లాబు దెబ్బతింది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. శ్లాబ్‌పెచ్చులు ఊడిపడుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అడపా దడపా పడుతున్న చిన్నపాటి వర్షాలకే నీటి చెమ్మ ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. శిథిలపు గదులతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందని వారి తల్లిదండ్రులూ భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు ఈ పరిస్థితుల్లో ఇక్కడుంటే తాము ఎలా ఇళ్లలో ఉండగలమని వాపోయారు. తాము హాస్టళ్ల స్థితిగతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వసతిగృహాల హెచ్‌డబ్ల్యువోలు తెలిపారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు బాగా పడితే ఆయా హాస్టళ్లలో విద్యార్థులు చదువులు సాగించడం కష్టం. ఎలాంటిప్రమాదం జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.


బాలుర వసతిగృహంలో ఓ గదికి పెచ్చులూడటంతో కనిపిస్తున్న కమ్ములు

ఇసుక కోసం ఇక్కట్లు

అనంతసాగరం: మండలంలో కోటితీర్థం నుంచి మాముడూరు వరకూ పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక తీసుకునేందుకు వీలున్నా ఇక్కట్లు తప్పడం లేదు. వాస్తవానికి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే మాముడూరు గ్రామంలో ప్రభుత్వ అనుమతులతో ఇసుక రీచ్ ఏర్పాటు చేశారు. ఈ రీచ్‌కు ఎటువంటి రహదారీ లేకపోవడంతో ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జి మీద నుంచి ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుంటున్నారు. అక్కడ ఉండే కూలీలు వంతులంటూ సుమారు రెండు నుంచి ఐదు గంటల వరకు ట్రాక్టర్లు నిలిపేస్తున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. ఒకానొక పరిస్థతుల్లో కేవలం ఇద్దరు మాత్రమే లోడింగ్ చేస్తున్నారని, ఎక్కువ మంది కావాలని అడిగితే సరిగా సమాధానం చెప్పడం లేదంటూ ట్రాక్టర్ల డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

22, 23 తేదీల్లో వెంకయ్యస్వామి ఆరాధన

చేజర్ల: చేజర్ల మండలం నాగల వెల్లటూరు గ్రామంలో శ్రీవెంక య్యస్వామి 18వ ఆరాధన మహోత్సవాలు ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోంపల్లి రమణ య్యస్వామి తెలిపారు. 22న ప్రత్యేక పూజలు, 23న డాక్టర్ టి.రమ ణయ్య-సుజాతమ్మ దంప తుల ఆధ్వర్యంలో సుప్రభాతం, అభి షేకాలు జరుగుతాయని తెలిపారు. భక్తులకు అన్న దాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలి పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పెగళ్లపాడులో ఉచిత వైద్యశిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

మర్రిపాడు: మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో గురువారం ఎన్టీఆర్ వైద్యసేవ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. నెల్లూరుకు చెందిన జయభారతి, నారాయణ హాస్పిటల్స్ వైద్యనిపుణులు సేవలు అందించారు. గ్రామానికి చెందిన 394 మంది రోగులను పరీక్షించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ కావలి డివిజన్ సిబ్బంది దశరథ, బాషా పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంకు సన్మానం



వెలుగు ఏపీఎం రవిశంకర్‌ను సన్మానిస్తున్న ఎంఆర్ మహమ్మద్‌రఫీ

ఏఎస్‌పేట: స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు మహమ్మద్‌రఫీ వెలుగు ఏపీఎం రవిశంకర్‌రెడ్డిని గురువారం ఘనంగా సన్మానించారు. 2016-17 సంవత్సరానికి సంగం మండలంలో సేవలు అందించిన రవిశంకర్‌కు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్‌రఫీ ఆయనకు శాలువాలు, కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. సంగం మండలంలో మాదిరిగానే ఏఎస్‌పేట మండలంలోనూ ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు సీసీలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు టై, బెల్టు అందచేస్తున్న పూర్వవిద్యార్థి మురళీ, సర్పంచు వెంగమ్మ

ఏఎస్‌పేట: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని దూబగుంట ప్రాథమిక పాఠశాల పూర్వవిద్యార్థి మురళీ తెలిపారు. గురువారం ఆయన దూబగుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టైలు, బెల్టులు, ఐడికార్డులు అందజేశారు. పాఠశాలకు ప్రథమచికిత్స కిట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలోనే చదువుకున్నతాను ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డానని తెలిపారు. చిన్నతనంలో ఉపాధ్యాయులు నేర్పించిన క్రమశిక్షణతోనే ఈ స్థాయికి వచ్చానన్నారు. ఏ స్థాయిలో ఉన్నా సొంతూరును మరచిపోకూడదన్నారు. అనంతరం పలువురు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరం వెంగమ్మ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మార్గదర్శిగా గ్రంథాలయం

- ఎఎస్‌పేటలో నిరుద్యోగుల కరదీపిక
- అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

వేల రూపాలయలు పెట్టి పరీక్షల మెటీరియల్ కొనలేక అవస్థలు పడుతున్న పేద విద్యార్థులకు గ్రంథాలయంలోని పుస్తకాలు వరంగా మారాయి. స్థోమతలేని ఎందరో నిరుద్యోగులు గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి పలు పోటీ పరీక్షల్లో రాణిస్తూ ఉపాధి పొందుతున్నారు. గ్రంథాలయంలో పుస్తక హుండీ ఏర్పాటు చేయడం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పత్రికలు, పుస్తకాలను చదువుతున్న నిరుద్యోగులు

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలోని గ్రంథాలయం ఎంతో మందికి ఉపయోగపడుతోంది. 1200లకు పైగా విజ్ఞాన , వినోద, సైన్సు, గణిత, చరిత్ర, మ్యాజిక్స్



అందుబాటులో ఉన్న పుస్తకాలు

ఉన్నాయి. వాటితోపాటు వీఆర్వో, కానిస్టేబుల్, గ్రూప్స్ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉంది. సుమారు 40దిన, వార, సప్త, మాస పత్రికలు లభిస్తాయి. నాలుగో తరగతి విద్యార్థుల నుండి నిరుద్యోగ యువత వరకు సుమారు 170మందికి పైగా సభ్యత్వం ఉంది. వారంతా గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకుంటున్నారు.

అందుబాటులో మెటీరియల్

గ్రామీణ నిరుపేద విద్యార్థులు పలు పోటీపరీక్షలకు మెటీరియల్ కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. వారంతా ఈ విషయాన్ని గ్రంథాలయాధికారి నారాయణరావు దృష్టికి తీసుకెళ్లారు. గ్రంథాలయంలో పలు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచితే ఎందరో పేద నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటు ందని తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి తెసుకెళ్లి పలు పోటీ పరీక్షల మెటీరియల్‌ను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. ఇక్కడ చదివిన ఇద్దరు నిరుద్యోగులు కానిస్టేబుల్ రాత పరీక్షలో అర్హత సాధించారు. సుమారు పదిమంది గ్రూప్స్ ఎంట్రన్స్‌కు అర్హత సాధించి, మెయిన్‌కు సద్ధమవుతున్నారు. ఇలా పేద విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు ఎన్నోవిధాలుగా ఉపయోగపడుతున్నాయి.

పుస్తక సేకరణ కోసం హుండీ...

గ్రంథాలయ సంస్థ నుంచి వచ్చే పుస్తకాలే కాక బయట దాతల ద్వారా పుస్తకాలు సేకరిస్తే పాఠకులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పుస్తక సేకరణ కోసం వినూత్నంగా హుండీని గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. ఆలయాల్లో హుండీలో కానుకలు వేసినట్లుగా ఈ హుండీలో పుస్తకాలు వేయవచ్చు. చదువుకున్న వారు తమ వద్ద నిరూపయోగంగా ఉన్న పుస్తకాలు అక్కడ వేయొచ్చు. వివాహ, పుట్టిన రోజు తదితర ప్రత్యేక సమయాల్లో పుస్తకాలను కానుకగా హుండీలో వేయడం ద్వారా పది మందికి విద్యనందించవచ్చు.

శిథిలావస్థలో గ్రంథాలయం

ఇలా ఎందరికో ఉపయోగపడే గ్రంథాలయం శిథిలమైన భవనంలో ఉండటం బాధకర విషయం. వర్షం కురిస్తే విలువైన పుస్తకాలు తడిసి పాడైపోయే అవకాశం ఉంది. వాటిని భద్రపరుచుకోవడం గ్రంథాలయాధికారికి తలకు మించిన భారం గా మారింది. గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయించి తగిన సౌకర్యాలు కల్పిస్తే పాఠకులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని పాఠకులు కోరుతున్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాం



వేల రూపాలయలు ఖర్చు చేసి పోటీపరీక్షల మెటీరియల్ కొనలేని నిరుద్యోగులకు గ్రంథాలయంలోని పోటీపరీక్షల పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దీంతో పేద విద్యార్థులు పలు పోటీపరీక్షలు రాయటం కోసం సిద్ధమవుతున్నారు.

-రసూల్, గ్రంథాలయ సభ్యుడు

ఫలితాల కోసం ఎదురుచూస్తున్నా



వేల రూపాయల ఫీజులు కట్టి కోచింగ్ తీసుకుని పోటీపరీక్షలు రాసే స్థోమత లేక చాలా మంది గ్రామీణ నిరుపేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాకు కోచింగ్ తీసుకునే స్థోమత లేక గ్రంథాలయ పుస్తకాలు చదివి గ్రూప్-2 పరీక్ష రాశాను. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాను. నాలాంటి వారికి చాలామందికి ఈ పుస్తకాలు ఉపయోగపడుతున్నాయి.

-సురేష్, గ్రంథాలయ సభ్యుడు, ఏఎస్‌పేట

జిల్లా అధికారుల సహకారంతోనే...



గ్రంథాలయ సభ్యుల కోరిక మేరకు వారికి అవసరమైన పుస్తకాలను జిల్లా ఉన్నతాధికారుల ద్వారా తెప్పించాం. నిరుద్యోగ యువత కోసం వేల రూపాయల విలువ చేసే పలు పోటీపరీక్షల పుస్తకాలను తీసుకొచ్చాను. జిల్లా అధికారుల సహకారంతోనే ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచగలుగుతున్నా.

- నారాయణరావు, గ్రంథాలయాధికారి, ఏఎస్‌పేట

పందులతో అవస్థలు

- దూరానికి తరలించాలని జనం వేడుకోలు

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలో పందుల మందలు పెరిగాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో విచ్చలవిడిగా పందుల సంచారం ఉండడంతో స్థానికులతో పాటు దర్గా యాత్రికులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇటీవల వాటి సంఖ్య మరీ ఎక్కువైంది. ఆదమరిస్తే ఇళ్లలోకి దూరుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందచేసినా తగిన చర్యలు చేపట్టడం లేదని, పవిత్రమైన పుణ్యక్షేత్ర స్థలంలో పందుల సంచారం బాధాకరమన్నారు.

పందులతో అనారోగ్యం

విచ్చలవిడిగా పందులు సంచరిస్తుండడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారవుతోంది. దీంతో దోమలు, క్రిమికీటకాలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దేశమంతా స్వచ్ఛభారత్ పేరుతో పరిశుభ్రత వైపు దూసుకెళుతుంటే ఏఎస్‌పేటలో మాత్రం ఆ జాడే



ఏఎస్‌పేటలో పందుల గుంపు

కనిపించడం లేదు. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాలు ప్రారంభమైనప్పుడు అతిసార, విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం నుంచి పందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనంతసాగరంలో ఓ మోస్తరు వర్షం

- వేరుశనగ పంటకు ఊరట

అనంతసాగరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో సాగులో ఉన్న వేరుశనగ పంటకు ఊరట కలిగింది. కమ్మవారిపల్లి, పడమటికంభంపాడు, సోమశిల, పాతాళపల్లి, చిలకలమర్రి, గోవిందమ్మపల్లి, ముస్తాపురం, తదితర గ్రామాల్లో ప్రస్తుతం వేరుశనగ పంట సాగులో ఉంది. బోర్లకు సక్రమంగా నీరు రాకపోవడంతో పంట ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో వరుణుడు కరుణించి ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. గతేడాది కూడా వర్షాలు లేకపోవడంతో పంటలు వేసుకోలేదని తెలిపారు. ఈ ఏడాదీ ఎదురు చూపు నేపథ్యంలో వర్షం రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

వృత్తి విద్యతో ఉపాధి

గూడూరు(టౌన్): వృత్తి విద్యలో ప్రావీణ్యం పొందడం ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు పొందవచ్చునని పాలిటెక్నిక్ కళాశాల మైనింగ్ హెచ్‌వోడీ కల్యాణ్ అన్నారు. గురువారం స్థానిక సునీతాసేవా సంస్థ కార్యాలయంలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లపై ఉచిత శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని సొంతంగా తమ కాళ్లపై తాము నిలదొక్కుకోవడంతోపాటు కొద్దిపాటి మొత్తాల పెట్టుబడితో వ్యాపారరంగంలో స్థిరపడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బీ దుర్గాశ్రీలక్ష్మి, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి పాల్గొన్నారు.

అమ్మకాలకు బొజ్జ గణపయ్య ప్రతిమలు

● ఆకర్షణీయంగా గణనాథులు

గూడూరు: ఒకప్పుడు గూడూరు అంటే జెండా ఉత్సవాలకు ప్రసిద్ధిగా ఉండేది. అయితే ఇప్పుడు వినాయక ఉత్సవాలకు గూడూరు పేరు పొందుతోంది. దసరా మొదటి రోజున అంజనేయ స్వామి జెండాను ఊరేగించి కూడలి వద్ద ప్రతిష్ఠించడం అనవాయితీ. అటువంటిది క్రమంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలలోనూ గూడూరు ప్రత్యేకతను సంతరించుకుంటోంది. దాదాపు అన్ని కూడళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వినాయక ప్రతిమలు నెలకొల్పేందుకు చందాలు వేసుకోవడం, విగ్రహాలను వినూత్న తరహాలో చేయించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 25న వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన వీధుల్లో వినాయక విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. ఈ వినాయక చవితికి ప్రత్యేకంగా భారీ విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు నెల్లూరు పట్టణంలో తయారు చేసిన విగ్రహాలను గూడూరుకు తరలించి విక్రయించేవారు. అయితే ఏడేళ్లగా స్థానికులతో పాటు రాజస్థాన్, పూణె, పాండిచ్చేరిల నుంచి ప్రత్యేకంగా విగ్రహ తయారీదారులు రావడం, ఇక్కడే ప్రతిమలకు మెరుగులు దిద్దుతున్నారు. విగ్రహాల తయారీలో నేర్పరితనం వలన ఆకర్షణీయంగా ఉన్నాయి. రెండో పట్టణంలోని వాళ
వ్యనగర్, కోర్టు సెంటర్, ఇందిరానగర్ ప్రాంతాలలో విగ్రహాల తయారు చేస్తున్నారు. తయారు చేసిన విగ్రహాలను ప్రధాన కూడళ్లలో నిలిపి ఉత్సవ కమిటీలను ఆకర్షిస్తున్నారు. వినూత్నంగా వివిధ అకృతులలో ఉండే ప్రతిమలు అధిక ధరలు పలుకుతున్నాయి. డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముందుగానే వారికి నచ్చిన విగ్రహాలను గుర్తించి అమ్మకందారులకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఖైరతాబాద్ గణేశుడి రూపంలో నిలువెత్తు విగ్రహానికి అధికులు అసక్తి చూపుతున్నారు. అంజనేయస్వామి సంజీవి పర్వతాన్ని తీసుకొస్తున్నట్లుగా ఉండే వినాయక ప్రతిమలు అమ్మకాలకు సిద్ధం చేశారు. అదేవిధంగా నంది, హంస, సర్ప, సింహ, చిలక, చెట్టు వాహనాలపై ఉన్న వినాయక విగ్రహాలు అ మ్మకాలకు సిద్ధం చేశా రు. ఈ పర్యాయం ప్రధానంగా భారీ శివగణపతి, బొజ్జ గణపయ్య విగ్రహాలు ఆకర్షణగా నిలిచాయి. గూడూరు ప్రాంతం నుంచి సమీప గ్రామాలతో పాటు తిరుపతి, రేణిగుంట, వెంకటగిరి తదితర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమయ్యారు.



ప్రత్యేక ఆకర్షణగా వినాయక ప్రతిమలు



అమ్మకానికి సిద్ధమైన గణనాథులు

● పెరిగిన ధరలు..

ఐదు అడుగుల నుంచి 15 అడుగుల విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా వున్నాయి. వీటి ధర 3 వేల నుంచి 50 వేల రూపాయల వరకు ఉన్నాయి. ప్రధానంగా విగ్రహాల తయారీకి వినియోగించే ముడి సరుకు ధరలు రెట్టింపు కావడంతో విగ్రహాల ధరలు పెరిగినట్లు వ్యక్తమవుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పొడి ధరతోపాటు రంగుల ధరలు, కూలీల రేట్లు పెరగడంతో విగ్రహాల ధరలు పెంచాల్సి వస్తుందని తయారీదారులు అంటున్నారు. కూలీలు చెల్లించి తయారీ చేయించిన విగ్రహాలు అమ్ముడుపోకపోతే వాటి భారం తయారీదారులపై పడుతోందని ఆవేదన చెందుతున్నారు.



పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య

బాటను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

● డీసీసీ అధ్యక్షుడు పనబాక

గూడూరు: మండలంలోని పోటుపాళెం-పురిటిపాళెం గ్రామాల మధ్య ఉన్న బండ్ల బాటను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని పోటుపాళెం-పురిటిపాళెం మార్గాలలో తవ్విన బండ్ల బాటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న నెపంతో వందలాది మంది వినియోగించుకునే బండ్ల బాటను ఆరు అడుగుల మేర కొందరు గోతులు తీయడం సమంజసం కాదన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటే ఇసుక నిల్వలు ఉన్న రీచ్‌లు, ఏరుల వద్ద నిఘా ఉంచి ఇసుకను అక్రమంగా తరలించేవారిని పట్టుకోవాలన్నారు. అంతేగానీ ప్రజలకు ఉపయోగకరంగా ఉండి నిత్యం వినియోగించే దారిని తవ్వివేయడం సరికాదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ, ఆర్డీవో అరుణ్‌బాబు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గుంతలు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, దువ్వూరు రవీంద్రరెడ్డి, కల్లూరు రవి, బెంగుళూరు కార్తిక్, పోటుపాళెం గ్రామస్థులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి

గూడూరు: కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని పాలక మండలి సభ్యులు అన్నారు. గురువారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతన పాలక వర్గం, ఆర్యవైశ్య అభ్యుదయ మండలి సభ్యులతో రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ పాలక వర్గ అధ్యక్షుడిగా గాదంశెట్టి గిరిబాబు, ఉపాధ్యక్షులుగా పైడిమర్రి రాజేంద్రప్రసాద్, ముంజలూరు గాంధీప్రసాద్, జిల్లా చంద్రశేఖర్, కార్యదర్శిగా వాకాటి రామ్మోహన్‌రావు, ఉప కార్యదర్శిగా సోమిశెట్టి సాయికృష్ణ, గుర్రం వెంకట శ్రీధర్, కోశాధికారిగా గొంట్ల వంశీకృష్ణలతోపాటు గౌరవాధ్యక్షులు, శాశ్వత గౌరవాధ్యక్షులు, ఉపకోశాధికారులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా ఆర్యవైశ్య అభ్యుదయ మండలి అధ్యక్షుడిగా పాదర్తి వెంకటరమణ వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా మొగళ్లూరు సురేంద్ర, బోగనాధుల శోభన్‌బాబు, శేగు శ్రీనివాసులు, కార్యదర్శిగా నాగసూరి సునీల్, ఉప కార్యదర్శులుగా కాపుగంటి జయప్రకాష్, దాసా మల్లికార్జున్, గాదంశెట్టి సుబ్బారావు, కోశాధికారిగా పాదర్తి నరేష్‌తోపాటు గౌరవాధ్యక్షులు, ఉపకోశాధికారులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ అభివృద్ధికి అందరి సహకారంతో చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

‘పైసా వసూల్’ విజయం సాధించాలి

గూడూరు(టౌన్): నందమూరి బాలకృష్ణ నటించిన పైసా వసూల్ సినిమా ఘన విజయం సాధించాలని అకాంక్షిస్తున్నామని ఐదో వార్డు కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్ అన్నారు. బాలకృష్ణ నటించిన పైసా వసూల్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా గురువారం స్థానిక రాజావీధిలోని ఎన్టీఆర్ అభిమాన సంఘ కార్యాలయంలో కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి అభిమానులు ప్రతి ఏడాది నందమూరి వారసుల పుట్టిన రోజులకు సేవా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు ఆడియో రిలీజ్ సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కట్టామురళీకృష్ణ, మారుబోయిన చిరంజీవిగౌడ్, మల్లికార్జునరావు, మోహన్‌రెడ్డి, నారాయణగౌడ్, డిష్‌బాబు, రమణయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందమూరి అభిమాన సంఘం నాయకులు

రామాలయంలో ఎమ్మెల్యే పాశం ప్రత్యేక పూజలు

గూడూరు: స్థానిక వివేకానంద రోడ్డులోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పునఃనిర్మించిన రామాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దైవ చింతన పెరగాలన్నారు. ఆధ్యాత్మికత ద్వారా ప్రశాంతంగా జీవించవచ్చునన్నారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ క్రమంలో ఈ ఆలయానికి తన వంతుగా ఆర్థిక సాయం అందించామన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

పాఠశాలకు స్థల పరిశీలన

చిల్లకూరు: నక్కలవారికండ్రిగ వద్ద పాఠశాల నిర్మాణానికి సంబంధించి అకడమిక్ మానిటరింగ్ అధికారి హమీద్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టీ శ్రీనివాసులనాయుడు సొంత నిధులతో పాఠశాల భవనం నిర్మించేందుకు ముందుకు రావడంతో స్థలం చూశామన్నారు.

పిల్లలకు ఎమ్మార్ టీకా తప్పనిసరిగా వేయించాలి

గూడూరు(టౌన్): పిల్లలకు తప్పనిసరిగా ఎమ్మార్ టీకాలు వేయించాలని వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాబురావు అన్నారు. గురువారం స్థానిక సరస్వతి శిశు మందిరంలో చదివే విద్యార్థులకు వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మార్ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల మురళీనాయుడు, చదలవాడ శ్రీనివాసులు, ఆర్‌వీ రావు, సరళ, కుమారి, ప్రణీత భారతి, అనిత, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్‌ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

'ఎన్‌బీకేఆర్'లో ఈసీఈ విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న విశ్వనాథ్ ఎస్‌కొద్దీ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఈసీఈ విద్యార్థులకు ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా నెట్ కార్పొరేట్ ట్రైనర్ విశ్వనాథ్ ఎస్‌కొద్దీ పాల్గొని మాట్లాడుతూ ఆప్టికల్ ఫైబర్‌ను అనుసంధానం చేయడం, అతికించడం ఫైబర్‌లోని లోపాలను గుర్తించడం, వాటిని నివారించడం తదితర వాటిని ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులను కూడా ఇందులో భాగస్వామ్యులను చేసి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మోహనయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నుడి విగ్రహ ప్రతిష్ఠ

వాకాడు: మండలంలోని కొండూరుపాళెంలో గురువారం పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత సన్నారెడ్డి చంద్రభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వరపూజతో మొదలైన పూజా కార్యక్రమం నిత్య పూజ, నవగ్రహ మండపారాధన, పంచగవ్యాధివాసం, నవగ్రహ, షడ్రుచీ, దిశా, శాంతిహోమాలతో ముగిసింది. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి వారికి పాలు, పెరుగు, నెయ్యి, పండ్లు, తేనె, పంచ నదుల తీర్థలతో విశిష్ఠ అభిషేకాలు నిర్వహించారు. కంకణాలు కట్టుకున్న దంపతులందరూ యాగశాలలో హోమ యాగాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థుల బంధువులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా సీజీసీ సభ్యులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి, వైసీపీ గూడూరు సమన్వయ కర్త మేరిగ మురళీధర్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహం



వాకాడు: హోమం చేస్తున్న నిర్వాహకులు



చిల్లకూరు:హోమపూజలు చేస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు: మండలంలోని కలువకొండ తిప్పపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతం, విశ్వేశ్వరాధనం, పుణ్యాహవాచనం, బేరిపూజ, దేవతాహ్వానం, ద్వారతురకా పూజ, నిత్యహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలుగా పొన్నలూరు రామచంద్రారెడ్డి, కవిత, యరటపల్లి శరత్‌కుమార్‌రెడ్డి, సాయి పృథ్వీరెడ్డిలు వ్యవహరించారు.

కార్మికుల సంక్షేమానికి ఎన్‌ఎంయూ కృషి

గూడూరు: కార్మికుల సంక్షేమానికి పాటుపడేది ఎన్‌ఎంయూ అని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, టీడీపీ నేత పొనకా శివకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్‌ఎంయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంయూ 50 ఏళ్లుగా కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసిందన్నారు. అనంతరం కేకు కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మనపాటి రవీంద్రబాబు, యూనియన్ నాయకులు లుక్సన్, రమణరాజు, పీఎస్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వెంకన్నపాళెంలో పారిశుధ్య పనులు

కోట: మండలంలోని వెంకన్నపాళెంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ విస్తరాధికారి కల్పన, కార్యదర్శి రిజాఉద్దీన్ అహ్మద్, సర్పంచు పసబాక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో వీధుల్లోని చెత్తకుప్పలు, పేడదిబ్బలు, డ్రైనేజీ కాలువల్లో మురుగు తొలగించారు.

20న ఆటో డ్రైవర్లకు ప్రత్యేక ఎల్‌ఎల్‌ఆర్ మేళా



మాట్లాడుతున్న ఆర్టీవో చందర్

గూడూరు (రూరల్): నాన్ ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు ఈ నెల 20వ తేదీన ప్రత్యేక ఎల్‌ఎల్ ఆర్ మేళా నిర్వహించి బ్యాడ్జీలు అందజేస్తామని ఆర్టీవో చందర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు బ్యాడ్జీ తప్పనిసరన్నారు. ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జకీర్, ఏవో మదాని పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.5.23 లక్షల రాబడి

స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో గురువారం ఆర్టీవో చందర్ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన వాహనాల బహిరంగ వేలం పాటల్లో 28 వాహనాలకు వేలంపాటల ద్వారా రూ.5.23 లక్షల రాబడి వచ్చిందని ఏవో మదాని తెలిపారు.

కొక్కుపాడులో పలువురు వైసీపీలో చేరిక



వైసీపీ కండువాలతో ఆహ్వానిస్తున్న మేరిగ మురళి

కోట: మండలంలోని కొక్కుపాడుకు చెందిన టీడీపీ నాయకుడు యరటపల్లి రమేష్‌రెడ్డితో పాటు పలువురు గురువారం ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి నివాసంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వైసీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త మేరిగ మురళీధర్, ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి నగదు అందజేత

కోట: పట్టణంలోని కొక్కుపాడు క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్న కొండాపురం మస్తానయ్యకు గురువారం రూ.8వేల నగదును తహసీల్దార్ కేఎం రోజ్‌మాండ్ అందజేశారు. ఇటీవల మస్తానయ్యకు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ ప్రమాదంలో కట్టుబట్టలతో మస్తానయ్య కుటుంబం బయటపడింది. దీంతో అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అందించే రూ. 8వేలను బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో రమేష్‌బాబు, రాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

గూడూరు: పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పటిష్ఠంగా రైల్వేశాఖ స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీఈఈ సురేష్ అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల అఖరు వరకు అన్ని రైల్వేస్టేషన్‌లలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్టేషన్ల పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రయాణికులలో పరిశుభ్రతపై అవగాహన పెంచేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ తిలగం, వీవీ రావు, గిరి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న సీనియర్ డీఈఈ సురేష్

మాధవాపురంలో చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్

వాకాడు: మండలంలోని చినతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాధవాపురం, పున్నమానితిప్ప, మొనపాళెం, ఓడపాళెం, వైట్‌కుప్పం, పాఠశాలల్లో విద్యార్థులకు, బడి బయట పిల్లకు గురువారం చినతోట వైద్యులు డాక్టర్ వీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఏఎన్‌ఎం ఎంబేటి కామేశ్వరి తట్టు, రూబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఎమ్మార్ టీకా వేశారు. అయితే మాధవాపురం వెళ్లేందుకు రోడ్డుమార్గం లేకపోవడం, సుమారు రెండు కిలోమీటర్లు నీటిలో ప్రయాణించాల్సి ఉండటం, ఇప్పటి వరకు చినతోట పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎం లేకపోవడం లాంటి కారణాలతో ఎంతో కాలంగా అక్కడి పిల్లకు, గర్భిణులకు టీకాలు వేయడానికి వీలులేకుండా పోయింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎప్పుడో ఒకప్పుడు సిబ్బంది టీకాలు వేసేవారు. దీంతో ఒక్కసారిగా డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఇతర వైద్య సిబ్బంది మాధవాపురం గ్రామానికి వెళ్లడంతో గ్రామ ప్రజల ఆనందం వ్యక్తం చేశారు. వైద్య సేవలను ఇలాగే కొనసాగించాలని వైద్య సిబ్బందిని గ్రామస్థులు వేడుకున్నారు.



ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న కామేశ్వరి

ఆలయ అభివృద్ధికి చర్యలు

గూడూరు(రూరల్): స్థానిక తాళమ్మ ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టినట్లు పాలక మండలి సభ్యులు అన్నారు. గురువారం స్థానిక ఆలయ ఆవరణలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన కల్యాణ మండప నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో నేలపై చలువ రాళ్ల పరవడం, పిల్లలకు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు, భక్తుల సేద తీరేందుకు చర్యలు, భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు పొయ్యిల ఏర్పాటు వంటి పనులను పూర్తి చేశామన్నారు. అదేవిధంగా దాతల సహకారంతో కల్యాణ మండప నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నిర్వాహకులు

● ఇంటర్వ్యూ



బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

● అబ్దుల్ జలీల్, సీఐ, ఎక్సైజ్ శాఖ

? మండలంలో బెల్టుషాపులు నియంత్రణకు చర్యలు చేపట్టారా.

! మండలంలో ఉన్న బెల్టుషాపులను పూర్తిగా అరికట్టాం. బెల్టుషాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేశాం. ఇప్పటికీ ఎక్కడైనా ఉన్నట్లయితే 9440902514 నెంబరుకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

? సర్కిల్ పరిధిలో బెల్టుషాపులు నియంత్రించారా.

! బెల్టుషాపుల విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఉన్న ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో ఎక్కడా బెల్టు షాపులు ఉండకూడదన్నదే లక్ష్యం. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.

? బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే లైసెన్స్ షాపులపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు.

! లైసెన్స్ మద్యం షాపులకు తగిన నిబంధనలు ఉన్నాయి. ఇప్పటి వరకు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. స్పష్టమైన సమాచారం అందితే ఆ షాపుపై చట్టపరమైన చర్యలు చేపడుతాం. జూలైలో బెల్టుషాపుల నిషేధంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన పుటి నుంచి బెల్టుషాపు నిర్వాహకులపై 8 కేసులు నమోదు చేసి, 81 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నాం.

- వాకాడు

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం


బీద రవిచంద్రను సన్మానిస్తున్న పేట టీడీపీ నాయకులు

నాయుడుపేటరూరల్ : జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తానని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నాయుడుపేట, దొరవారిసత్రం టీడీపీ మండల అధ్యక్షులు కామిరెడ్డి రాజారెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆయనను కలసి శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పేట నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలుకు పూర్తిగా సహకరిస్తామని నాయకులకు ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, టీడీపీ జిల్లా రైతుసంఘ నాయకులు జలదంకి మధుసూదన్‌రెడ్డి, నాయుడుపేట మండల ప్రధాన కార్యదర్శి బిరదవాడ నారాయణ, పుదూరు రత్నం, తదితరులు ఉన్నారు.

పాతవారికే మధ్యాహ్న భోజన బాధ్యతలు


పాఠశాలలో సమావేశమైన అధికారులు

నాయుడుపేటరూరల్ : మధ్యాహ్నభోజన పథకాన్ని పాత నిర్వాహకులే సక్రమంగా నిర్వహించేలా చూడాలని తహసీల్దార్ మైత్రేయ, ఎంపీడీవో శివయ్య, ఎంఈవో శ్రీనివాసులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం తెలిపారు. గతంలో ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో వివాదం చోటుచేసుకుంది. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి వెళ్లగా సమగ్ర విచారణ అనంతరం గతంలో నిర్వహిస్తున్న మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకురాలు చంద్రమ్మకే బాధ్యతలు అప్పగించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయమై ఎటువంటి వివాదాలు తలెత్తితే అందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని చంద్రమ్మ నిర్వహించేలా కలెక్టర్ ద్వారా వచ్చిన ఉత్తర్వులను పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ రవికుమార్, కార్యదర్శి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పంచాయతీ అధికారులు

తడ : మండలంలోని వేనాడులో వెలసి ఉన్న దావూద్‌షావలి అల్లాతాత దర్గా ప్రాంగణంలో పంచాయతీ సర్పంచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సుమారు వంద మొక్కలను నాటారు. గ్రామ పెద్దలతోపాటు దర్గా ముజావర్ ముక్తీయర్ పాల్గొన్నారు.

మద్యంషాపులో చోరీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట జీఎన్‌టీరోడ్డులో తాజ్ పెట్రోల్‌బంకు పక్కన ఉన్న ఎడీఆర్ వైన్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఆ వైన్‌షాపు పైకప్పు రేకులను తొలగించి 60వేల నగదు దోచుకెళ్లారు.

మూడో మద్యంషాపు వద్దు

తడ : గ్రామానికి మూడవ మద్యంషాపు వద్దని రామాపురం గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ మేరకు పంచాయతీ సర్పంచ్ సుశీల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- చిన్నపాటి వర్షానికే చిత్తడిగా వీధులు
- పలుచోట్ల కానరాని సీసీ రోడ్లు
- డ్రైనేజీ వ్యవస్థ ఊసేలేదు


మేలనాలత్తూరులో దళితవాడకు వెళ్లే వీధి దుస్థితి

దొరవారిసత్రం: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు.. అలాంటి పల్లెలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పల్లెల్లో ఎటుచూసినా బురదమయమైన రోడ్లు, మురుగునీటి నిల్వలు, వెలగని వీధిలైట్లతో దర్శనమిస్తున్నాయి. దొరవారిసత్రం మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా, 76 క్లస్టర్ గ్రామాలు ఉన్నవి. ఈ గ్రామాల్లో సగానికిపైగా వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి కూడా నీరు నిలిచిపోయి వీధులన్నీ బురదమయమయ్యాయి. ఓ వైపు పేడదిబ్బలు, మరో వైపు మురికినీటి నిల్వ గుంటలతో వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయి.

సిమెంట్ రోడ్లు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు సీసీ రోడ్లు వేయించింది. గత యేడాది జాతీయ ఉపాధీ హామీ పథకం నిధులు, గ్రామ పంచాయతీ నిధులు కలిపి ఈ రోడ్లు వేయించారు. మండలంలో సుమారు 21 కిలోమీటరు మేర సిమెంట్ రోడ్లు వేశారు. దాదాపు 8 కోట్లు ఈ పనులకు వెచ్చించారు. సిమెంట్ రోడ్లు వేసిన చోట్ల గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడం కొంత ఇబ్బందికరంగా ఉంది. అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ పథకం నిర్వహణను పూర్తి స్థాయిలో చేయకుండానే ఆపివేయడంతో వీధులన్నీ అధ్వానంగా మారాయి.


గొల్లపాళెం మసీద్ వీధిలో రోడ్డుపైనే మురుగు

అధికారులు స్పందించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి నిధులు వినియోగించుకోవాలి


సిమెంట్ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం వేయించింది. ఈ పథకంను పూర్తి స్థాయిలో అమలయ్యేందుకు ఉపాధి నిధులు వాడుకోవాలి. అప్పుడు అన్ని గ్రామాల్లో రోడ్లు పూర్తవుతాయి. ప్రజలు పరిశుభ్రమైన వాతావరణంలో జీవించగలరు.

- మస్తాన్ , శ్రీధనమల్లి

డ్రైనేజీ వ్యవస్థ తీసుకురావాలి


సిమెంట్ రోడ్లు గ్రామంలో అన్ని వీధులకు వేస్తే గ్రామం అందంగా కనిస్తుంది. అలాగే ఈ రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావాలి. డ్రైనేజీ వ్యవస్థ లేక పోతే సిమెంట్ రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల రోగాలు ప్రబలుతాయి.

- బాషా, గొల్లపాళెం

పారదర్శకంగా ఇసుక అందాలి: ఆర్డీవో

నాయుడుపేట : ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ప్రజా ప్రయోజనాలకు ఎటువంటి ఆటంకం లేకుండా పారదర్శకంగా వారికి ఇసుక అందేలా రెవెన్యూ, పోలీస్‌లతోపాటు ఇతరశాఖలు సహకరించాలని ఆర్డీవో శీనానాయక్ అన్నారు. నాయుడుపేట ఆర్డీవో కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయిలోని రెవెన్యూ, పోలీస్, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకు ఉపకరించే అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు కలెక్టర్ ముత్యాలరాజు ఇసుకపై నాల్గవ ఉత్తర్వులు జారీ చేశారన్నారన్నారు. అందులో భాగంగా నూతనంగా డివిజన్‌లోని నాయుడుపేట మండలంలో నాయుడుపేట, తుమ్మూరు, మర్లపల్లి, అన్నమేడు, సూళ్లూరుపేట మండలంలో ఇలుపూరు, పందలగుంట, యర్రబాలెం, కేశవరెడ్డిపాళెం, సూళ్లూరుపేట, కొణ్ణెంబట్టు, మన్నారుపోలూరు. దొరవారిసత్రం మండలంలో తనియాలి, వేటగిరిపాళెం, మర్లపాడు, బురదమడుగు, మోదుగులపాళెం. తడ మండలంలో వాటంబేడు, గొల్లలమలుగు, వెలగలపాడు. పెళ్లకూరు మండలంలో పెళ్లకూరు, చిల్లకూరు, చావాలి, తాళ్వాయిపాడు తదితర


డివిజన్‌లోని రెవెన్యూ, పోలీస్, ఇతర అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

గ్రామాల్లో ఆయా తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్ఐలు ముగ్గురు కలసి సమన్వయంతో ఉచిత ఇసుక తరలింపులో పనిచేయాలని ఆదేశించారు. ఆయాశాఖల అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు ఎంతంత మోతాదుల్లో ఇసుక కావాలని పరిశీలించి ఇసుకను అందజేయాలని కోరారు. శుక్రవారం నుంచి అమలు చేయాలని ఆర్డీవో శీనానాయక్ ఉత్తర్వులు జారీచేశారు. ఆరు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పీఆర్‌డీఈ రమణ, నాయుడుపేట ఆర్డీవో కార్యాలయ ఎవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో వర్షం

నాయుడుపేట : నాయుడుపేటలో గురువారం సాయంత్రం వరకు మరో ఎండాకాలం తలపిస్తూ ఎండలు తీవ్రంగా కాశాయి. సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని ఒక్కసారిగా చల్లటి వాతావరణం నెలకొంది. రాత్రి 7.15 నిమిషాల నుంచి చల్లటి ఈదురు గాలులు వీచడంతోపాటు జోరు వర్షం కురిసింది. దాదాపు 30 నిమిషాల పాటు జోరున వర్షం కురవడంతో పట్టణంలోని పలు వీధులన్నీ జలమయం అయ్యాయి.


వర్షానికి జలమయమైన రోడ్డు

అధ్వానంగా గ్రామీణ రహదారులు


రాళ్లు మొనతేలిన యర్రప్పశెట్టికండ్రిగ రోడ్డు

గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వాహనచోదకులు నానాఅవస్థలు పడుతున్నారు. నాయుడుపేట మండలంలో అత్తలపాళెం రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డులోని తారుకాస్త మాయమై ఎత్తుపల్లాలుగా మట్టిరోడ్డును తలపిస్తోంది. మండలంలోని యర్రప్పశెట్టికండ్రిగ రోడ్డులో రాళ్లు మొనతేలి ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం చిన్న వర్షం కురిసినా ఈ దారి చిత్తడిచిత్తడిగా మారిపోతుంది. నాయుడుపేట పట్టణాన్ని ఆనుకొని ఉన్న జువ్వలపాళెంరోడ్డు ఎగుడుదిగుడుగా అస్తవ్యస్తంగా ఉంది. దాదాపు పట్టణంలో కలసి ఉండే ఈ గ్రామం నుంచి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు గ్రామీణ రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

- నాయుడుపేట


ఎగుడుదిగుడుగా జువ్వలపాళెం రోడ్డు

20న వీఆర్‌ఏల సర్వసభ్య సమావేశం

ఓజిలి: వీఆర్‌ఏల సర్వసభ్య సమావేశం ఈనెల 20న నెల్లూరులోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మేరిగ రమేష్ గురువారం తెలిపారు. ఈమేరకు ఆయన ఓజిలిలో మాట్లాడుతూ ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఆయనవెంట నాయుడుపేట డివిజన్ అధ్యక్షులు జి శంకరయ్య, ఓజిలి మండల అధ్యక్షులు ఎస్ రమణయ్య తదితరులు ఉన్నారు.

కోళ్లకు మందుపెట్టి చంపేశారని ఫిర్యాదు

తడ : తమ కోళ్లకు మందుపెట్టి చంపేశారని మండలంలోని వెండ్లూరు గ్రామానికి చెందిన చెంచురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం రాత్రి బాగానే ఉన్న పది కోళ్లు గురువారం ఉదయం లేచే సరికి చనిపోయి ఉండటం గమనించాడు. పక్క ఇంట్లోవాళ్లే మందుపెట్టి చంపివేశారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి

తడ : అనుమానిత వ్యక్తులు గ్రామంలోకి వస్తే అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించాలని శ్రీహరికోట మెరైన్ ఏఎస్ఐ ప్రభాకర్‌వర్ధన్ కోరారు. గురువారం వేనాడు గ్రామంలో గ్రామస్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దర్గా దర్శనానికి అంటూ వచ్చే భక్తుల్లో అనుమానితులుగా ఉంటే ఆ సమాచారాన్ని తమ పోలీస్‌శాఖకు తెలపాలన్నారు. ఈ అవగాహన సదస్సులో సర్పంచ్ శ్రీదేవి, సుదర్శన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా...



మాట్లాడుతున్న కిషోర్‌నాయుడు

చిట్టమూరు : కార్యకర్తల సహాయ సహకారంతో టీడీపీ పార్టీని బలోపేతం చేస్తానని మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. గురువారం చిట్టమూరులో నూతన తెలుగుదేశంపార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోని కార్యకర్తలకు అండదండగా ఉంటూ పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రతి నెల కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తానన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చిట్టమూరు మండలానికి అభివృద్ధి దశగా తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ పార్టీకి అత్యధిక మెజార్టీని తీసుకువస్తామన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు, కన్వీనర్, ఎంపీపీ ఉక్కు జనార్ధన్‌లను పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉక్కు జనార్ధన్, మాజీ మండల కన్వీనర్ దువ్వూరు మస్తాన్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, శ్రీనివాసులు, బాబురెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చిట్టమూరు : మండలంలోని గునపాడు ఉన్నత పాఠశాలలో శ్రీషిరిడీ సాయి అక్షరాస్యత సేవాసమితి దాతృత్వంతో పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం 9, 10వ తరగతి విద్యార్థులకు ఆ ట్రస్టు సేవాసమితి ఛైర్మన్ రమణయ్య చేతులు మీదుగా అందజేశారు. ఈ సేవాసమితి నిర్వాహకులను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. సేవచేయడంలో ఎంతో ఆత్మసంతృప్తి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వెంకట రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్షగాళ్లకు చిరు భోజనం పంపిణీ

సూళ్లూరుపేట : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని సూళ్లూరుపేట మెగా అభిమానులు గురువారం భిక్షగాళ్లకు భోజనం పొట్లాలు పంపిణీ చేశారు. చెంగాళమ్మ ఆలయం వద్ద పట్టణంలో ఉన్న 70 మంది భిక్షగాళ్లకు భోజనం పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ అభిమానులు హేమంత్‌కుమార్, మాబాషా, ప్రభు, రేవంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భిక్షగాళ్లకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న అభిమానులు

నాణ్యతకు మంగళం

- ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం
- మట్టితో కాంక్రీట్ మిక్సింగ్...
- ప్రజాధనం మట్టిపాలు
- అధికారుల చోద్యం

ఓజిలి: పునాదులపైనే భవనం పటిష్టత ఆధారపడి ఉంటుంది. పునాదులు సరిగా లేకుంటే అది ఎక్కువ కాలం ఉండదు. భవన నిర్మాణాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులే నాణ్యతకు తిలోదకాలు పలకడంతో దాని పటిష్టతపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఓజిలి మండలం పెద్దపరియలో కోటి 18 లక్షల రూపాయల వ్యయంతో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది.. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ ప్రవేటు వ్యక్తి కనుసన్నల్లో పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఈవైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో పనులు నాసిరకంగా జరుగుతున్నాయి.

కాంక్రీట్‌లో నల్లమట్టి...

నిర్మాణ పనులకు సమీపంలో ఉన్న బారుబావి నుంచి వచ్చిన నల్లని మట్టిని మిక్స్‌చేసి కాంక్రీట్‌లో కలుపుతున్నారు. గ్రామస్థులు అడిగితే పట్టించుకోవడంలేదు. ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవడంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యమైంది. వర్క్‌ఇన్స్‌పెక్టర్ కాంట్రాక్టరుతో చేతులు కలపాడనే ఆరోపణలున్నాయి.

లోకల్ మెటల్‌తో నిర్మాణం..

ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణానికి గుర్తింపు పొందిన క్వారీలనుంచి తీసుకువచ్చిన మెటల్‌ను ఉపయోగించాలి. ఈ భవనానికి చిత్తూరు జిల్లా తంగేళ్లపాళెం మెటల్‌ను ఉపయోగించాలని ప్రభుత్వం సూచించింది. ఇక్కడ పునాదులనుంచే లోకల్ మెటల్ వాడుతున్నారు. పిల్లర్లకు, బీములకు లోకల్ మెటల్‌నే వినియోగిస్తున్నారు. ఈ మన్ను ఎక్కువ బరువు ఉండటంతోపాటు భవన నిర్మాణానికి సరిగా ఉండదు. ఇది తెలిసినా నిర్మాణదారులు పట్టించుకోవడంలేదు.

లేచిపోతున్న కాంక్రీట్

భవన నిర్మాణంలో భాగంగా వేసిన కాంక్రీట్ దిమ్మె రెండో రోజు చిన్న కర్రతో పొడిస్తే లేచిపోతోంది. సాధారణంగా కాంక్రీట్ రెండు గంటలు క్యూరింగ్ అయిందంటే పటిష్టంగా మారుతుంది. ఇక్కడ నిర్మిస్తున్న భవనం కాంక్రీట్ దిమ్మె రెండో రోజే లేచిపోతోంది.



నిర్మాణంలోని ఆస్పత్రి భవనం

నీటి సౌకర్యం లేకుండానే...

సాధారణంగా భవనం నిర్మాణంలో మొదట నీటి సౌకర్యం ఏర్పాటుపై దృష్టిపెడతారు. ఇక్కడ కోటి 18 లక్షల రూపాయల వ్యయంతో ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పనుల కోసం ఎలాంటి నీటి వసతిని ఏర్పాటుచేసుకోలేదు. ట్యాంకర్ తెచ్చుకుని చిలకరింపు చల్లినట్లు క్యూరింగ్, కలిసీ కలవని మిక్సింగ్‌తో పనులు కానిచ్చేస్తున్నారు.



కలవలో కలుపుతున్న మట్టి

చెప్పిందిచేయ్



ఇసుకతోపాటు మెటల్, సిమెంటు వేసి మిక్సర్‌లో కలుపుతున్నాం. పక్కనేవున్న నల్లమట్టిని కలపమని చెప్పారు. ప్రశ్నిస్తే కూలీవి... నీకెందుకు... చెప్పింది చెయ్ అన్నారు. అలానే చేశాము.

- గంగాల శ్రీనివాసులు, కూలీ

నిర్లక్ష్యం తగదు



పదికాలాల పాటు ఉండాల్సిన ఆసుపత్రి భవనం ఇది... దీని నిర్మాణంలో ఇలాంటి అవకతవకలు, నిర్లక్ష్యం సహించరానిది.. అధికారులు పర్యవేక్షణ ఉండాలి. లేకపోతే ఆందోళన చేపడుతాం

- కొండూరు సునీత, పెద్దపరియ సర్పంచు

అవకతవకలు తగదు



ఆసుపత్రి భవనం నిర్మాణంలో లోకల్ మెటల్ వాడటం, నల్లమట్టి కలపడం తగదు నీటి సౌకర్యం లేకుండా క్యూరింగ్ ఎలా చేస్తారో. అధికారులు పర్యవేక్షించాలి.

- చైర్మన్ కొండూరు సుబ్రహ్మణ్యంరాజు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు ?

- శాశ్వత రోడ్డు కోసం దశబ్దాలుగా ఎదురు చూస్తున్న వేనాడు గ్రామస్థులు

తడ : అప్పుడెప్పుడో 1992లో ఏర్పాటు చేసిన రోడ్డు ఇది... ఆ రోడ్డుకి అప్పట్లో నిర్మించిన బ్రిడ్జిలు అవి.. నేడు ఆ రోడ్డుకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు నేలకూలుతున్నాయి. తద్వారా కొద్ది రోజుల్లో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే ఆస్కారం ఏర్పడింది. ఆ గ్రామమే పులికాట్ సరస్సులో ఉన్న వేనాడు దీవి... సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప నుంచి వేనాడు గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల మేర పులికాట్ సరస్సులో 1992లో రోడ్డును ఏర్పాటు చేశారు. పులికాట్ సరస్సులోని నీళ్లు అటు..ఇటు వెళ్లేలా మధ్య మధ్యలో చిన్నపాటి బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఈ రోడ్డును పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆ రోడ్డు నేటికీ మట్టిరోడ్డుగానే నిలిచిపోయింది. అయితే ఆ రోడ్డుకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. అందులో భాగంగా మూల గ్రామానికి సమీపంలో ఓ బ్రిడ్జి కూలి పోగా వేనాడు గ్రామ సమీపంలో మరో బ్రిడ్జి కూలి పోయేస్థితికి వచ్చేసింది. మూల గ్రామ బ్రిడ్జికి తాత్కాలిక అప్రోచ్‌రోడ్డును ఏర్పాటు చేశారు ఆ గ్రామస్థులు. వేనాడు గ్రామ సమీపాన ఉన్న ఈ బ్రిడ్జికి తాత్కాలిక రోడ్డు వేసేందుకు వీలుకాకపోవడంతో బ్రిడ్జికింద తూములనుపెట్టి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఇందుకోసం పంచాయతీ నిధుల నుంచి సుమారు 30వేల రూపాయల వరకు ఖర్చు పెట్టారు. వాస్తవంగా ప్రస్తుతం ఉన్న ఈ రోడ్డుపై శాశ్వత రోడ్డు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 6 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కానీ వన్యప్రాణి విభాగం చట్టాలు అడ్డురావడంతో ఈ రోడ్డుకు నేటికీ మోక్షం కలగలేదు. వేనాడు దీవి ఓ ప్రత్యేకత కలిగి ఉంది. అదేమిటంటే ఈ దీవిలో సుమారు 144 అడుగులతో దావూద్ షావలి అల్లాతాతా దర్గా ఉంది. ఈ దర్గా సందర్శనకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఈ పంచాయతీ నుంచి సుమారు 200 మంది విద్యార్థులు సూళ్లూరుపేటలో విద్యను అభ్యసిస్తున్నారు. ఇక గ్రామస్థుల సంగతి చెప్పనవసరంలేదు. ఏ అవసరం వచ్చినా సూళ్లూరుపేటకు రావాల్సిందే. అయినా సంబంధిత అధికారులు ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.





బ్రిడ్జికి మరమ్మతులు (ఇన్‌సెట్‌లో) రంధ్రం

నూజివీడు ట్రిపుల్ ఐటీకి తేజ స్కూల్ విద్యార్థి



సూళ్లూరుపేట : సూళ్లూరుపేట తేజా స్కూల్ విద్యార్థిని పి. దీప్తి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని స్కూల్ అధినేత మనోహర్‌కి తెలిపారు. టెన్త్ పరీక్షల్లో 10కి 10 పాయింట్‌లు సాధించిందని తెలిపారు. అలాగే మొదటి విడతతో తమ స్కూల్‌కు చెందిన కొమ్మల హరిత సైతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని గుర్తుచేశారు. అనంతరం దీప్తిని ఆయన అభినందించారు.

మద్యంషాపులో చోరీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట జీఎన్‌టీరోడ్డులో తాజ్ పెట్రోల్‌బంకు పక్కన ఉన్న ఎడీఆర్ వైన్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఆ వైన్‌షాపు పైకప్పు రేకులను తొలగించి 60వేల నగదు దోచుకెళ్లారు.

చాంపియన్ స్కూల్‌లో ఎంఆర్ వ్యాక్సిన్‌లు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట చాంపియన్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఎంఆర్ వ్యాక్సిన్‌వేశారు. ఎంఆర్ వ్యాక్సిన్‌పై వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. పాఠశాల చైర్మన్ చంద్రారెడ్డి, కరస్పాండెంట్ రవీంద్రకుమారి, హెచ్‌ఎం రమేష్ సహకరించారు. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన బి. అన్నపూర్ణ, ఎన్. కోటేశ్వరి, వేళంగణి, ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంఆర్ వ్యాక్సిన్ గురించి వివరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అక్షరాస్యత అభివృద్ధికి కృషి

ముత్తుకూరు: అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సాక్షరతా భారత్ కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచే బాధ్యత సాక్షరతా భారత్ కార్యకర్తలదేనన్నారు. మొక్కుబడిగా విధులు నిర్వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మండలంలో పలు పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణంలో ఇంకా వెనుకబడి వున్నామన్నారు. అనంతరం ఆయన వారికి ఎన్ఐవోఎస్ పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో గతంలో సీ గ్రేడ్ వారిని గుర్తించి వారి కోసం ఈసారి పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండల సాక్షరభారత్ కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ చెంచుకృష్ణయ్య, సూపరింటెండెంట్ రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

‘మరుగు’లో అవినీతి కంపు

● ఎన్జీవోలు, అధికారుల కుమ్మక్కు ● పక్కదారి పట్టిన ఆత్మగౌరవం నిధులు
● అసంపూర్తిగా నిర్మాణాలు ● చెల్లింపుల్లో గందరగోళం

పొదలకూరు: ఆత్మగౌరవం ఆశయం పక్కదారిపడుతోంది. ఆత్మగౌరం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాల్సిన అధికారులే ఎన్జీవోలతో కలిసి నిధులు స్వాహాకు పాల్పడ్డారు. ఈ సంఘటన పొదలకూరులో చోటుచేసుకొంది. కొందరు లబ్ధిదారులు తాము మరుగుదొడ్లు నిర్మించుకొని 10నెలలు గడిచినా మాకు బిల్లులు రాలేదని టీడీపీ నాయకులకు సంప్రదించారు. దీంతో మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి కంపు వెలుగులోకి వచ్చింది. పొదలకూరు పంచాయతీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణంలో అడుగడుగనా అక్రమాలు చోటుచేసుకున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ నుంచి బిల్లు పెట్టే అధికారి వరకు అవినీతికి పాల్పడి తమ జేబులు నింపుకున్నారే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా లక్షల రూపాయలు ప్రభుత్వానికి గండి పడింది.


నరసారెడ్డి కాలనీలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి, దీనికే బిల్లు చేసిన అధికారులు

మరుగుదొడ్ల నిర్మాణం ఇలా...

ఆత్మగౌరం పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ఆ గ్రామాన్ని వోడీఎఫ్‌గా ప్రకటిస్తారు. ఇందులో భాగంగా పేద, ధనిక అనే తేడా లేకుండా గ్రామంలో మరుగుదొడ్డిలేని ప్రతి ఒక్కరిని గుర్తించి మంజూరు చేస్తారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ.15వేలు మంజూరు చేస్తుంది. గ్రామంలోని మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు మండల స్థాయి అధికారులను ఒక్కో గ్రామానికి ఒక్కో అధికారిని ప్రత్యేకాధికారిగా నియమింప చేశారు. వీరి పర్యవేక్షణలో రెండు విడతలుగా లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తారు. లబ్ధిదారులు మరుగుదొడ్డి నిర్మాణంలో బేస్‌మెంట్ వేసుకొని గుంతలు తవ్వుకొని వరలు వేసుకుంటే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి పరిశీలించి జీపీఆర్ఎస్ విధానంతో ఫొటో తీసి ఆన్‌లైన్ చేసిన తరువాత మొదటి బిల్లు రూ.6వేలు రూపాయలకు రెకమండ్ చేస్తారు. మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయిన తరువాత మరో ఫొటో తీసి అప్‌లోడ్ చేసిన తరువాత రెండో బిల్లు మిగిలిన రూ.9వేలు లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తారు. కాగా ఇదివరకు ఎవరైనా మరుగుదొడ్లు నిర్మించుకొని ఉంటే వాటికి మరమ్మతుల క్రింద రూ.6వేలు మాత్రమే మంజూరు చేస్తారు. అయితే ఇంట్లో మెట్ల కింద, డబుల్‌బెడ్‌రూమ్‌లో ఆటాచ్‌డ్ బాత్‌రూమ్‌ల క్రింద మంజూరుకు అర్హత లేదు. పొదలకూరులో మాత్రం పాత మరుగుదొడ్లకు బిల్లులు భారీగానే చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

మరుగులో ఎన్జీవోల పాత్ర

మరుగుదొడ్లు నిర్మంచుకోలేని వారిని గుర్తించి ఎన్జీవోలకు వాటి బాధ్యతను అప్పగిస్తారు. ఇక్కడే అవినీతికి బీజం పడింది. ఆయా గ్రామాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇందులో ఎన్జీవోలుగా చేరి నిధులు స్వాహాకు శ్రీకారం చుట్టారు.

భారీగా అక్రమాలు

పొదలకూరులో జరిగిన మరుగుదొడ్ల నిర్మాణంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. లబ్ధిదారులు నిర్మించుకున్న మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి వారి ఖాతాలో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం ఖాతాల్లో కాకుండా ఎన్జీవోల ఖాతాలో జమ చేశారు. తెలియక పొరపాటు జరిగి ఉంటే ఒకటో, రెండో జరగాలి, కానీ ఇక్కడ మాత్రం పెద్ద మొత్తంలో లబ్ధిదారులకు చేరాల్సిన నగదు ఎన్జీవోల ఖాతాల్లో చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పొదలకూరు పంచాయతీలో సుమారు 1056మరుగుదొడ్లు నిర్మించగా అందులో 7మంది ఎన్జీవోల ఖాతాల్లో ఇప్పటి వరకు అధికారులు 75.36లక్షలు జమ చేశారు. పొదలకూరు మండలాన్ని మార్చినెలలో జిల్లా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ వోడీఎఫ్‌గా ప్రకటించారు. అయితే పొదలకూరులో జరిగిన విధంగానే మండల మొత్తం మరుగు నిర్మాణంలో అవినీతి కంపుకొడుతోందని వాదనలు వినిపిస్తున్నాయి.

నిర్మాణం పూర్తి కాకుండానే బిల్లు చేసుకున్నారు


మా ఇంటిలో ఓ ఎన్జీవో మరుగుదొడ్డి నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. నిర్మాణం పూర్తి కాకుండానే పూర్తి అయినట్లు బిల్లు చేసుకుని తినేశారు. ఇలా పంచాయతీ పరిధిలో చాలా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో విచారణ జరిపించి నిర్మాణాలు పూర్తి చేయించాలి.

- బొల్లినేని భారతమ్మ, ఎంపీటీసీ, పొదలకూరు

విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం


పొదలకూరు మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదు అందాయి. మరుగులో చోటుచేసుకున్న అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తున్నాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎవరైతే సొంతగా నిర్మించుకున్నారో వాటికి సంబంధించి ఎన్జీవోల ఖాతాల్లో పడ్డ నగదును తిరిగి వారికి చెల్లించాలని ఎన్జీవోలకు ఆదేశాలిచ్చాం.

- నారాయణరెడ్డి, ఎంపీడీవో, పొదలకూరు

ఆత్మగౌరవానికి అప్రతిష్ట తెస్తున్నారు..


అందరికీ మరుగుదొడ్డి ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం చేపట్టిన ఆత్మగౌరం పథకాన్ని కొందరు అక్రమార్కులు అప్రతిష్టపాలు చేస్తున్నారు. నేరుగా లబ్ధిదారుడికి చేరాల్సిన నగదు పక్కదారి పట్టడంతో బిల్లులు కావడం లేదని ప్రజలు బాధపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్డు నిర్మించకుండానే బిల్లులు చేసుకున్నట్లు తేలింది. ఒక్క పొదలకూరు ఆత్మగౌరంలోనే సుమారు 20లక్షలకు పైగా నిధులు పక్కదారి పట్టాయి.

- బీ మల్లికార్జుననాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, పొదలకూరు

● ఇంటర్వ్యూ



పందుల నివారణకు చర్యలు

సీహెచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో

?:ముత్తుకూరులో పందుల సంచారం అధికంగా వుంటోంది.

!: పంచాయతీలో పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకుంటాం. పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేశాం. గడువు లోపల ఊరికి దూరంగా పందులను తరలించుకోవాలని సూచించాం.

?: పన్నుల వసూళ్లు ఎలా వున్నాయి.

!: పన్నుల వసూళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. బకాయి దారులను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. వంద శాతం పన్నులను వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

?: పారిశుధ్యం మెరుగు పర్చేందుకు ఏం చర్యలు చేపట్టారు.

!: ముత్తుకూరులో ప్రధాన డ్రైనేజీ కాలువలను శుభ్ర చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు చెత్తను తరలిస్తున్నాం. ప్రధాన రహదారి వెంబడి వ్యాపారస్తులు, దుకాణాదారులు చెత్తను కాలువల్లో పడవేయడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ఈ విషయంలో స్వయం నియంత్రణ అవసరం.

?: పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు

!: డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు గ్రామంలోని వీధుల్లో సైడు కాలువలు నిర్మిస్తున్నాం. రాత్రిళ్ల ఇబ్బందులు లేకుండా వీధి దీపాలు ఏర్పాటు చేశాం.

- ముత్తుకూరు

భోజనం వద్దంటూ
వాహనం అడ్డగింత

మనుబోలు : పాఠశాలలకు వచ్చే మధ్యాహ్న భోజనాన్ని తినలేకపోతున్నామని, అది మాకు వద్దంటూ స్థానిక బాలుర ఉన్నత పాఠశాల పదో రతగతి విద్యార్థులు గురువారం భోజనం దించేందుకు వచ్చిన వాహనాన్ని అడ్డుకున్నారు. రెండురోజులుగా పొంగలి, పెరుగన్నం పెడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం నెలరోజులగా గుడ్డు వేయడం లేదంటూ విద్యార్థులు ఆందోళన చేశారు. ఉపాధ్యాయులు సర్ది చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. వచ్చిన అన్నం వంద మంది విద్యార్థులకు సరిపడకపోవడంతో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తోకలపూడి సురేష్ రూ. 500లకు బిస్కెట్ ప్యాకెట్లు తీసి పంపిణీ చేసి పిల్లల ఆకలి తీర్చాడు. మధ్యాహ్న భోజనం చాలీచాలకుండా ఉండటంతోపాటు రుచిగా ఉండడం లేదంటూ పిల్లల తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు మండిపడుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని వారు కోరుతున్నారు.


భోజనం తీసుకువచ్చే వాహనాన్ని అడ్డుకున్న పదో తరగతి విద్యార్థులు


పొదలకూరు అభివృద్ధిపై
సోమిరెడ్డి ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న మోపూరు శ్రీనివాసులురెడ్డి, తదితరులు

పొదలకూరు: పొదలకూరు అభివృద్ధిపై మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మోపూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. సోమిరెడ్డి కృషితో పొదలకూరు మండలం ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. కండలేరు ఎడమగట్టు కాలువపై 62కోట్లతో ఏర్పాటు చేసిన శాశ్వత ఎత్తిపోతల పథకం రెండవ పంపు కూడా ట్రయిల్‌రన్ చేశామన్నారు. సెప్టెంబరులో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని అన్ని రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వీ పుల్లయ్యగౌడ్, డీ రఘురామిరెడ్డి, సుబ్బరామనాయుడు, బీ మల్లికార్జుననాయుడు, షేక్ జమీర్‌బాషా, ఆర్ భాస్కర్‌గౌడ్, కే వెంకటేశ్వర్లునాయుడు, ఏ సుధాకర్‌రెడ్డి, కే పెంచలభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

మనుబోలు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న పీ సుబ్బయ్య ఈనెల 15వ తేదీన జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాధ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇందుకు గాను సుబ్బయ్యను గురువారం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మౌలాలి శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


అధాప్యకుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మౌలాలి

పండ్ల తోటల రైతులను ఆదుకోండి

కలిగిరి: ఉద్యాన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కావలి డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్స్ కమిటీ సభ్యుడు టీసీ మాల్యాద్రినాయుడు విజ్ఞప్తి చేశారు. ఇటీవల విజయవాడలోని సిద్దార్థ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సేంద్రీయ వ్యవసాయ నర్సరీ మేళా రైతు అవగాహన సదస్సులో రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవిచౌదరికి స్థానిక రైతులతో కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. జిల్లాలో రెండేళ్లుగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఉద్యాన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు

కలువాయి: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించని ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో జీ.సుధీర్‌బాబు హెచ్చరించారు. గురువారం మండల విద్యా వనరుల కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మెనూతో పాటు భోజనం పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. భోజనం ఎలా ఉండాలి.. ఎలా వడ్డించాలన్న దానిపై దృశ్య శ్రావణ (వీడియో) ద్వారా వీక్షింప చేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని, దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాటుమడుగులో రథయాత్ర



కమలానంద స్వామికి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ

డక్కిలి: గ్రామ దేవాలయ సందర్శన రథయాత్ర డక్కిలి పల్లెల్లో కొనసాగుతోంది. గురువారం మండలంలోని మాటుమడుగు, శ్రీపురం, దగ్గవోలు గ్రామాల్లో సాగింది. మాటుమడుగులో ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి దేవాలయ సందర్శన రథయాత్ర కార్యక్రమంలో కమలానందభారతి స్వామికి స్వాగతం పలికారు.

30న వైసీపీ నవరత్నాల సభ



స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీచైర్మన్ బొమ్మిరెడ్డి

వెంకటగిరి(టౌన్): పట్టణంలో ఈ నెల 30వ తేదీన వైసీపీ నవరత్నాల సభ నిర్వహిస్తున్నట్లు జడ్పీ చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీడీ కల్యాణ మండపం ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణాధ్యక్షుడు గుమ్మళ్లపు డిల్లీబాబు, గిరి రెడ్డి, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇల్లు కట్టేదెలా..?

- గృహ నిర్మాణాలకు ఇటుకల భారం
- రెండు వేల రాయిలు రూ.15 వేలు
- ప్రభుత్వ గృహాలపై అనాసక్తి
- లబ్ధిదారుల ఆందోళన



ఇటుక బట్టీలు


డక్కిలి: ఇటుకల ధర విపరీతంగా పెరగడంతో ఇల్లు కట్టేదెలా.. అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రెండు వేల ఇటుకలు సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉండటంతో ప్రభుత్వం మంజూరు చేసే పక్కా గృహాలపై లబ్ధిదారులు అనాసక్తి చూపుతున్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించి వినియోగదారులు ఇటుకల ధరలు ఆకాశాన్ని అంటడంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేకున్నారు. ఇటుకల ధర సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో సొంతింటి కల నెరవేరడం లేదు. ప్రస్తుతం మండల, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వెయ్యి ఇటుకలు ఐదు నుంచి ఏడు వేల రూపాయలు వరకు ధర పలుకుతోంది. ఇటుకల తయారీకి మట్టి, ఇసుక, కర్రలు తదితర పరికరాలు వినియోగిస్తారు. ఇవి దూర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి ఉండటంతో ఇటుకల ధరను అమాంతంగా పెంచేశారు. ఒక ట్రాక్టరు ఇసుక రెండు నుంచి మూడు వేల వరకు పలుకుతోంది. ట్రాక్టరు మట్టి కల్లంకు చేరేటప్పటికి వెయ్యి నుంచి పదిహేను వందలు పలుకుతోంది. దీనికి తోడు కూలీల కూలి కూడా అధికం అయ్యాయి. ఇటుకలు తయారుచేసే నైపుణ్యం కలిగిన కూలీలు ఐదు వందల నుంచి ఆరు వందల వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఇటుకల తయారీ తడిసి మోపుడు అవుతోందని తయారీదారులు వాపోతున్నారు. ఇక ఇటుకలు కాల్చి పటిష్ఠ పరిచేందుకు వరిపొట్టు, బొగ్గు, కట్టెలు వినియోగిస్తారు. ప్రస్తుత ఎక్కడ కలప దొరకని పరిస్థితి ఏర్పడింది. ట్రాక్టరు కట్టెలు కొనుగోలు చేయాలంటే పదివేలు వరకు ఖర్చు అవుతోంది. దీంతో టన్ను కలప ధర 2వేలకు పైబడటంతో తయారీ దారులు ఎక్కువగా పొట్టును వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటుక ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగాయి. ఇటుక సైజు, నాణ్యతను బట్టి ధరలను నిర్ణయించి విక్రయిస్తున్నారు. బాగా నాణ్యవంతమైన ఇటుక పదివేల నుంచి పదిహేను వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం మండలంలో ఎన్టీఆర్ గృహకల్ప కింద పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో డక్కిలి నుంచే ఇటుకలు గ్రామీణ ప్రాంతాలకు చేరుతోన్నాయి. కొందరు వ్యాపారులు నాణ్యతలేని ఇటుకలను కొంత తగ్గించి ఇస్తున్నారు. ఇటుకల ధరలు అమాంతగా పెంచడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేసినా ఇళ్ల కట్టుకోలేని పరిస్థితి దాపురించిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇటుకలు కొనలేకున్నాం



సొంతిల్లు నిర్మాణం గగనమై పోతుంది. ఒకప్పుడు వెయ్యి ఇటుక రెండువేల నుంచి మూడు వేలు పలకగా ప్రస్తుతం ఆ ధర రెండింతలు పెరిగింది. దీంతో ఇటుకలు కొని ఇల్లు కట్టలేక పోతున్నాం. దీనికి తోడు సిమెంటు, స్టీలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇల్లు కట్టడం గగనమైంది. - పోలమ్మ

ధరలు భారీగా పెరిగాయి



ఇటుక ధరలు భారీగా పెరిగాయి. దీంతో పాటు స్టీలు, సిమెంట్ తదితర గృహ నిర్మాణాలకు అవసరమైన వస్తు సామాగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ఎన్‌టీఆర్ గృహ నిర్మాణం నత్తనడకన సాగుతుంది. రెండు వేలు ఇటుకలు ఇంటికి చేరాలంటే పదివేలు అవుతుంది. - మచ్చల వేణు

భక్తిశ్రద్ధలతో వరసిద్ధి వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి: పట్టణంలోని 4వ వార్డు బొప్పాపురం సాలెకాలనీలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకుడి ఆలయంలో గురువారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కలిశాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాజకుటుంబీకులు కుమార్‌రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, జిల్లా పరిషత్ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాటకచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'చందనం' జోలికొస్తే చెరసాలకే..



మాట్లాడుతున్న రామకృష్ణ

రాపూరు: ఎర్రచందనం చెట్లు నరికినా, స్మగ్లింగ్ చేసినా, దాచినా, సహకరించినా జైలుకు వెళ్లడం ఖాయమని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు డీఆర్వో రామకృష్ణ హెచ్చరించారు. తెగచెర్ల గ్రామంలో గురువారం ఎర్రచందనంపై రోడ్‌షో, లేజర్ షో ప్రదర్శించి మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా దొరకని ఎర్రచందనం వృక్షాలు మన జిల్లా అడవుల్లో ఉన్నాయన్నారు. వీటిని కాపాడుకోవడం మన బాధ్యత న్నారు. చెట్లను నరకడం, తరలించడం, స్మగ్లింగ్ చేయడం నేరమన్నారు. ఈ విషయంలో పట్టుపడితే కఠిన శిక్ష తప్పదన్నారు. అరుదైన సంపద అంతరించి పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇప్పటికైనా స్మగ్లింగ్ కార్యక్రమాలకు స్వస్తిపలకాలన్నారు. ఎర్రచందనం విలువ తెలియజేసే లేజర్ షో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, రమేష్, పాపారావు, సుబ్రహ్మణ్యం, శేఖర్, రాజు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలు

కలువాయి: వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఉచితంగా జింక్, జిప్సమ్, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు బయోమెట్రిక్ పద్ధతితో అందజేయనున్నట్లు పొదలకూరు సబ్‌డివిజన్ ఏడీ కె.నాగేశ్వరావు తెలిపారు. గురువారం కలువాయిలో ఆత్మ సౌజన్యంతో జరిగిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కౌల రైతులు కార్డులు పొందిన తరువాత వారికి పంటల ధ్రువీకరణ పత్రాలు కూడా ఇస్తామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత ఎంసీ. ఓబయ్య బిందుసేద్యం, పత్తి, కంది, వరి పైరులో ఎరువుల యాజమాన్యం, చీడపీడల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి ఏ.వాసు 2017-18 సంవత్సరంలో వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా ట్రాక్టర్ పరికరాలు, కల్టివేటర్, రోటోవేటర్ కావలసిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో ఆత్మ బీటీఎం. సత్యకుమార్, ఏటీఎం. ఎం. చైతన్య, గంగన్న, ఏఈవో సుబ్బారావు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొదలకూరు ఏడీ నాగేశ్వరావు

• ఇంటర్వ్యూ



ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన

• వెంకటేశ్వరరావు, ఎంఈవో

? విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారా.

! ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన జరుగుతుంది. విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, యోగా నిర్వహించాలని ఆదేశించాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా.

! గతంలో ఉపాధ్యాయుల కొరత ఉండేది. ప్రస్తుతం అన్ని ఖాళీలు భర్తీ చేశాం.

? మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరుగుతుందా.

! ప్రభుత్వ నిబంధనల మేరకు భోజన పథకం అమలు చేస్తున్నాం. ఈనెల 1 నుంచి కొత్త మెనూ కూడా పాటిస్తున్నారు. ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తున్నాం.

- వెంకటగిరి(టౌన్)

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని:	లై
జ్యోతిమహల్:	నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంబ :	జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్:	నేనే రాజు నేనే మంత్రి
వెంకటేశ్వరమహల్:	జయ జానకి నాయక